అనుదినం... జనస్వరం

www.navatelangana.com

సోమవారం 04-11-2024

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 305 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

బీసీ కులగణనకు డెడికేటెడ్ కమిషన్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీసీ కులగణనకు డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైకోర్టు తీర్పుకనుగుణంగా సోమవారం లోగా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కులగణనపై ప్రభుత్వానికి ఎలాంటి భేషజాలు లేవని సీఎం స్పష్టం చేశారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా రాష్ట్రంలో బీసీ కులగణన చేసి తీరుతామని పేర్కొన్నారు.

గంటకు 2.5 కోట్లు

రోజుకు రూ.60 కోట్లు



- మనం కడుతున్న వడ్డీల లెక్క ఇది... • రుణాలు, వడ్డీలు కలిపి రోజుకు రూ.200 కోట్లు
- నెలకు రూ.6 వేల కోట్లు • తలకు మించిన భారంగా అప్పులు • సంక్షేమ పథకాల అమలుకు తిప్పలు
- అందుకే చెల్లింపుల కాలపరిమితి 10 నుంచి 20 ఏండ్లకు పెంచాలంటున్న రాష్ట్ర ప్రభుత్వం

బి.వి.యన్.పద్మరాజు

'గంటకు సుమారుగా రెండున్నర కోట్లు.. ఆ చొప్పున రోజుకు సగటున రూ.60 కోట్లు...' ఇది ఏదో పేరు మోసిన కంపెనీ ఆదాయమో, రాబడో కాదు. రాష్ట్ర ప్రభుత్వం తన నెత్తి మీదున్న అప్పులకు వడ్డీ రూపంలో చెల్లిస్తున్న మొత్తం. ఈ లెక్కన అసలుకు సంబంధించిన కిస్తీలకు కలుపుకుని రోజుకు అక్షరాలా రూ.200 కోట్లు, నెలకు దాదాపు రూ.ఆరు వేల కోట్లకుపైగా చెల్లిస్తోంది. ఆర్థికశాఖ వర్గాలు చెబుతున్న దాని ప్రకారం... గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో చేసిన రూ.7.50 లక్షల కోట్ల అప్పులకు ఇంత పెద్ద మొత్తంలో కిస్తీలు, వడ్డీలు చెల్లించాల్సి వస్తోంది. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి (గతేడాది డిసెంబరు ఏడు) అక్టోబర్ వరకూ రూ.56,440 కోట్లను రీ పేమెంట్ల కోసం (అసలు, కిస్తీలు, వడ్డీలు కలిపి) ఖర్చు చేసింది. మరోవైపు జీతాలు, భత్యాలు, నిర్వహణ వగైరాల కోసం రూ.49,618 కోట్లను మార్కెట్ రుణాల రూపంలో తీసుకుంది. అయితే ఈ భారం ఖజానాకు నానాటికీ గుదిబండగా మారుతోందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఫలితంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. ముఖ్యంగా రైతు భరోసా, ఆసరా పింఛన్ల పెంపు, వ్యవసాయ కూలీలకు ఆర్థిక సాయం, మహిళలకు ఆర్థిక భరోసా, నిరుద్యోగ భృతి తదితరాంశాల అమలుకు ప్రతిబంధకంగా మారింది. మరోవైపు రుణమాఫీ కోసం సర్కారు రూ.18 వేల కోట్లను విడుదల చేసింది. తాజాగా ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రకటించిన ఒక డీఏ వల్ల రాష్ట్ర ఖజానాపై నెలకు రూ.3 వేల కోట్ల భారం పడుతోందని సర్కార్ వెల్లడించిన సంగతి విదితమే.

ఈ నేపథ్యంలో ఒకవైపు అప్పులు, కిస్తీలు, వడ్డీలను కడుతూ... మరోవైపు ప్రజోపయోగ కార్యక్రమాలను అమలు చేయటం ప్రభుత్వానికి కత్తి మీద సాములా తయారైంది. పరిస్థితి ఇప్పుడే ఇలా ఉంటే ముున్ముందు ఇంకెలా ఉంటుందోనని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రుణాలు, చెల్లింపుల భారాన్ని సాధ్యమైనంతగా తగ్గించుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది. గత బీఆర్ఎస్ సర్కార్... తాను చేసిన అప్పుల చెల్లింపులకు పదేండ్ల కాల పరిమితిని కోరింది. ఆ గడువు ఈ యేడాదితో తీరిపోయింది. ఇప్పుడు రేవంత్



సర్కార్ అనివార్యంగా వాటిని చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో అప్పులు, వాటి కిస్తీల చెల్లింపుల గడువు, కాల పరిమితిని పదేండ్ల నుంచి ఇరవై ఏండ్లకు పెంచాలంటూ రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి తదితరులు వేర్వేరు సందర్భాల్లో ప్రధాని మోడీతోపాటు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞాపన పత్రాలు అందజేశారు. అయితే ఆ అంశంపై కేంద్రం ఇప్పటి వరకూ ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. దీనిపై మరోసారి కేంద్రాన్ని గట్టిగా కోరాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మరోవైపు రుణ భారాన్ని తగ్గించటం, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయటం... ఈ రెండింటినీ సమన్వయం చేయటమెలా? అనే అంశంపై ఆర్థికశాఖ మేధోమథనం చేస్తోంది. ఇందులో భాగంగా కొన్ని కన్సల్టెన్సీ కంపెనీలను సంప్రదించేందుకు యోచిస్తోంది. 'మనీ మేనేజ్‌మెంట్' విషయంలో నిష్ణాతులైన నిపుణులు ఏయే కంపెనీల్లో ఉన్నారనే దానిపై ఉన్నతాధికారులు ఇప్పటికే ఆరా తీసినట్టు వినికిడి. వారి సూచనలు, సలహాలు స్వీకరించాలని నిర్ణయించింది. అయితే అదే ఆర్థికశాఖకు చెందిన ఓ సీనియర్ అధికారి మాత్రం 'కన్సల్టెన్సీ సూత్రాన్ని' కొట్టి పారేశారు. ఉన్నటువంటి కొద్దిపాటి ఆదాయాన్ని ఎలా సర్దుబాటు చేయాలి? పొదుపు ఎలా చేయాలి? ఏయే పథకాలకు ఎంతెంత వెచ్చించాలి? అనే దానిపై ఆయా కన్సల్టెన్సీలు సలహాలు ఇవ్వగలవేమోగానీ, అప్పులను ఎలా తగ్గించుకోవాలనే దానిపై అవేం సూచనలు ఇవ్వగలవంటూ ఆయన ప్రశ్నించారు. ఈ ఫార్ములా ప్రభుత్వానికి పెద్దగా ఉపయోగపడకపోవచ్చంటూ అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలో సర్కారు ఎలా ముందుకు పోతుందో వేచి చూడాలి.

రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ఇదీ... (అక్టోబరు చివరి నాటికి)



గత పదేండ్ల అప్పులు రూ. 7.50 లక్షల కోట్లు

అప్పులు, కిస్తీలు, వడ్డీలకు చెల్లింపులు నెలకు రూ.6 వేల కోట్లు

గత డిసెంబరు నుంచి ఇప్పటి వరకూ అప్పులు, వడ్డీలు, కిస్తీల రూపంలో చెల్లించిన మొత్తం రూ. 56,440 కోట్లు

గత డిసెంబరు నుంచి అక్టోబరు వరకు తెచ్చిన కొత్త రుణాలు రూ. 49,618 కోట్లు

సంక్షేమ పథకాలకు ఖర్చు చేసిన మొత్తం రూ. 54,346 కోట్లు

ఇక ఉబర్ ఫ్లైట్స్

వైమానిక అధికారుల కోసం ఒప్పందం

ఐఏఎఫ్, ఉబర్ అగ్రిమెంట్‌పై భద్రతా నిపుణుల ఆందోళన

పున:పరిశీలించాలని డిమాండ్



న్యూఢిల్లీ : భారత వైమానిక దళం (ఐఏఎఫ్), అమెరికాకు చెందిన యాప్ ఆధారిత క్యాబ్ సేవల సంస్థ ఉబర్ మధ్య కుదిరిన ఒప్పందంపై భద్రతా నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. క్యాబ్ సేవల కోసం ఉబర్‌తో భారత వైమానిక దళం ఓ ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం వైమానిక దళానికి చెందిన అధికారులు, వారి కుటుంబాలకు ఉబర్ సంస్థ ఎలాంటి ఆటంకాలు లేకుండా సేవలు అందించాల్సి ఉంటుంది. అయితే ఈ ఒప్పందంపై భద్రతా నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం బయటికి పొక్కే అవకాశం ఉన్నదని, అధికారులు, వారి కుటుంబ సభ్యులు ఎక్కడ ఉన్నదీ తేలికగా కనిపెట్టవచ్చునని, వేరే యాప్‌లు కీలక సమాచారాన్ని పొంది దానిని ఇతరులకు అందజేసే ప్రమాదం ఉన్నదని వారు అనుమానాలు ...13లో



జమిలీ ప్రజాస్వామ్యానికి విరుద్ధం

టీవీకే అధినేత విజయ్

డీఎంకే, బీజేపీపై విమర్శలు

చెన్నై: దేశమంతా ఒకేసారి ఎన్నికలు నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'జమిలీ' ప్రతిపాదనను ప్రముఖ సినీ నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ వ్యవస్థాపకుడు విజయ్ వ్యతిరేకించారు. 'ఒకే దేశం - ఒకే ఎన్నిక'ను అమలు చేసే ప్రయత్నం ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఉందని, ఈ చర్యను ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. తన పార్టీ జిల్లా ఆఫీస్ బేరర్లు, కార్యవర్గ ...13లో

ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తాం

దాని పరిధిలో గిరిజనం ఉండరు :

జార్ఖండ్‌లో అమిత్ షా హామీ

మ్యానిఫెస్టో విడుదల

జేఎంఎం ప్రభుత్వంపై ఆరోపణలు



రాంచీ : జార్ఖండ్‌లో అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని అమలు చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. అయితే దాని పరిధిలో గిరిజనులను చేర్చబోమని ఆయన చెప్పారు. జార్ఖండ్ శాసనసభ ఎన్నికలకు సంబంధించి బీజేపీ మ్యానిఫెస్టో 'సంకల్ప పత్ర'ను అమిత్ ఆదివారం రాజధాని రాంచీలో ...13లో

వడ్లు కొనేదెప్పుడు?

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెలరోజులు

రైతుల ఉసురుపోసుకుంటున్న సీఎం :

మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



నవతెలంగాణ-నంగునూరు

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం నెలరోజులైనా వడ్లు కొనుగోలు చేయడం లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం బద్దిపడగ గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు కనీస మద్దతు ధర దక్కడం లేదన్నారు. కేసీఆర్ హయాంలో వడ్లు కల్లాలకు రాకముందే సంచులు పంపించి, మిల్లర్లతో టైయప్ చేపించి, ట్రాన్స్‌పోర్టు ఏర్పాటు చేసి మరీ రైతుల నుంచి వడ్లు కొనుగోలు చేశారని గుర్తుచేశారు. కానీ రేవంత్ ప్రభుత్వం నెలరోజులైనా వడ్లు కొనుగోలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రాల ప్రారంభంతో రైతులు వడ్లు తీసుకొచ్చి ఎదురుచూస్తున్నా కొనకపోవడంతో అకాల వర్షాలతో తడిసి ముద్దవుతున్నాయని, కోతులు, పందికొక్కులకు ఆహారం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల, మహబూబాబాద్, సూర్యాపేట, రాజన్న సిరిసిల్ల తదితర జిల్లాల్లో రైతులంతా రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారన్నారు. సీఎం రైతులను రోడ్డుపై పడేశారన్నారు. ఓట్లప్పుడు ఊరురా తిరిగిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు ఎందుకు రైతుల దగ్గరికి వెళ్లట్లేదని ప్రశ్నించారు. సీఎం గానీ, మంత్రులు గానీ ఏ ఒక్కరూ రైతుల కష్టాలు పట్టించుకోవట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ రెండు సార్లు రైతుబంధు ఇస్తే.. మూడుసార్లు ఇవ్వాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారని, ఇప్పుడు ఒక్కసారి కూడా రైతుబంధు ...13లో

త్వరలో నూతన ఎనర్జీ పాలసీ

యూనిట్-1 గ్రిడ్ అనుసంధానం

మిగిలినవి మే 2025 నాటికి :

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



నవతెలంగాణ-మిర్యాలగూడ

త్వరలోనే నూతన ఎనర్జీ పాలసీని ప్రవేశపెట్టబోతున్నామని, ఇందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యుత్ నిష్ణాతులు, మేధావులు, అన్ని వర్గాల ప్రజలందరి ప్రజాభిప్రాయ సేకరణ తీసుకొని అసెంబ్లీలో చర్చించిన తర్వాత పాలసీని ప్రకటించ నున్నట్టు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఆదివారం నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో యూనిట్-1 సింక్రనైజేషన్ కార్యక్రమాన్ని మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మే 2025 నాటికి యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ ద్వారా పూర్తిస్థాయిలో 4 వేల మెగావాట్ల విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పవర్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ ఉత్పాదన చేపడుతున్నామని, 2028-29 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 22,488 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉండవచ్చని అంచనాలను రూపొందించామన్నారు. ఇది 2034-35 నాటికి 31,309 మెగావాట్ల డిమాండ్‌కు పెరిగే అవకాశం ఉందని అంచనా వేసినట్టు తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా గ్రీన్ ఎనర్జీని రాష్ట్రంలో ప్రవేశపెట్టనున్నామని, ఇందుకు తగ్గట్టుగా విద్యుత్ ఉత్పాదన చేపట్టి రాష్ట్రాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచుతామని చెప్పారు. ఇందులో భాగంగా సంప్రదాయేతర ఇంధన వనరుల ద్వారా 20వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళిక రూపొందిస్తున్నట్టు తెలిపారు. థర్మల్, సోలార్, హైడ్రో, పంప్ ఎనర్జీ వంటి రకరకాల విద్యుత్ ఉత్పాదనలు చేపట్టనున్నట్టు చెప్పారు. అంతకుముందు డిప్యూటీ సీఎం, మంత్రులు.. దామరచర్ల వద్ద యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు బొగ్గు అందించే ర్యాకుల రైల్వే వ్యాగన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, వైటీపీఎస్ చైర్మెన్ సందీప్‌కుమార్ సుల్తానియా, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్రపవార్, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జయవీర్‌రెడ్డి, వైటీపీఎస్ టెక్నికల్ డైరెక్టర్ అజయ్, ప్రాజెక్టు డైరెక్టర్ సచ్చిదానంద, చీఫ్ ఇంజనీర్ సమ్మయ్య, టీపీసీ సీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

85 లక్షల భారతీయ వాట్సాప్ ఖాతాలపై నిషేధం

తమ ప్లాట్‌ఫామ్ నిబంధనలు ఉల్లంఘించడంతో చర్యలు



న్యూయార్క్: మెటా ఆధ్వర్యంలోని ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్ పెద్దఎత్తున భారతీయ ఖాతాలపై నిషేధం విధించింది. ఐటీ రూల్స్ 2021 ఉల్లంఘన, వాట్సాప్‌ను దుర్వినియోగం చేస్తున్న కారణంగా ఈ చర్యలకు దిగింది. ఒక్క సెప్టెంబర్‌లోనే ఏకంగా 85 లక్షల ఖాతాలను నిషేధించినట్టు వెల్లడించింది. వీటిలో 16,58,000 ఖాతాలపై ఎలాంటి ఫిర్యాదులు అందకపోయినప్పటికీ, ఐటీ నిబంధనలను అతిక్రమించినందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపింది. భారత్‌లో వాట్సాప్‌కు 600 మిలియన్లకుపైగా వినియోగదారులు ఉన్నారు. అయితే తన ప్లాట్‌ఫామ్ ...13లో



ఫౌంటేన్ కాదు..లీకేజీ..!

హనుమకొండ జిల్లాలో దేవాదుల నీరు వృధా

నవతెలంగాణ - శాయంపేట

హనుమకొండ జిల్లా శాయంపేట మండలం జోగంపల్లె శివారు చలివాగు ప్రాజెక్టు నుంచి ధర్మసాగర్‌కు దేవాదుల రెండో విడతలో పంపింగ్ అయ్యే పైపులైన్ ఎయిర్‌వాల్ లీకేజీ అయింది. దాంతో నీరు ఎగిసిపడుతూ ఫౌంటేన్‌ను తలపించింది. మైలారం నుంచి సున్నపురాళ్ల గడ్డ మీదుగా పెద్దకోడపాకకు వెళ్లే దారిలో మహేందర్ రెడ్డి పొలం సమీపంలో శనివారం రాత్రి పైప్‌లైన్ ఎయిర్ వాల్ లీకై 100 మీటర్ల ఎత్తుతో నీరు ఎగిసి పడుతోంది. పక్కనే 220 విద్యుత్ ...13లో

కల్లాల్లేక కష్టాలు..

ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని ఆరబోసేందుకు కల్లాల్లేక రైతులు కష్టాలు పడుతున్నారు. రియల్ ఎస్టేట్ ప్రభావంతో పంట పొలాలు తప్ప ఖాళీ స్థలాల్లేకుండా పోయాయి. పొలాల సమీపంలోని రోడ్లపై ధాన్యం ఆరబోసుకుంటే తప్ప రైతులకు ప్రత్యామ్నాయం లేదు. అయితే రోడ్లపై ధాన్యం కుప్పలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా యని, రోడ్లపై ధాన్యం ఆరబోయొద్దంటూ పోలీసులు ఆంక్షలు విధిస్తున్నారు. మరోపక్క ఖరీఫ్ సీజన్ ధాన్యాన్ని ఆరబోసి తీసుకుపోతే తప్ప అధికారులు కొనుగోలు చేయడం లేదు. ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలన్నీ గ్రామీణ ప్రాంతాల్లో ఆరుబయటే నిర్వహిస్తున్నారు. అక్కడ ధాన్యం పోసేందుకు స్థలముండదు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో మార్కెట్ యార్డుల్ని నిర్మించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్లపై రైతులు ధాన్యం ఆరబోస్తే చర్యలంటున్న పోలీసులు

పొలాలు తప్ప మైదాన స్థలాల్లేని పరిస్థితి

పాలకులకు పట్టని గ్రామీణ మార్కెట్ల నిర్మాణం

ఖరీఫ్ ధాన్యంలో తేమ శాతం అధికం

ఆరబోసి తెస్తే తప్ప కొనబోమంటున్న అధికారులు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి మెదక్ జిల్లాలో సింగూరు, నల్లవాగు, ఏడుపాయల, కాళేశ్వరం పరిధిలోని మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, రంగనాయకసాగర్, గౌరవెల్లి వంటి సాగునీటి ప్రాజెక్టులున్నాయి. చిన్ననీటి పారుదల వనరులు, చెరువులున్నాయి. లక్షల సంఖ్యల్లో బావులు, బోర్లు సాగునీటి వనరులుగా ఉన్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో మెదక్ జిల్లాలో 3.76 లక్షల ఎకరాలు, సిద్దిపేట జిల్లాలో 3.68 లక్షల ఎకరాలు, సంగారెడ్డి జిల్లాలో 1.51 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. మెట్ట భూముల్లో పత్తి, కంది, చెరకు, పండ్ల తోటలు, కూరగాయల సాగు చేస్తున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో 8.95 లక్షల ఎకరాల్లో వరి పంట సాగైనందున లక్షలాది మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తున్నాయి. వరి కోతల పనులు ముమ్మరం కావడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్ని ప్రారంభించారు.

ధాన్యం ఆరబోసేందుకు కల్లాల్లేవు

రైతులు పండించిన ధాన్యాన్నే కాదు ఇతర ఏ పంటలైనా



తేమ శాతం లేకుండా ఆరబెట్టి మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయిస్తారు. నీటి వనరులు పెరగడంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో పంటల సాగు పెరిగింది. మరో పక్క రియల్ ఎస్టేట్, పారిశ్రామిక విస్తరణతో ఖాళీ స్థలాలన్నీ ప్రయివేట్ వ్యక్తుల ఆధీనంలోకి వెళ్లాయి. ప్రస్తుతం ఖరీఫ్ వరి కోతల పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే పలు మార్లు అకాల వర్షాలతో వరి ధాన్యం రాసులు తడిసి ఇబ్బందులెదురయ్యాయి. మరో పక్క వరి కోతల పనులకు ఆటంకాలు ఏర్పడ్డాయి. ఇటీవల కాస్త ఎండలు కాస్తుండటంతో కోతల పనులు వేగంగా సాగుతున్నాయి. చేతికొచ్చిన వరి పంటను యంత్రాలతో కోస్తున్నారు. కోత పూర్తవగానే ధాన్యాన్ని తెచ్చి ఆరబోయాలి. 17 శాతం కంటే ఎక్కువ తేమ శాతం ఉంటే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం కొనుగోలు చేయట్లేదు. దాంతో ధాన్యాన్ని ఎండకు ఆరబోసుకోవాల్సి వస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడా మార్కెట్ యార్డుల్లేవు. పైగా ఖాళీ ...13లో

రెండో రాజధానిగా వరంగల్

మంత్రి పొంగులేటి

నగరంలో పలు అభివృద్ధి పనులు, నిర్మాణాలు పరిశీలన

త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



నవతెలంగాణ-వరంగల్/హనుమకొండ చౌరస్తా

వరంగల్ మహా నగరాన్ని రెండవ రాజధానిగా అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వరంగల్ ...13లో

కులగణనతో అన్ని వర్గాలకు ప్రయోజనం



- మహేష్‌కుమార్‌గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సమగ్ర కులగణనతో అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరుతుందని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ చెప్పారు. ఎంతో ప్రాధాన్యత ఉన్న కులగణనపై సలహాలు, సూచనలు స్వీకరించేందుకు మంగళవారం సాయంత్రం రాహుల్‌గాంధీ హైదరాబాద్‌కు వస్తున్నారని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరాభవన్‌లో కులగణన చేపట్టే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నప్పటికీ రాహుల్‌గాంధీ మన రాష్ట్రానికి వస్తున్నారని చెప్పారు. కులగణనలో ఎలాంటి అంశాలు ఉండాలో సూచించాలని కోరారు. కులగణన ఎన్నో దశాబ్దాల తర్వాత జరుగుతున్న నేపథ్యంలో దీనికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ఇందులో అనేక ప్రశ్నలు పొందుపరిచినట్టు తెలిపారు. ఇంకా ఎలాంటి అంశాలు ఉండాలో సమగ్రంగా ఆలోచించి నిర్ణయం తీసుకోవడానికి అవకాశం ఉన్నదని చెప్పారు. కార్యక్రమంలో ఏఐసీసీ జాతీయ నాయకులు కొప్పుల రాజు, ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, చామల కిరణ్ కుమార్‌రెడ్డి, జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ విశ్వేశ్వరరావు, ప్రొఫెసర్ సింహాద్రి, ప్రొఫెసర్ వెంకట నారాయణ, ప్రొఫెసర్ భూక్య వివిధ కార్పొరేషన్ల చైర్మెన్లు, వివిద సంఘాల ప్రతినిధులు, మేధావులు, సామాజిక కార్యకర్తలు, ప్రజాస్వామిక వాదులు పాల్గొన్నారు.

ఝాన్సీరెడ్డికి సీఎం పరామర్శ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరామర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కొద్ది రోజుల క్రితం ఓ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె గాయపడిన విషయం తెలిసిందే. పరామర్శించిన వారిలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఉన్నారు.

మెస్ చార్జీలపై తప్పుడు ప్రచారాలు

- ముఖ్యమంత్రి కార్యాలయం వివరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలపై వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో వివరణ ఇచ్చింది. కొంత మంది వ్యక్తులు, సంస్థలు పనిగట్టుకుని సర్కార్‌ను అబాసుపాలు చేయడానికి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించింది. జులై 2023లో డైట్ ఛార్జీలు పెంచుతున్నట్టు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్.పత్రికలకు ప్రకటన జారీ చేశారనీ, ఆ తర్వాత నాలుగు నెలలు అధికారంలో ఉన్నప్పటికీ.. ఛార్జీలు పెంచకుండా మోసం చేశారని తెలిపింది. 2017లో ఉన్న డైట్, కాస్మొటిక్ ఛార్జీలతో ఇబ్బంది పడ్డ గురుకులాలు, హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం 40 శాతం పెంచినట్టు వివరించింది. ఫలితంగా రాష్ట్రంలోని.50 లక్షల మంది విద్యార్థులకు లబ్ది చేకూరనుందని పేర్కొంది.

టీజీఈఏపీసెట్ చివరి దశ కౌన్సిలింగ్ షెడ్యూల్ ఖరారు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీజీఈఏపీసెట్) (బైపీసీ) 2024 చివరి దశ కౌన్సిలింగ్ షెడ్యూల్ వివరాలను సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఎ. దేవసేన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4న స్లాట్ బుక్ చేయడంతో పాటు ఫీజు చెల్లించాలనీ, ఐదున సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. 5, 6 తేదీల్లో ఆప్షన్ నమోదు చేసుకోవాలని సూచించారు. 9న సీట్లు కేటాయించనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు సాంకేతిక విద్యాశాఖ వెబ్‌సైట్ (టీజీఈఏపీసీఈటీబీ.ఎన్ఐసీ) సందర్శించాలని కోరారు.

జీవో 317తో నష్ట పోయిన టీచర్లకు న్యాయం చేయాలి

- ప్రభుత్వానికి ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జీవో 317తో నష్టపోయిన ఉపాధ్యాయులకు తగిన న్యాయం చేయాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాడి రాజన్న అధ్యక్షతన ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన సర్వసభ్య సమావేశం ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పలు తీర్మాణాలు చేసింది. మండల కేంద్రంలోని ఒక పాఠశాలను ఎంపిక చేసి అన్ని వసతులతో ఇంగ్లీష్ మీడియం ఏర్పాటు చేయాలనీ, పాఠశాల పర్యవేక్షణకు ప్రత్యేక తనిఖీ విభాగాన్ని ఏర్పాటు చేయాలనీ. తల్లిదండ్రుల అభిప్రాయాలను సేకరించి బడులను పునర్వ్యవస్థీకరించాలని కోరారు. రేషనలైజేషన్ ప్రక్రియకు సంబంధం లేకుండా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగునంగా ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి చరణ్‌దాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువులో పడి ఇద్దరు మృతి

- నిజామాబాద్ జిల్లా మంచిప్పలో ఘటన

నవతెలంగాణ-మోపాల్

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఇద్దరు మృతిచెందిన ఘటన నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలోని మంచిప్ప గ్రామంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఆరుగురు వ్యక్తులు మంచిప్ప గ్రామంలోని దర్గా వద్దకు ప్రత్యేక ప్రార్థనల కోసం ఆదివారం వచ్చారు. ప్రార్థనల అనంతరం వారిలోని ఇద్దరు యువకులు యాకూబ్ (32), సయ్యద్ వాసిక్ (34) సరదాగా అక్కడే ఉన్న పెద్ద చెరువు వద్దకు వెళ్లి నీటిలో దిగి గల్లంతయ్యారు. గమనించిన స్థానికులు చెరువులోకి దిగి గాలించగా.. యాకూబ్ మృతదేహం లభించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా.. రెస్క్యూ టీమ్‌తో ఘటనా స్థలానికి చేరుకొని గాలించి వాసిక్ మృతదేహాన్ని బయటకు తీశారు. హైదరాబాద్‌లోని చంచల్‌గూడ ప్రాంతానికి చెందిన వాసిక్ ప్రముఖ కరాచీ బేకరీలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. అలాగే యాకూబ్ ఓ ప్రముఖ మొబైల్ షాపులో పనిచేస్తున్నాడు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు
- మియాపూర్‌లో ఘటన

నవతెలంగాణ-మియాపూర్



గోపి (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన రంగారెడ్డి జిల్లా మియాపూర్ పీఎస్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన ఇద్దరు యువకులు గోపి (23), కార్తీక్.. మాదాపూర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటూ సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన కోర్సులు నేర్చుకుంటున్నారు. ఇద్దరూ బైక్‌పై హాస్టల్ నుంచి లింగంపల్లి వైపు వెళ్తున్న క్రమంలో మియాపూర్ మెట్రో స్టేషన్ వద్ద వేగంగా వచ్చిన లారీ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో గోపి అక్కడికక్కడే మృతి చెందాడు. కార్తీక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కార్తీక్‌ను స్థానిక ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. గోపి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు మియాపూర్ ఎస్ఐ తెలిపారు.

సమూహం నుంచి ఒంటరితనంలోకి వెళ్లడం ప్రమాదకరం

- స్తబ్దత నుంచి బయటపడి సరికొత్త సృజనకు కవులు ఉపక్రమించాలి :తెలంగాణ సాహితీ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి
- సంస్థ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సాహిత్య సదస్సు
- కవితా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం



నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

సమాజం సమూహం నుంచి చీలి ఒంటరితనంలోకి వెళ్లిపోవటం చాలా ప్రమాదకరమని, కవులు, రచయితలు స్తబ్దత నుంచి బయటపడి సరికొత్త సృజనకై ఉపక్రమించాలని, అందుకోసం సమాజాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని తెలంగాణ సాహితీ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని టీఎస్ యూటీఎఫ్ భవనంలో తెలంగాణ సాహితీ సంస్థ ఉమ్మడి నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కుకుడాల గోవర్ధన్ అధ్యక్షతన నిర్వహించిన సాహిత్య సదస్సులో ఆయన మాట్లాడారు. మనిషి రాను రాను ప్రేమ భావన నుంచి వైదొలిగి కాఠిన్యం వైపు ఆలోచించడం ఆందోళనకరమన్నారు. ప్రముఖ కవి, రచయిత, పరిశోధకులు, సుంకిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. సాహిత్య రంగంలో అభ్యుదయ సాహిత్యం నుంచి ఇప్పటివరకు వచ్చిన సాహితీ సంస్థలు, వాటి దృష్టి కోణాలు, పరిమితులను వివరించారు. ఇన్నాళ్లు అణగారిన వారి జీవితాలపై ఆధిపత్యం చేసిన మత దురహంకారం మళ్లీ పడగ విప్పి విజృంభిస్తోందన్నారు. ఇది సాధారణ ప్రజల జీవితాలకు ప్రమాదకరమని, అందుకే వాటిని ప్రశ్నించే వైఖరితో రచయితలు, కవులు స్పందించాలని తెలిపారు. ముఖ్యంగా యువ రచయితలు ఈ పనికి పూనుకోవాలని తెలిపారు.

అనంతరం ప్రముఖ కవి, రచయిత తండు కృష్ణ కౌండిన్య నిర్వహణలో జరిగిన కవి సమ్మేళనంలో కవులందరూ పాల్గొని తమ తమ కవితలను వినిపించారు. ఈ కార్యక్రమానికి సభ అధ్యక్షులుగా తెలంగాణ సాహితీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ మహ్మద్ సేన, ఆత్మీయ అతిథిగా కవి రచయిత మోత్కూరు శ్రీనివాస్ వ్యవహరించారు. కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులను శాలువాలతో సత్కరించారు. సాహితీ ఉత్సవాల సందర్భంగా డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన కవితల పోటీల్లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు 147 మంది కవితలను రాయగా వారిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, ఐదు కన్సొలేషన్ బహుమతులు గెలుచుకున్న విజేతలకు ఆనందాచారి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కాగా, ఉదయం ప్రారంభమై ఆరు సెషన్లుగా సాగిన ఈ కార్యక్రమంలో 'స్వీయ కవితల్లో వస్తువులు' అంశంపై జీవకవి మునాస్ వెంకట్, 'స్వీయ కథల్లో సామాజిక జీవన చిత్రాలు' అంశంపై ప్రముఖ కథా రచయిత భూతం ముత్యాలు, 'స్వీయగీతాల్లో సామాజిక స్పృహ' అంశంపై ప్రముఖ గాయకుడు అంబటి వెంకన్న ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ అతిథిగా ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ సాగర్ల సత్తయ్య, తెలంగాణ సాహితీ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షులు అనంతోజు మోహనకృష్ణ, ప్రముఖ బాల సాహిత్యవేత్త కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎడ్ల సైదులు, ప్రముఖ కవి, గాయకులు ఏబూసి నరసింహ, వేముల వెంకటేశ్వర్లు, ప్రముఖ కథా రచయిత శీలం భద్రయ్య, ప్రభుత్వ బాల సాహితీవేత్త పుప్పాల కృష్ణమూర్తి, ఉనికి సాహిత్య వేదిక అధ్యక్షులు బండారు శంకర్, సృజన సాహితీ అధ్యక్షులు పెరుమాళ్ళ ఆనంద్, విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు దాసోజు శ్రీనివాసచారి, నల్లగొండ లయన్స్ క్లబ్ చాలెంజర్స్ అధ్యక్షులు వనం శ్రీకిషన్, ప్రముఖ న్యాయవాది యన్ భీమార్జునరెడ్డి, కవులు, రచయితలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీపడాలి

- అందుకే ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లో వసతులు కల్పిస్తాం
- బడుగు, బలహీన వర్గాల కోసమే.. కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నాం
- 20 నెలల్లో ఎస్ఎల్బీసీ సొరంగం ప్రాజెక్టు పూర్తి చేస్తాం :ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



నవతెలంగాణ-గరిడేపల్లి

ప్రపంచస్థాయిలో విద్యార్థులు పోటీపడేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లలో వసతులు కల్పిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామంలో రూ.200 కోట్లతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ఆదివారం మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఆయన భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో భట్టి మాట్లాడారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసమే కోరి కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నామని గుర్తు చేశారు. 7.50 లక్షల మంది నిరుపేద విద్యార్థులు చదువుకునే సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో మెస్, కాస్మోటిక్స్ చార్జీలు ఒక్కసారిగా 40 శాతం పెంచుతూ దీపావళి పండుగ రోజు ఆదేశాలు విడుదల చేశామని తెలిపారు. పేద బిడ్డల ఉజ్వల భవిష్యత్తు కోసం, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంత ఖర్చయినా భరించేందుకు సిద్ధంగా ఉందన్నారు. నాలుగో తరగతి నుంచి 12వ తరగతి వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్.. అన్ని వర్గాల విద్యార్థులందరూ ఒకే చోట చదువుకునేలా అద్భుతంగా నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఒకే ఏడాదిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కోసం రూ.5 వేల కోట్లు కేటాయించామన్నారు. యాదాద్రి పవర్ ప్లాంట్ పనులు.. ఎక్కడివక్కడే నిలిచి పోయాయని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పర్యావరణ అనుమతులు సాధించామని తెలిపారు. ఏడాదిలో మూడు సార్లు పర్యటించి రెండు యూనిట్లు సింక్రనైజ్ చేసినట్టు చెప్పారు. 20 నెలల్లో ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రాజెక్టు పనులను పూర్తి చేయిస్తామని, నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేస్తామని అన్నారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి తాను ఎస్ఎల్‌బీసీ దగ్గర సమీక్ష చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. సంక్రాంతి తర్వాత రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం అందజేస్తామన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా రూ.10 లక్షల ఉచిత వైద్య సదుపాయం కల్పిస్తున్నామని, రూ.18 వేల కోట్లతో రుణమాఫీ చేశామని తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. చెరువులు, చెట్లు, గుట్టల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో మంచి నాణ్యమైన విద్యను బోధించేందుకు గడ్డిపల్లి గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. ఈ పాఠశాలకు డబుల్ రోడ్డు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పి రాంబాబు, డీఆర్డీఏ పీడీ అప్పారావు, మండల ప్రత్యేక అధికారి శ్యాంసుందర్, తహసీల్దార్ బండ కవిత, ఎంపీడీవో సరోజ, కాంగ్రెస్ మండల అధ్యక్షులు త్రిపుర అంజన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్, ఎల్-27 లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మెన్ సుందరి నాగేశ్వరరావు, ప్రజాప్రతినిధులు,

ఘనంగా 'జంగా' కుమార్తె వివాహం

- హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి/ఎన్జీఓస్ కాలనీ

రాష్ట్ర ఆయిల్ సీడ్స్ గ్రోయర్స్ ఫెడరేషన్ చైర్మెన్ జంగా రాఘవరెడ్డి కుమార్తె డాక్టర్ నిఖితారెడ్డి, డాక్టర్ అవినాశ్‌రెడ్డిల వివాహం హనుమకొండ జిల్లా కాజీపేట పరిధి మడికొండలోని సత్యసాయి గార్డెన్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి హాజరై దంపతులను ఆశీర్వదించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరిన సీఎం.. మడికొండలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు ఉదయం చేరుకున్నారు. అక్కడ వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, హన్మకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా.. సీఎంకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. సత్యసాయి గార్డెన్‌కు చేరుకొని నూతన దంపతులు డాక్టర్ నిఖితారెడ్డి, డాక్టర్ అవినాశ్‌రెడ్డిని ఆశీర్వదించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు హెలిక్యాప్టర్‌లో హైదరాబాద్‌కు తిరిగి బయలుదేరి వెళ్లారు. సీఎం వెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, ధనసరి సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తదితరులు హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మెన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ డీసీసీబీ చైర్మెన్ మార్నేని రవీందర్‌రావు, మాజీ ఎంపీ పసునూరి దయాకర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పల్లారాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సెపక్ తక్రా అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

- రాష్ట్ర అధ్యక్షునిగా పెరిక సురేష్



నవతెలంగాణ- హైదరాబాద్

తెలంగాణ సెపక్ తక్రా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా పెరిక సురేష్ కుమార్ ఎన్నికైయ్యారు. ఆదివారం ఫతేమైదాన్‌లో జరిగిన ఎన్నికల్లో 21మందితో కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణ సెపక్ తక్రా అడ్హక్ కమిటీ చైర్మెన్ జగన్నాథ్ స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారి డీఎల్ నరసింహారావు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ అబ్జర్వర్ ఓంకార్ యాదవ్, ఒలంపిక్ అసోసియేషన్ పరాగ్ వాద్వికార్ అబ్జర్వర్‌గా వ్యవహరించారు. కొత్త కార్యవర్గం నాలుగేండ్ల పాటు కొనసాగనుంది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సురేష్ కుమార్ మాట్లాడుతూ సెపక్ త్రాలో రాష్ట్రాన్ని జాతీయ అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లడానికి తన వంతు కషి చేస్తానని పేర్కొన్నారు.

నూతన అధ్యక్షునిగా సురేష్ కుమార్, వైస్ ప్రెసిడెంట్లుగా జగన్నాథ్ స్వామి, శ్రీధర్, సంజీవ్రెడ్డి, కంచర్ల అనిత, జనరల్ సెక్రటరీగా శ్రీనివాస్రెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా జితేంద్రనాథ్, జరీపుద్దీన్, విజయ్ బాస్కర్‌రెడ్డి, శిరీష, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కొరిడె శ్రీకాంత్, ట్రెజరర్‌గా మీనం వికేష్ కుమార్‌తో పాటు మరో ఎనిమిది మందిని ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా ఎన్నుకున్నారు.

అందరికీ విద్య, ఉపాధి కోసం డీవైఎఫ్ఐ పోరాటం



నవతెలంగాణ-సిటీబ్యూరో

దేశంలో అందరికీ విద్య ఉపాధి కోసం భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) నిరంతరం పోరాడుతోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ అన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్క్ వద్ద జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీవైఎఫ్ఐ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండీ జావీద్‌తో కలిసి ఆయన భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి సంఘం జెండా ఆవిష్కరించారు. అనంతరం

సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్

కోట రమేష్ మాట్లాడుతూ.. రైల్వేలో కాంట్రాక్ట్ పద్ధతిలో రిటైర్డ్ ఉద్యోగులతో ఉద్యోగాలు భర్తీ చేయాలన్న ఆలోచనను వెనక్కి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలో రోజురోజుకు నిరుద్యోగం పెరిగిపోతుం దన్నారు. మోడీ ప్రభుత్వం మొత్తం పరిశ్రమలను ప్రయివేట్ పరం చేస్తూ అదానీ, అంబానీలకు అప్పగిస్తుందని విమర్శించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తానని మోడీ సర్కారు నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనీ, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ సామాజిక, సేవా కార్యక్రమాలు చేయడంలో ముందుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రెముడాల క్రాంతి ,సహాయ కార్యదర్శి రవి, వీరేందర్, అజయ్ రెడ్డి, శివ, సామెల్ తదితరులు పాల్గొన్నారు.

ఇక నుంచి ఒకటో తారీఖునే జీతాలు

- పీఆర్, ఆర్‌డీ కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఊరట
- పదేండ్ల ఎదురు చూపులకు పరిష్కారం
- సర్కార్ నిర్ణయంతో 92 వేల మందికి లబ్ధి
- చెల్లింపునకు నూతన విధానం
- మంత్రి ఆదేశాలతో ఫైల్ సిద్ధం చేసిన అధికారులు
- ఆర్థిక శాఖ ఆమోదమే తరువాయి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పంచాయతి రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పార్ట్ టైం, ఫుల్‌టైం, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగులకు ఇక నుంచి ప్రతి నెలా ఒకటో తారీఖున ఠంచన్‌గా జీతాలు పడనున్నాయి. గతంలో మూడు, నాలుగు నెలలకోసారి గాని జీతాలు రాని పరిస్థితి. సర్కార్ తాజాగా తసుకున్న నిర్ణయంతో గత పదేండ్లుగా జీతాల కోసం పడుతున్న కష్టాలకు ఇక ఫుల్ స్టాప్ పడనుంది. పంచాయతిరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ఆదేశాలతో సంబంధిత ఫైల్‌ను అధికారులు సిద్ధం చేసి ఆర్థిక శాఖకు పంపారు. వారం పది రోజుల్లో ఆర్థిక శాఖ సైతం దీనికి ఆమోద ముద్ర వేయనున్నట్టు సమాచారం.

పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా 92 వేల మంది సిబ్బంది పలు స్కీముల్లో పనిచేస్తున్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఆఫీస్ స్టాఫ్, సెర్ప్ సిబ్బంది, వీఏఓ తదితర విభాగాల్లో పార్ట్‌టైం, ఫుల్‌టైం, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో వీరు సేవలందిస్తున్నారు. వీరికి ప్రతి నెలా జీతభత్యాల కింద రూ.117 కోట్లు చెల్లించాల్సి ఉంది. గత పదేండ్లుగా వేతనాల విషయంతో ఎప్పుడూ పడిగాపులే. మూడు నాలుగు నెలలకోసారి జీతాలు రావడంతో వారికి కుటుంబ పోషణ భారంగా మారింది.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సకాలంలో వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిందన్న విమర్శలు సర్వత్రా వెల్లువెత్తాయి. అరకొరగా వచ్చే వేతనాలు తెచ్చిన అప్పుల వడ్డీలకే సరిపోతున్నాయని పలు సందర్భాల్లో ఉద్యోగులు రోడ్డెక్కి ఆందోళన బాట పట్టారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చిన ప్రతి సారీ ఓ నెల జీతం ఇచ్చి చేతులు దులుపుకున్నారే తప్ప శాశ్వత పరిష్కారం కోసం గత సర్కార్ ఎన్నడూ ప్రయత్నించలేదు. పని దినాల విషయంలో, బడ్జెట్ కేటాయింపుల్లో కేంద్రం కొర్రీలు పెడుతూ పలు సందర్భాల్లో ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేసిన విషయం విదితమే. కాంగ్రెస్ సర్కార్ అధికారం చేపట్టిన తర్వాత కూడా గత పది నెలలుగా ఇదే పరిస్థితి నెలకొంది. మూడు నాలుగు నెలలకోసారీ జీతాలు చెల్లించని వైనం. దాంతో ఉద్యోగులు ముఖ్యమంత్రితో పాటు ఆ శాఖ మంత్రికి పలు సార్లు విన్నవించారు. ఈ క్రమంలో జీతాల చెల్లింపు విషయంలో ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంది. ఈ సమస్యపై అధ్యయం చేసిన అధికారులు తగిన పరిష్కారం కనుగొన్నట్టు సమాచారం.

బడ్జెట్ కేటాయింపుల్లో మార్పులు

స్కీమ్‌ల అమలు, జీతాలు ఒకే ఖాతా కింద నిర్వహిస్తుండటంతో అవసరాన్ని బట్టి పథకాల అమలుకే మొత్తం నిధులను మళ్లిస్తున్నారు. ఈ విభాగంలో చేపడుతున్న పనులపై అధికారులకు సరైన అంచనా లేక పోవడం, ఒక్కోసారీ కేంద్రం నుంచి రావాల్సిన నిధులు సక్రమంగా రాక పోవడం తదితర కారణాల వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తేలింది. దీంతో జీతాలు చెల్లించడానికి ఇక్కట్లు తప్పడం లేదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు స్కీంల అమలు, జీతాలకు వేర్వేరుగా బడ్జెట్ కేటాయింపులు చేయాలని సర్కార్ నిర్ణయం తీసుకుంది. దీంతో పాటు క్షేత్ర స్థాయిలో మాన్యువల్ పద్ధతిలో చెల్లింపుల ప్రక్రియ కాకుండా, ఆన్‌లైన్‌లో ఏకకాలంలో సిబ్బందికి జీతాలు అందేలా సాంకేతికంగా మార్పులు చేయనున్నారు. ఫలితంగా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే ఇకనుంచి ప్రతీ నెల మొదటిరోజే జీతాలు అందనున్నాయి. నూతన విధానానికి సంబంధించి పంచాయతిరాజ్ శాఖ ప్రతిపాదనలకు వారం పది రోజుల్లో ఆర్థిక శాఖ ఆమోద ముద్ర వేయనున్నట్టు సమాచారం. అన్ని సక్రమంగా జరిగితే ఇక నుంచి ప్రతి నెల ఒకటిన జీతాలు అందుకోనున్నారు.



ప్రధాని పదవి గౌరవాన్ని దిగజారుస్తున్నారు

మోడీపై మండిపడిన ప్రియాంక

- కాంగ్రెస్ ప్రభుత్వాలు గ్యారంటీలు అమలు చేశాయి
- కేంద్రమే అనేక హామీలను విస్మరించింది


న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీపై కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ మండిపడ్డారు. ఆయన 140 కోట్ల మంది దేశ ప్రజలకు నిరంతరం కల్లబొల్లి హామీలు ఇస్తూ ప్రధాని పదవికి ఉన్న గౌరవాన్ని దిగజారుస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు ఆమె సామాజిక మాధ్యమం ఎక్స్‌లో శనివారం పోస్ట్ పెడుతూ కాంగ్రెస్‌పై దృష్టి సారించే బదులు తన పదవికి ఉన్న గౌరవాన్ని కాపాడడంపై శ్రద్ధ చూపాలని, అందుకోసం నిజాలే మాట్లాడాలని సూచించారు. కాంగ్రెస్ వాస్తవ దూరమైన హామీలు ఇస్తోందంటూ ప్రధాని మోడీ చేసిన విమర్శపై ఆమె స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'సత్యమే దైవము అని మహాత్మా గాంధీజీ చెప్పే వారు. మండూక ఉపనిషత్తులో సత్యమేవ జయతే అని రాశారు. అదే మన జాతీయ నినాదం. ఈ నినాదమే సత్యాన్ని చాటిచెప్పింది. భారత స్వాతంత్రోద్యమానికి, దేశ పునర్నిర్మాణానికి, ప్రజా జీవనానికి ఆదర్శంగా మారింది' అని ప్రియాంక తెలిపారు.

వేలాది సంవత్సరాల సంస్కృతికి సత్యమే ఆధారంగా ఉన్న దేశంలో అత్యున్నత పదవిలో కూర్చున్న వ్యక్తి అసత్యాలు చెప్పకూడదని ప్రియాంక చురక వేశారు. కాంగ్రెస్ ట్రాక్ రికార్డును ఆమె సమర్థిస్తూ కర్నాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల ప్రభుత్వాలు గ్యారంటీలు అమలు చేయడం ద్వారా హామీలు నెరవేర్చాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేయని అనేక హామీలను ప్రస్తావించారు. వంద రోజుల ప్రణాళిక, ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు, వంద స్మార్ట్ సిటీలు, నల్ల ధనాన్ని వెనక్కి తేవడం, ద్రవ్యోల్బణాన్ని, నిరుద్యోగాన్ని తగ్గించడం, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం, డాలర్‌కు సమానంగా రూపాయిని తీసుకురావడం, అచ్ఛేదిన్‌ను తేవడం వంటి హామీలు అమలుకు నోచుకోలేదని ప్రియాంక గుర్తు చేశారు.

పది రోజుల్లో రాజీనామా చేయాలి

- లేని పక్షంలో యూపీ సీఎంను చంపేస్తాం : ముంబయి పోలీసులకు బెదిరింపు సందేశం





ముంబయి: యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను హత్య చేస్తామంటూ ముంబయి పోలీసులకు బెదిరింపు సందేశం వచ్చింది. "బాబా సిద్ధిఖీలాగా యూపీ సీఎంను చంపుతాం" అంటూ దుండుగులు హెచ్చరించారు. ఆయన పది రోజుల్లో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఈ మెసేజ్ వచ్చినట్టు తెలుస్తోంది.

గత నెలలో మహారాష్ట్ర ఎన్సీపీ పవార్ వర్గం నేత బాబా సిద్ధిఖీని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యులు కాల్చి చంపిన విషయం తెలిసిందే. బాలీవుడ్ స్టార్ సల్మాన్‌తో సన్నిహితంగా ఉన్నందుకే చంపామని నిందితులు చెప్పారు. ఆ తర్వాత నుంచి పలువురికి లారెన్స్ గ్యాంగ్ నుంచి బెదిరింపులు వచ్చాయి. సిద్ధిఖీ కుమారుడు జీశాన్ కూడా హిట్‌లిస్ట్‌లో ఉన్నట్టు వార్తలొచ్చాయి. ఈ నేపథ్యంలో ఇటీవలే అతడికి కూడా బెదిరింపు కాల్స్ వచ్చాయి.

గంటల్లోనే నిందితురాలి అరెస్టు

ఈ బెదిరింపులను తీవ్రంగా పరిగణించిన ముంబయి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. 24 ఏండ్ల వయస్సు ఉన్న ఓ మహిళ ఫోన్ నుంచి ఈ మెసేజ్ వచ్చినట్టు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. బీఎస్సీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పూర్తి చేసిన ఆమె ఇటీవల కాలంలో తీవ్ర మానసిక సమస్యలతో బాధపడుతున్నట్టు గుర్తించారు. థానేలోని ఉల్హాస్ నగర్‌కు చెందిన నిందితురాలి తండ్రి టింబర్ వ్యాపారి అని గుర్తించారు.

దేశాన్ని సర్వనాశనం చేస్తున్న మోడీ విధానాలు

నారాయణపేట సీపీఐ(ఎం) జిల్లా మహాసభలు ప్రారంభం

ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలి: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ -మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి/ మక్తల్

దేశాన్ని సర్వనాశనం చేస్తున్న మోడీ విధానాలను ప్రజలు తిప్పి కొట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. నారాయణపేట జిల్లాలోని మక్తల్ పట్టణంలో సీపీఐ(ఎం) ద్వితీయ జిల్లా మహాసభలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహిం చిన బహిరంగసభలో జూలకంటి మాట్లాడారు. ప్రపంచంలో కమ్యూనిస్టుల శక్తి పెరుగుతున్నదని, ప్రజా సమస్యలకు నిజమైన పరిష్కారం చూపగలిగే సత్తా సీపీఐ(ఎం)కి ఉందని తెలిపారు. పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, సాగు భూముల కోసం పోరాటం చేస్తున్నట్టు చెప్పారు. ప్రధాని మోడీ దేశ సంపదను సంపన్నులకు అమ్మేస్తున్నారని ఆరోపించారు. మతోన్మాద రాజకీయాలతో దేశంలో విద్వేషం పెంచుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వకపోవడంతో రైతులు పంట పెట్టుబడికి అప్పులు చేస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు అర్హులకు ఇవ్వాలన్నారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ, టి.సాగర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులు, క్షేత్ర సహాయకులు, పశుమిత్రులు, భవన నిర్మాణ కార్మిక, హమాలీల సమస్యలపై పోరాడేది ఎర్రజెండా మాత్రమేనని చెప్పారు. బీజేపీ దేశ సంపదను కారు చౌకగా అమ్మేస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడా పారిశ్రామిక వేత్తలకు రూ.14 వేల లక్షల కోట్లు మాఫీ చేశారని తెలిపారు. కానీ రైతుల రుణాలను మాత్రం పట్టించుకోవడం లేదని, పైగా రుణాలు కట్టని వారిపైకి దౌర్జన్యంగా వస్తున్నారని అన్నారు. కార్మిక, కూలీలకు నష్టం కలిగించే విధానాలు అమలుచేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభలో సీపీఐ(ఎం)రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, ఆర్. వెంకట్రాములు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, పుంజనూరు ఆంజనేయులు, బండమీది బాలరామ్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ముగిసిన.. సీపీఐ(ఎం) మెదక్ జిల్లా మహాసభ

జిల్లా కార్యదర్శిగా కడారి నర్సమ్మ

- 15 మందితో నూతన జిల్లా కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి



మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని (సీతారాం ఏచూరి నగర్) లింగారెడ్డి గార్డెన్‌లో ఈ నెల 2, 3 తేదీల్లో జరిగిన సీపీఐ(ఎం) మెదక్ జిల్లా 15వ మహాసభలు విజయవంతంగా ముగిశాయి. ఆదివారం మహాసభల్లో పార్టీ నూతన జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా కార్యదర్శిగా కె.నర్సమ్మ, కార్యదర్శివర్గ సభ్యులుగా ఏ.మల్లేశం, బి.బస్వరాజు, కే.మల్లేశం, ఏ.మహేందర్ రెడ్డి, బి.బాలమణి ఎన్నికయ్యారు. కాగా, మహాసభలకు రాష్ట్ర పరిశీలకులుగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.జయలక్ష్మి హాజరయ్యారు. రైతులు, కార్మికులు, మహిళలు, వ్యవసాయ కూలీలు, విద్యార్థులు, యువజనుల సమస్యలతో పాటు మెదక్ జిల్లా అభివృద్ధికి సంబంధించిన అంశాలపై పలు తీర్మానాలను మహాసభ ఆమోదించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.అడివయ్య, రమేష్, నాయకులు అనిల్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

నెలకు ఏడు కేజీల రేషన్ ఇస్తాం

- పింఛన్‌ను కూడా పెంచుతాం: జార్ఖండ్ సీఎం హేమంత్ సొరేన్ హామీ



రాంచీ : రాష్ట్రంలో జేఎంఎం తిరిగి అధికారంలోకి వస్తే ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రస్తుతం అందజేస్తున్న ఐదు కిలోల రేషన్‌ను ఏడు కిలోలకు పెంచుతామని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ హామీ ఇచ్చారు. రేషన్‌తో పాటు నెలసరి పెన్షన్‌ను కూడా పెంచుతామని ఆయన తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆయన ఆదివారం పోస్ట్ పెడుతూ రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు 11 లక్షల రేషన్ కార్డులు, మూడు లక్షల పెన్షన్లను రద్దు చేసిందని ఆరోపించారు. ఫలితంగా అనేక మంది గిరిజనులు, దళితులు ఆకలికి తాళలేక ప్రాణాలు కోల్పోయారని చెప్పారు.

బీజేపీ హయాంలో ఆకలి చావులు సర్వసాధారణమైతే తమ ప్రభుత్వంలో ప్రతి వ్యక్తీ రేషన్, పెన్షన్, పోషకాహారం పొందుతున్నారని, అది తనకు గర్వకారణమని హేమంత్ తెలిపారు. జార్ఖండ్‌లో తిరిగి తమ ప్రభుత్వం ఏర్పడగానే ప్రతి వ్యక్తికీ ఐదు కిలోలకు బదులు ఏడు కిలోల రేషన్ అందజేస్తామని, పెన్షన్‌ను కూడా పెంచుతామని అన్నారు. సబ్సిడీపై ఆహారధాన్యాలు పొందలేకపోతున్న 10 లక్షల మందిని ప్రజా పంపిణీ వ్యవస్థలో చేరుస్తామని చెప్పారు. మయాన్ సమ్మాన్ యోజన కింద మహిళా లబ్దిదారులకు నెలకు రూ.2,500 ఇస్తామని, అంగన్‌వాడీ కేంద్రాలలో మధ్యాహ్న భోజనంలో చిన్నారులకు పండ్లు, గుడ్లు అందిస్తామని హేమంత్ హామీ ఇచ్చారు. జార్ఖండ్‌లో ఈ నెల 13, 20 తేదీలలో రెండు దశలుగా శాసనసభ ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. 23న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు.

ప్రమాదకరంగా ఢిల్లీ

500 పాయింట్లుగా ఎక్యూఐ నమోదు

డబ్ల్యూహెచ్ఓ సూచించిన పరిమితి కన్నా 65 రెట్లు అధికం



న్యూఢిల్లీ : ఢిల్లీలో వాయుకాలుష్యం రోజురోజుకీ పెరిగిపోతోంది. దీపావళి తర్వాత కొద్ది రోజుల్లోనే ఢిల్లీ కాలుష్యం ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ఆమోదించిన పరిమితి కన్నా 65 రెట్లు అధికంగా ఉన్నట్టు నిపుణులు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం ఐదు గంటలకు ఢిల్లీలో వాయు నాణ్యతా ప్రమాణ సూచీ (ఎక్యూఐ) 500 పాయింట్లుగా నమోదై 'ప్రమాదకర' కేటగిరీకి చేరింది. ఢిల్లీతో పాటు అలీపూర్, ఆనంద్ విహార్, అశోక్ విహార్, బవానా, బురారీ, మధుర రోడ్, ఐజీఐ విమానాశ్రయం, ద్వారకా, జహంగీర్‌పురి సహా పలు ప్రాంతాల్లో ఎక్యూఐ 'చాలా పేలవం'గా నమోదైంది.

పొగమంచు ఢిల్లీని చుట్టుముట్టడంతో చాలా ప్రాంతాల్లో విజిబిలిటీ (దృశ్యమాన్యత) తగ్గిపోయిందని ఎక్యూఐ సీఏస్ డేటా పేర్కొంది. ఢిల్లీ, ఎన్‌సీఆర్ పరిధిలో పీఎం 2.5 స్థాయిలు డబ్ల్యూహెచ్ఓ సూచించిన పరిమితి కంటే 50 రెట్లు ఎక్కువ ప్రమాదకరంగా మారినట్టు తెలిపింది.

ఢిల్లీతో పాటు ఎన్‌సీఆర్ పరిధిలో 69 శాతం అంటే ప్రతి కుటుంబంలో ఒకరు గొంతునొప్పి, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారని సర్వే తెలిపింది. 21,000 మందిపై ఈ సర్వే నిర్వహించారు. వాయు నాణ్యత తక్కువగా ఉండటం వల్ల 62 శాతం మంది కంటి సమస్యలను ఎదుర్కొంటున్నట్టు వెల్లడించింది.

ఎస్సీ హోదా కమిషన్ పదవీ కాలం పొడిగింపు

ఏడాది పెంచుతూ కేంద్రం ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ సిక్కు మతం, బౌద్ధమతం కాకుండా ఇతర మతాలలోకి మారిన వ్యక్తులకు షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) హోదాను మంజూరు చేయవచ్చో లేదో పరిశీలించడానికి ఏర్పాటు చేసిన కమిషన్ పదవీకాలాన్ని ఏడాది పొడిగించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది.

కమిషన్ పనిని వచ్చే ఏడాది అక్టోబర్ 10న ముగించాలని నిర్ణయించుకున్నందున, దాని నివేదికను ఖరారు చేయడానికి అదనపు సమయాన్ని కోరిందని నోటిఫికేషన్‌లో తెలిపింది.

కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్-1952 ప్రకారం 2022 అక్టోబర్ 6న కమిషన్ ఆఫ్ ఎంక్వైరీని ఏర్పాటు చేశారు. ఈ కమిషన్ సామాజిక న్యాయం, హక్కులు, క్రైస్తవ, ఇస్లాం వంటి ఎస్సీ వర్గీకరణలలో సాంప్రదాయకంగా చేర్చని మతాల్లోకి మారిన వారికి రిజర్వ్‌డ్ హోదాను పొడిగించడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి కెజి బాలకృష్ణన్ నేతృత్వంలోని కమిషన్, సామాజికవేత్తలు, చరిత్రకారులు, ప్రభావిత వర్గాల ప్రతినిధులు సహా పలువురితో చర్చలు జరుపుతోందని, మత మార్పిడి సందర్భంలో కుల గుర్తింపు సూక్ష్మబేధాలను బాగా అర్థం చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

హర్యానాలో డీఏపీ సంక్షోభం

రోడ్డెక్కుతున్న రైతన్నలు



సహకార సొసైటీల వద్ద పోలీసుల మోహరింపు

1.1 ఎల్ఎంటీ కేటాయించిన కేంద్రం

చండీఘర్ : హర్యానాలో డీఏపీ ఎరువు కొరత తీవ్ర సంక్షోభాన్ని కలిగిస్తోంది. ఎరువు కోసం రైతన్నలు సహకార సొసైటీల ఎదుట బారులు తీరుతున్నారు. వీరిని అదుపు చేసేందుకు పోలీసులను కూడా నియమించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర రైతాంగానికి 1.10 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) డీఏపీని కేటాయించింది. ఇందులో ఇప్పటికే 40 ఎల్ఎంటీ ఎరువును ఓడరేవుల నుండి రాష్ట్రానికి పంపారు. ఈ ఎరువు ఈ నెల 7వ తేదీ నాటికి రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చేరుకుంటుందని భావిస్తున్నారు. కేంద్రం కేటాయించిన ఎరువు మొత్తం ఈ నెల 17వ తేదీ నాటికి రాష్ట్రానికి చేరుతుంది.

డీఏపీ ఎరువును సకాలంలో సరఫరా చేయాల్సిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ కేంద్ర మంత్రి నడ్డాను పదే పదే కోరుతున్నారని ప్రభుత్వ అధికారులు తెలిపారు. ఈ సీజన్‌లో హర్యానాకు 2.6 లక్షల మెట్రిక్ టన్నుల డీఏపీ అవసరమవుతుందని అంచనా. గత సంవత్సరం అక్టోబరులో రాష్ట్ర రైతులు 1.19 ఎల్ఎంటీని వినియోగిస్తే ఈ ఏడాది అదే నెలలో 1.15 ఎల్ఎంటీని మాత్రమే వాడారు. ఈ ఏడాది అక్టోబరులో 1.10 ఎల్ఎంటీ డీఏపీని అందజేస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని, కానీ 85,000 ఎల్ఎంటీనే ఇచ్చిందని హర్యానా ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి (వ్యవసాయం) రాజశేఖర్ ఉందు తెలిపారు. అయితే రాష్ట్రం వద్ద 24,500 ఎల్ఎంటీ డీఏపీ ఎరువు నిల్వ ఉన్నదని, దీంతో కొరత ఏమీ ఉండబోదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన చెప్పారు.

కాగా హర్యానాకు 60,000 మెట్రిక్ టన్నుల (ఎంటీ) ఎన్‌పీకే (నైట్రోజన్, ఫాస్పరస్, పొటాషియం) ఎరువు సరఫరా అయిందని అధికారులు తెలిపారు. ఇందులో 29,000 టన్నుల ఎన్‌పీకేను ఇప్పటికే పంపిణీ చేశామని వివరించారు. హర్యానాలో అక్టోబర్ 1న రబీ సీజన్ అధికారికంగా ప్రారంభమైంది. 25 లక్షల హెక్టార్లలో గోధుమలు, 10 లక్షల హెక్టార్లలో చమురు గింజల పంటలు పండించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. చమురు గింజల పంటలు వేయడం ఇప్పటికే 80 శాతం పూర్తయిందని, గోధుమ పంటను కూడా వేగంగానే వేసుకుంటున్నారని అధికారులు వివరించారు.

ఈ సీజన్‌లో ఆవాల పంట వేసిన రైతులు డీఏపీ ఎరువు కోసం క్యూ కడుతున్నారు. సహకార సొసైటీల ఎదుట బారులు తీరుతున్న రైతన్నలను అదుపు చేసేందుకు అనేక ప్రాంతాలలో పోలీసులను రప్పించారు. ఇటీవల భివానీ జిల్లాలో ఒక చోట డీఏపీ పంపిణీ కోసం పోలీస్ స్టేషనే కూపన్లు పంచింది. దేశవ్యాప్తంగా డీఏపీ ఎరువు కొరత ఉన్నదంటూ వస్తున్న వార్తలతో రైతాంగం కలవరపడుతోంది. రాష్ట్రంలో గోధుమ సీజన్ ఇప్పటికే ప్రారంభం కావడంతో యూరియా సరఫరా కోసం ప్రభుత్వం సన్నాహాలు మొదలు పెట్టింది. రాష్ట్రంలో 11 ఎల్ఎంటీ యూరియా అవసరమవుతుంది. హర్యానాలోనే కాదు...దేశవ్యాప్తంగా యూరియాను రైతులు అధికంగా వినియోగిస్తుంటారు. 2009-10లో 26.7 మిలియన్ టన్నుల యూరియా అమ్మకాలు జరగగా 2022-23లో అది 35.7 మిలియన్ టన్నులకు పెరిగింది. పంజాబ్, హర్యానా రాష్ట్రాల రైతులు యూరియాలో జింక్ సల్ఫేట్ కలిపి వరి పంటకు వేస్తుంటారు.



కూటి కోసం..

క్లిక్ : పిప్పళ్ల వెంకటేశ్



అంబులెన్స్‌లో కేంద్రమంత్రి

ఉత్సవానికి వెళ్లడంతో చర్చనీయాంశం

- మంత్రి సురేశ్‌గోపీపై కేసు

తిరువనంతపురం: అంబులెన్స్‌లో కేంద్ర మంత్రి అనగానే అయ్యో ఆయనకు ఏమైంది అని అనుకుంటాం. కానీ ఓ ఉత్సవానికి వెళ్లేందుకు మోడీ క్యాబినెట్‌లోని ఓ మంత్రి అంబులెన్స్‌లో వెళ్లటం చర్చనీయాంశమైంది. కేరళలో జరిగిన ఈ ఘటనతో కేంద్రమంత్రి సురేశ్ గోపీపై కేసు నమోదైంది. సాధారణంగా కేంద్రమంత్రి ఎక్కడికి వెళ్లినా...ట్రాఫిక్‌ను అలర్ట్ చేయటం కామన్. మరి సురేశ్ గోపీకి.. ఎందుకని అంబులెన్స్‌లో త్రిశూర్ ఉత్సవానికి వెళ్లాలనే ఆలోచన వచ్చిందో.. కానీ రాజకీయంగా తీవ్ర దుమారమే చెలరేగింది.

త్రిశూర్ పూరం అనేది కేరళలో ప్రసిద్ధమైన ఉత్సవం. లోక్‌సభ ఎన్నికల సమయంలో త్రిశూర్ నుంచి పోటీకి దిగిన సురేశ్ గోపీ.. ఈ ఉత్సవానికి తన వాహనంలో కాకుండా అంబులెన్స్‌లో వచ్చారు. దీన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా ఖండించాయి. సురేశ్ గోపీకి సహాయం చేసేందుకే ఉత్సవానికి అంతరాయం కలిగించినట్టు ఆరోపించాయి. నాటి నుంచి దీనిపై వివాదం నడుస్తోంది. తాజాగా దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అవన్నీ అవాస్తవాలు..

దీనిపై కేంద్రమంత్రి సురేశ్ గోపి స్పందించారు. అవన్నీ ఆరోపణలంటూ తోసిపుచ్చారు. "ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్టు నేను అంబులెన్స్‌లో ఉత్సవానికి రాలేదు. అవన్నీ అవాస్తవాలు. నా సొంత కారులోనే అక్కడికి వచ్చాను. నేను అంబులెన్స్‌లో రావడం ఎవరైనా చూశారా..? ఒకవేళ చూస్తే అందుకు తగిన ఆధారాలు చూపించాలి" అని అన్నారు.

హిమంత ప్రసంగం విద్వేషపూరితం

ఈసీకి ఇండియా బ్లాక్ ఫిర్యాదు

రాంచీ : బీజేపీ జార్ఖండ్ ఎన్నికల ఇన్‌ఛార్జ్, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ఎన్నికల ప్రసంగాలు ప్రజల మధ్య విభజన సృష్టించే విధంగా ఉన్నాయని, అవి విద్వేషపూరితమని ఇండియా కూటమి నేతలు మండిపడ్డారు. ఆయనపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్జేడీ, సీపీఐ (ఎం), కాంగ్రెస్, జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) పార్టీల నేతలు కేంద్ర ఎన్నికల సంఘానికి, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి లేఖలు రాశారు. ఈ నెల 1న సారత్‌లో జరిగిన బహిరంగ సభలో హిమంత ముస్లింలను లక్ష్యంగా చేసుకొని ప్రసంగించారని తెలిపారు. 'వారు ఒకే పార్టీకి ఓటేస్తారు. మనం ఇక్కడ సగం, అక్కడ సగం వేస్తాము' అని హిమంత తన ప్రసంగంలో ముస్లింలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎన్నికల కమిషన్‌కు రాసిన లేఖను ఇండియా కూటమి నేతలు విలేకరులకు విడుదల చేశారు. హిమంత తన ప్రసంగంలో 'చొరబాటుదారులు' వంటి విషపూరితమైన పదాలను ఉపయోగించడం ద్వారా విద్వేషాన్ని, అసమ్మతిని రెచ్చగొట్టారని వారు ఆ లేఖలో ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మైనారిటీ నేతలను లక్ష్యంగా చేసుకొని హిమంత ఓ ఇంటర్వ్యూ ఇచ్చారని కూడా తెలియజేశారు. రాబోయే 24 గంటలలో ఎన్నికల కమిషన్ ఎలాంటి చర్యలు చేపట్టకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని వారు హెచ్చరించారు.

శ్రీనగర్ మార్కెట్ సమీపంలో గ్రెనేడ్ దాడి

10 మందికి గాయాలు



శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో టూరిస్ట్ రిసెప్షన్ సెంటర్ (టీఆర్‌సీ) సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన గ్రెనేడ్ దాడిలో పది మంది గాయపడ్డారు. సండే మార్కెట్ నిర్వహించే జనసమ్మర్ద ప్రదేశంలో ఈ ఘటన జరిగింది. టీఆర్‌సీ సమీపంలో ఉన్న కేంద్ర రిజర్వ్ దళాల (సీఆర్‌పీఎఫ్) సిబ్బంది వైపు గ్రెనేడ్ విసిరారని పోలీసులు తెలిపారు. అయితే అది లక్ష్యాన్ని చేరకుండా ఓ వీధి వ్యాపారి బండిని తాకింది. ఈ ఘటనలో 10 మంది గాయపడ్డారు. వారిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. జమ్మూకాశ్మీర్ పోలీసులు, పారామిలటరీ దళాలు వెంటనే ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి దుండగుల కోసం గాలింపు చేపట్టారు. గత సంవత్సర కాలంలో శ్రీనగర్‌లో గ్రెనేడ్ పేలుడు జరగడం ఇదే మొదటిసారి. శ్రీనగర్‌లోని ఖన్యార్ ప్రాంతంలో ఉస్మాన్ లష్కరీ అనే లష్కరే తోయిబా కమాండర్‌ను ఎన్‌కౌంటర్‌లో మట్టుపెట్టిన మరునాడే ఈ దాడి జరగడం గమనార్హం. శనివారం రోజంతా జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు భద్రతా సిబ్బంది గాయపడ్డారు.

ఉపసంహరణలో 'కొంత పురోగతి' : జైశంకర్

బ్రిస్బేన్ : బలగాల ఉపసంహరణలో భారత్-చైనా 'కొంత పురోగతి' సాధించాయని, దీన్ని స్వాగతిస్తున్నామని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తెలిపారు. ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో భారత కమ్యూనిటీతో జరిగిన చర్చ సందర్భంగా మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. తూర్పు లడఖ్‌లోని డెమ్‌చోక్, డెస్పాంగ్ ప్లెయిన్స్ వద్ద భారత, చైనా దళాల ఉపసంహరణ పూర్తయిందని వార్తలు వచ్చిన కొన్ని రోజుల తరువాత మంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. 'కొన్ని కారణాల వల్ల భారత్-చైనా మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. అయితే ఉపసంహరణ విషయంలో మేం కొంత పురోగతి సాధించాం' అని మంత్రి ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. ఉపసంహరణ తర్వాత ఇరు దేశాల సంబంధాల్లో ఇతర మార్పులు కూడా జరిగే అవకాశం ఉందని మంత్రి చెప్పారు. గత నెలలో రష్యాలో ప్రధాని మోడీ, చైనా అధ్యక్షులు జిన్‌పింగ్ భేటీ అయిన విషయాన్ని గుర్తు చేస్తూ.. ఆ తర్వాత ఇరు దేశాల విదేశాంగ మంత్రులు, జాతీయ భద్రతా సలహాదారులు కూడా భేటీ అవుతారని జైశంకర్ తెలిపారు.

నేనంటాను

కల్లం ఉన్నది మనచేతిలో
గుల్లం మాత్రం పడెగోతిలో,
దప్పి తీరదని నేనంటాను
నీళ్లే అందని మన నూతిలో

పడవ నడపలేనివాడు నావికుడు
పదము పాడలేనివాడు గాయకుడు
అందుకనే వేదనతో నేనంటాను
ప్రజల నడపలేనివాడు నాయకుడు!

పైపై సొగసులు కల్లసుమా!
లోపలిదంతా డొల్లసుమా!
నిజం తెలియమని నేనంటాను
లేదా కొంపే గుల్లసుమా!

నింగి కితాబుగ చేశాను
చుక్కల హిసాబు వేశాను
ప్రేయసి కోసం వేచీవేచీ
తుదకు మంచమే నేశాను

బండను కోయాలి కుసుమదళం
గుండెను కోయాలి నయన జలం
కదనరంగమున, నేనంటాను
కత్తిని మించాలి కవుల కలం

నవబాష్పధారలో నవ్వు కాగలవు
ముళ్ల తీగెలలోన పువ్వు కాగలవు
యత్నించి చూడమని అంటాను నేను
రాళ్ల రాసులలోన రవ్వ కాగలవు

- దాశరథి కృష్ణమాచార్య
(5వ తేదీ దాశరథి 37వ వర్ధంతి)



సకల సామాజిక అంతరంగ తరంగాలు


కొన్ని విషయాల అంతరార్థం విడమర్చి చెప్పేవరకు దాని విస్మృత, విపక్ష, వివక్షిత కోణం పాఠకులకు స్ఫురించదు. అమ్ముడు పోయిన మీడియా కాలంలో 'అదర్‌సైడ్' ఏమున్నదనేది బాధితులు, పీడితుల గొంతు వింటేగానీ అర్థంగాదు. ఆధిపత్యాల, అఘాయిత్యాల గుట్టును రట్టు చేస్తూ ఆర్టీఐ కార్యకర్తలు మొదలు మానవ హక్కుల కార్యకర్తల వరకు ఉద్యమిస్తున్నారు. ఈ గొంతుకలకు తమ కార్యాచరణ జోడించి చాలా మంది ఉద్యమకారులు, విద్యార్థులు, బుద్ధిజీవులు కార్య క్షేత్రంలో పని చేస్తున్నారు. నిజానికి ఉద్యమం అంటే రోడ్డు మీద బైఠాయింపులు, ధర్నాలు, ప్రదర్శనలు, జైలు శిక్షలే గాదు, ఆధిపత్యాన్ని, అవమానాల్ని ప్రశ్నించే విధంగా, కొట్లాడే వారికి సంఘీభావం తెలిపేలా, స్వీయ లోపాలను సరిదిద్దుకునే విధంగా ప్రజలను తీర్చిదిద్దడం కూడా ఉద్యమమే! ఈ ఉద్యమ స్ఫూర్తితో హక్కులు, విధులు, బాధ్యతలు, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, నైతికత, గౌరవం, జీవితంతో సహా సకల సంశయాలను, అంశాలను విప్పుతూ, విడమర్చి చెబుతూ, సమస్యలను సాహిత్యానుశీలనతో చర్చకు పెట్టిన పుస్తకం 'అంతరంగం' కాలమ్ నా వ్యాసాలు. ఈ అంతరంగ తరంగాలను రంగం మీదికి తెచ్చి సాహిత్య, సామాజిక, సందేశ, యాత్రా కథనాలుగా మలిచింది అన్నవరం దేవేందర్.

దేవేందర్ పూర్వాశ్రమంలో జర్నలిస్టు కావడంతో నిరంతరం రాసే నైపుణ్యం అబ్బింది. కొన్ని సార్లు నిమిషాల్లో రాయాల్సి ఉంటుంది కూడా! 'కాలమ్' రాయడమన్నది కత్తిమీద సాములాంటిదే! దాన్ని నెగ్గుకు వచ్చిన కార్యశీలి అన్నవరం. ప్రతివారం మానసిక చర్నింగ్ జరుగుతూ ఉంటుంది. ఈ 'అంతరంగం'లోని మొత్తం 150 వ్యాసాలున్నాయి. వీటిని కేవలం సమీక్షలు అనే కన్నా దృష్టికోణాన్ని విస్తృత పరిచే రచనలని చెప్పాలి.

జీవితానుభవం, నిశితాధ్యయనం, సేవా తాపత్రయం, లెర్నింగ్- అన్ లెర్నింగ్ అండ్ రీ లెర్నింగ్, పే బ్యాక్ టు ది సొసైటీల కలబోత ఈ గ్రంథం. సమకాలీనాంశాలపై లోచూపుని సారించాడు. తెలుగు సమాజాన్ని చైతన్య పరిచిండు. హితవు చెప్పిండు. బాధ్యతలను గుర్తు చేసిండు. ప్రభుత్వాల ఆలసత్వాన్ని, ప్రభుత్వాధినేతల వాచాలత్వాన్ని, చదువుకున్న వారిలో సైతం కొరవడుతున్న శాస్త్రీయ దృక్పథాన్ని, కరోనా కాలములో వ్యాక్సిన్లు-ఆక్సిజన్ సిలిండర్‌లు దొరకని దుర్దశను, మనుషుల చావులో సైతం గట్టిగా ఏడ్వలేని బాధను, ఒకరి నొకరు పట్టుకొని ఓదార్చే వీలు లేని 'లాక్‌డౌన్'లను ఇందులో అక్షరబద్ధం చేసిండు. ఒక రకంగా గత మూడేండ్ల కాలంలో తెలుగు సమాజం ఏ 'తొవ్వ'లో నడిచిందో చెప్పిండు. తెలంగాణ మనుషుల జీవితపు ప్రతి మలుపును ఈ వ్యాసాలు సంక్షిప్తంగానే అయినా నిక్కచ్చిగా రికార్డు చేశాయి. లోటుపాట్లను సూటిగా ప్రశ్నించాయి. సరిదిద్దుకోవాల్సిన అంశాలని ఢంకా బజాయించి చెప్పాయి.

అంతరంగం 'కాలమ్'లోని వ్యాసాలను సాహిత్యం, సమాజం, సా'మాన్యు'లు, సందేశం, సకలంగా విభజించ వచ్చు. ఇది బ్రాడ్ విభజన మాత్రమే. వీటిని దేవేందర్ 'వర్తమాన జీవన చిత్రణ' అని పేర్కొన్నాడు. ఈ జీవన వికాస వ్యాసాల్లో ఉద్దేశ పూర్వకంగానో లేదా మరో విధంగానో ప్రజాస్వామిక పునాదులైన నాలుగు స్థంభాలు 'జ్యుడిషియరీ', 'లెజిస్లేటివ్', 'ఎగ్జిక్యూటివ్', 'మీడియా'ల్లో మొదటి దాన్ని మినహాయించి మిగతా అన్నింటిని అరుసుకున్నడు. ప్రజాస్వామ్యం పరిఢవిల్లడానికి తన వంతుని కృషిని చేసిండు. ఈ వ్యాసాలకు వాడిన ఇంగ్రీడియెంట్స్, వినియోగించిన పొయ్యి, బంతి భోజనం గురించి చెప్పే ప్రయత్నం చేస్తున్నాను. ఒకరి టేస్ట్ బడ్స్ మరొకరితో మ్యాచ్ గావు. కాకపోతే వంట రుచిగా, శుచిగా, ఆకలి తీర్చేదిగా ఉందని మాత్రం చెప్పవచ్చు. ముందుగా అటికె, కుండలో వండిన కాయి బువ్వ లాంటి సాహిత్యం గురించి చర్చించుకుందాం!

సాహిత్యం : ఈ 'అంతరంగం'లో దాదాపు 30 పుస్తకాల పరిచయమున్నది. మెజారిటీగా కరీంనగర్ జిల్లా వాండ్లవి అందులోనూ దేవేందర్‌కు ఇష్టమైన ప్రక్రియ కవిత్వం మీద రచనలు ప్రధానంగా ఉన్నాయి. కరీంనగర్ సాహితీ మిత్రులు, ఉద్యమ దోస్తులు, ప్రాణదీపంలో 'కన్నీటికి నిలువుటద్దంపై పంక్తులు రాసింది గాజోజు నాగభూషణం' అని ఒక్క వాక్యంలో సారాన్ని చెప్పిండు. బూర్ల వెంకటేశ్వర్లు -ప్రాణగంధం, నలిమెల భాస్కర్ - ఇక్కడి నేల అక్కడి వాన (అనువాద కవిత్వం), పెనుగొండ సరసిజ - ఇక మారాల్సింది నువ్వే, దామరకుంట శంకరయ్య -వయ్యి, కందుకూరి అంజయ్య -జమిడిక, రిక్కల సహదేవరెడ్డి - రక్తచలన సంగీతం, కె.వి.నరేందర్ - బొడ్లె సంచీ కవితా సంపుటాలపై అభిప్రాయాలను రికార్డు చేసిండు. వస్తు విశిష్టతను చెప్పిండు. కొత్త కోణాలను ఆవిష్కరించిండు. అట్లాగే తెలంగాణ ఉద్యమ పాటలు 'నిప్పుల వాగు' (అందెశ్రీ సంపాదకత్వం), పులికొండ సుబ్బాచారి -తెలుగింటి జానపద కథలు, పిన్నంశెట్టి కిషన్ -లేంబాల వాటిక కథలు, గజేందర్ రెడ్డి -వెలుగుల వెల్లువ, కూకట్ల తిరుపతి - జల్లెడ, గోపగాని రవీందర్- శతారం తదితర సంపుటాలు, సంకలనాల విశిష్టతను లెక్కగట్టిండు. గురజాల రవీందర్ -బొగ్గు రవ్వలు, సంగిశెట్టి శ్రీనివాస్ - రెడ్లు వెలమలేనా? బీసీలు సిఎం కావొద్దా?, బూర్ల వెంకటేశ్వర్లు-ఉపకారి తదితర గ్రంథాలపై ఇందులో విశ్లేషణలున్నాయి. ఇందులో చివరి మూడు పుస్తకాలు హుస్నాబాద్‌తో సంబంధం ఉన్న పుస్తకాలు. మంగళారపు లక్ష్మణ్ జర్నలిస్టుగా దేవేందర్‌కు దోస్తు. ఆయన తన అనుభవాలతో ఆ ప్రాంత మావోయిస్టు ఉద్యమ జీవితాలను రికార్డు చేసిండు. అట్లాగే మేర మల్లేశం సాయుధ పోరాటం, తెలంగాణ ఉద్యమం రెండింటిలోనూ పాల్గొన్న కవి, కార్యకర్త. గులాబీల మల్లారెడ్డి పత్రికలు నడిపించడమే గాకుండా నవలలు, కథలు రాసిండు. ఈ ముగ్గురితోనూ అదే ప్రాంతం వాడైన దేవేందర్ బంధం పెనవేసుకొని ఉన్నది. ఉద్యమ జ్ఞాపకాలను, నెత్తుటి మరకలను, గాయాలను ఈ వ్యాసాల్లో చిత్రిక గట్టిండు. మల్‌దాదా నవల గులాబీల మల్లారెడ్డి తాత చరిత్రే. ఆయన ఆ తురకవాని కుంట ప్రాంతంలో ఎట్లా సామాజిక సమరసత సాధించిండో చెప్పిండు. అట్లాగే తాను చదువుకున్న పాఠశాల 75 ఏండ్ల సందర్భాన్ని, అందులో చదువుకొని వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాల్లో ఉన్నవారిని గుర్తు చేసుకుంటూ ఘనతను చాటి చెప్పిండు. అంతేగాదు హుస్నాబాద్ సామాన్యులను సైతం లెక్కగట్టిండు. చరిత్రకెక్కదగ్గవారిని మక్కువతో ఎత్తి చూపిండు.



దేవేందర్ పూర్వాశ్రమంలో జర్నలిస్టు కావడంతో నిరంతరం రాసే నైపుణ్యం అబ్బింది. కొన్ని సార్లు నిమిషాల్లో రాయాల్సి ఉంటుంది కూడా! 'కాలమ్' రాయడమన్నది కత్తిమీద సాములాంటిదే! దాన్ని నెగ్గుకు వచ్చిన కార్యశీలి అన్నవరం. ప్రతివారం మానసిక చర్నింగ్ జరుగుతూ ఉంటుంది. ఈ 'అంతరంగం'లోని మొత్తం 150 వ్యాసాలున్నాయి. వీటిని కేవలం సమీక్షలు అనే కన్నా దృష్టికోణాన్ని విస్తృత పరిచే రచనలని చెప్పాలి.

సా'మాన్యులు': దేవేందర్ తన కాలమ్‌లో స్ఫూర్తిప్రదాతలను అక్షరబద్ధం చేసిండు. ఇందులో వ్యక్తులుగా బెక్కటి బాలయ్య, వేణు సంకోజు, రజనిశ్రీ, ఇర్ఫాన్ మహమ్మద్‌లను, నవ్య, షేజల్, తుల్జా, తులసీ, బద్రెలక్క, కుల్వీంర్ కౌర్, నాయిని నరసింహా రెడ్డి, బద్రివిశాల్ పిట్టి, మఖ్దూం మొహియుద్దీన్, గద్దర్, కాలువ మల్లయ్య, డా॥ఎన్.గోపి, జూలూరు గౌరీశంకర్, నిజాం వెంకటేశం, రేగులపాటి కిషన్‌రావు, పేర్ల పేరుతో 'శ్రీనివాస్'లను సాహిత్యంలో నిలబెట్టిండు.

35 ఏండ్ల కిందటే కరీంనగర్‌లో జర్నలిస్టుగా, ఉద్యమాలను, ఉద్యమ నాయకులను దగ్గరి నుంచి చూసిన వాడు కావడంతో మంచి - చెడు విశ్లేషణ, వివేచన మొదటి నుంచే ఒంట బట్టాయి. అందుకే ఆ మంచిని పది మందికి చెప్పడం అలవాటు చేసుకున్నడు. సర్వీస్‌లో ఉన్నన్ని రోజులు ఆ పనిని 'కవిత్వం' ద్వారా చేసిండు. ఇప్పుడు రిటైరైనాక ఈ కాలమ్ ద్వారా చెప్పడం షురువ్ జేసిండు. ఎనుకట జర్నలిస్టు కాబట్టే ఇప్పుడిలా 'సందేశం' ఇవ్వగలిగిండు.

సందేశం : మద్యానికి అలవాటుపడి తమ జీవితాలను తామే నాశనం చేసుకుంటున్న దుర్మార్గాన్ని నిరసించాడు. అందుకే ఈ 'కాలమ్'ద్వారా మనుషుల్లోని క్రూరత్వాన్ని, హత్యా ప్రవృత్తిని, హింసా దోరణిని, విద్య ఉన్నా విజ్ఞానం లేకుండా మూఢనమ్మకాల బారిన పడి మసి అవుతున్న వాళ్ల గురించి, బాధ్యతలు మరుస్తున్న పౌర సమాజం, పోరాట బాటను మరిచిన ఉద్యోగ, కార్మిక వర్గాలు, సంఘాలే లేని 'సాఫ్ట్‌వేర్' రంగాన్ని ఎత్తి చూపించిండు. దెప్పి పొడిచిండు. లోపాలను సరిదిద్దుకొని ముందుకు సాగాలని హితవు చెప్పిండు. అహం అన్ని రోగాలకు మూలం అని జ్ఞానోపదేశం చేసిండు. సామాజిక సమస్యలపై చైతన్యం కలిగించిండు. బహుజన దృక్కోణమూ జోడించాడు.

నవ్వుతూ ఉద్యోగం చేయాలంటూ సలహా ఇచ్చిండు. ఆర్టీసీ, టీచర్, సింగరేణి ఉద్యోగాలు 90లకు ముందు మధ్యతరగతిని సృష్టించింది. వీళ్ల పిల్లలు ఆ తర్వాత ఉన్నత చదువులు చదువుకొని ఇతర నగరాల్లో, విదేశాల్లో సెటిల్ అవుతున్నారు. అయితే రెక్కలు వచ్చిన పక్షి ఎగిరి పోవడం ఆధునిక కాలంలో తప్పదు, తప్పనిసరి అంటూ వృద్ధాప్యంలో పిల్లలు దగ్గర లేరు, పిల్లల దగ్గర తాము లేమని బాధపడవద్దంటూ పెద్దలకు హితబోధ చేసిండు. అట్లాగే ఈ వృద్ధాప్యంలో ఉన్న వాళ్లు అన్ని పనులు తామే చేసుకోవాలని తాపత్రయ పడకుండా కొన్ని పనులు వేరొకరితో చేయించుకున్నట్లయితే వారికి సైతం ఉపాధి ఇచ్చిన వారవుతారని సూచించారు. నీరక్షీర వివేకంతో వ్యవహరించిండు. నైతికత చాదస్తంగా మారడాన్ని, దిగజారుడు రాజకీయాలు, దిగదుడుపు భాష 'సకలం' తన 'అంతరంగం' ద్వారా అన్నవరం ఆవిష్కరించిండు.

సకలం : ఇందులో 'సోషల్ ఇంజనీరింగ్', 'బతుకమ్మ-పాట', నక్సలైట్ల మూలంగా అబ్బిన ప్రశ్నించే తత్వం, తార్కిక ఆలోచన, రియల్ ఎస్టేట్ - ఈజీమనీ, దోకాలు, స్నేహం, సినిమా, కళ, బలగం-సినిమా, తెలంగాణ భాష, స్త్రీలు- సమాజం, మగాహంకారం, కెమెరా కోసం జరిగే పెళ్ళిల్లు, మారుతున్న పెళ్లి వయసు, తిండి వేస్టేజ్, టేక్ అవే ఫుడ్ కల్చర్, కంకి పోయి పాప్‌కార్న్‌ని తెచ్చిన మార్కెట్ మాయాజాలాన్ని ఉద్యమస్ఫూర్తితో చెప్పిండు. మనిషి ఉన్న ఊరిని వదిలి కొత్త ప్రదేశానికి వెళితే గానీ తమ ప్రదేశాల్లోని గొప్ప/లోటు తెలుసుకోలేమనేది సత్యం. అందుకే దేవేందర్ ఏ అవకాశం దొరికినా కొత్త ప్రదేశాలు చూడ్డానికి ఉత్సుకత చూపిస్తాడు. ఏదైనా కొత్త ప్రదేశానికి వెళితే అక్కడి మట్టి మనుషులతో మాటలు కలిపి దాని మర్మాన్ని తెలుసుకుంటాడు. అట్లా కేరళ, జమ్మూ కశ్మీర్, డిల్లీ, మారేడుమిల్లి ప్రయాణాల్లో తెలుసుకున్న మర్మాలని పాఠకులకు విడమర్చి చెప్పిండు. ఉస్మానియా సాహిత్య ఉత్సవం, డిల్లీ సాహిత్య సదస్సు, బుక్ ఫెయిర్లు, ఉత్సవాలు, పదేండ్ల తెలంగాణ, తెలంగాణ తల్లిపై ప్రేమ ఇట్లా అనేక విషయాలపై తనదైన పదునైన వాక్యంతో కమ్మిన మాయాపొరల్ని చీల్చి సత్యాన్ని దర్శింప జేసిండు.

కొసరు : అన్నవరం దేవేందర్ రచన అంటేనే అది తెలంగాణ తల్లి కమ్మనైన భాషకు అక్షర రూపం. అందుకే 'పుల్లగండు', 'ఒకారం' తదితర పదాలను అన్నవరం మాత్రమే సాహిత్యంలోకి తీసుకు రాగలడు. ఇందులో తీసుకొచ్చిండు. నిరంతరాయంగా మూడేండ్లకు పైగా ఒక కాలమ్ తెలుగు పత్రికల్లో రాయడమంటే కష్టసాధ్యమైన పని. ఈ కష్టమైన పనిని ఇష్టంగా చేసిండు అన్నవరం. తనకు వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకొని నిజమైన పెద్దరికంతో 'హితవు' చెప్పిండు. సాహిత్యమంటే హితవు చెప్పేదే కదా. రాజకీయ నాయకులపై ఎన్నికల సమయంలో సంయమనంతోనే అయినా సూటిగా ప్రశ్నించిండు. ఓటర్లకు దిశా నిర్దేశం చేసిండు. దేవేందర్ సోషల్ సైంటిస్ట్‌గా మారి 'కులవృత్తి దాటి బయటికి రావాలి' అని పిలుపునిచ్చాడు. అవును కులవృత్తిలో కూరుకుపోయినన్ని రోజులు కూడుకు కష్టమే అన్నది నిజం.

దేవేందర్ తన పుస్తకంలో చెప్పినట్టు "మనిషి పుట్టుక, ఎదుగుదల, సంసారం, వలసలు, వరసలు, రాజ్యం, సామ్రాజ్యం, యుద్ధం-శాంతి, ప్రేమ, మతం, ఆధ్యాత్మికత అన్నీ అచ్చం నేర్పించేది మనముందున్న పుస్తకాలే" అనే విషయం ఈ పుస్తకానికి వర్తిస్తుంది. మన ఎదుగుదలలో ఈ పుస్తకమూ అవసరమే!

ఈ వ్యాసాల ద్వారా తన ఒక్కడి 'అంతరంగం' మాత్రమే గాకుండా సమాజానికి బాకీ పడ్డామని భావించే బుద్ధిజీవులందరి భావనలను ఆవిష్కరించాడు. కరోనానంతరం తల్లడమల్లడవుతున్న మనుషుల జీవన టీకా-తాత్పర్యమిది.



డా. సంగిశెట్టి శ్రీనివాస్,
9440763479

తరగతి గది

అలా తరగతి గదిలోకి
అడుగు పెట్టకముందే
కొందరు పిల్లలు వాకిలి ముంగిట్లో
తోరణాలయి నన్ను ఆహ్వానిస్తారు
వానొచ్చే ముందు తూనీగల్లా
సందిడంతా సద్దుమనుగుతుంది

శుభోదయమని ఆ కుడిచేతులలా
ఎత్తుతున్నప్పుడల్లా
ఇంద్రధనుస్సులై విరిసినట్టే వుంటుంది
పిల్లల మొగములోని నవ్వుల పువ్వులన్నీ
నా కండ్లల్లో విరిసినాక
పూసుకున్న రెక్కలతో
తరగతికొమ్మన పిట్టనై రాగాలందుకుంటా
జ్ఞానం విత్తులు మొగ్గలు కట్టేది

తరగతి తీగల క్షేత్రం పైనే
ఆ మొగ్గలకు మాటలనవుతా
పలుకులకు మలుపునవుతా
ఆటలకు పాటనవుతా
ప్రశ్నలకు సమాధానమవుతా
'తరగతి' వేయిపూల పరిమళాల
చినుకుల తోట, ఆకుపచ్చని పందిరి
పొద్దంతా జోలపాడే అమ్మఒడి

కాలం కురుస్తున్న క్షణ బిందువుల మధ్య
విరామగంట మోగినప్పుడల్లా తరగతి గది
పైరు కోసిన కయ్య లాగవుతుంది
చివరిగంట మోగగానే
వొలిచిన మొక్కజొన్న కంకిలా
దిగుడు కండ్ల దిగులు దృశ్యం
దేవునిముందు ధూపం
పొలపము అలల్లా వ్యాపించినట్లు

'తరగతి గదులే' సమాజపు
ప్రాణవాయువులు
లేలేత మెదుళ్లలో ఆలోచనల
సాగుబడి గల సారవంతమైన నేల
ఏ దేశం లో నైనా
స్వార్థం లేని బాల్యాన్ని చూడాలంటే
తరగతి గది దాకా నడవాల్సిందే

- ఈ.రాఘవేంద్ర, 9494074022

సాహిత్యవ్యాస 'ధార'

Some books are to be tasted, others to be swallowed, and some few to be chewed and digested: Francis Bacon

కవిగా, విమర్శకుడిగా, జర్నలిస్టుగా తనదైన తెలుగువాక్యాన్ని నిర్మించుకొని సాహిత్యాన్ని ధారావాహికంగా వ్యాఖ్యానిస్తున్న యువసాహితీకెరటం అనంతోజు మోహన్‌కృష్ణ. అనంతోజు 'ధార' అనే సాహిత్య వ్యాసాల సంకలనం 2023, 2024 లో రెండుసార్లు వెంటవెంటనే ప్రచురించబడటం అంటే తనను తాను మంచి విమర్శకుడిగా నిరూపించుకున్నట్లే. మొత్తం 18 వ్యాసాలతో వెలువడిన ఈ 'ధార' గ్రంథం పాతతరం రచయితల్నే కాకుండా సమకాలీన రచయితల రచనల్ని కూడా ఇందులో పొందుపర్చటం మూలాన ఈ గ్రంథానికి పరిపుష్టి చేకూరింది.

మొదటి వ్యాసమైన 'తెలంగాణ రుద్రవీణ'లో మహాకవి దాశరథి కృష్ణమాచార్యను గురించి రాస్తూ తెలంగాణలో ఆవేశం అనే తుపాకితో అక్షరాలనే తూటాలను పేల్చి ప్రజలను చైతన్యపరిచిన అచ్చమైన తెలంగాణ కవి అంటూ, 'మా నిజాము నవాబు జన్మజన్మల బూజు" అని నిరసన గళమెత్తినందుకు చేతులకు బేడీలు పడినా దడవని మానుకోట బిడ్డ అని అభివర్ణిస్తాడు. అంతేకాక తెలుగుకు గజల్ సొగసు అద్దిన తొలికవిగా గాలీబ్ రాసిన ఉర్దూ గజళ్లను తెలుగులోకి అనువదించడమే కాక తెలుగు సినీగేయ రచయితగా దాదాపు 2000 అజరామరమైన పాటల్ని రాసిన అరుదైన సృజనకారుడిగా కొనియాడతాడు. ఒక కవిగానే కాక, ఒక బాధ్యత కల్గిన పౌరునిగా నూతన సమాజం కోసం పరితపించిన హృదయంతో రాసిన ఈ క్రింది కవితాపాదాలు దాశరథి హృదయ వైశాల్యాన్ని తెలియపరుస్తాయి.

"రక్తం సదులై పారకపోతే రాదా రెవల్యూషన్/ బుర్రలు బుర్రలు పగలక సమస్యకు లేదా సొల్యూషన్" ఈ వాక్యాల్ని కుణ్ణంగా పరిశీలిస్తే రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యల్ని అతిసామాన్య భాషలో కవిత్వం చేసి పండితుల్నే కాక సామాన్య పాఠకుల్ని సైతం మెప్పించిన అసాధారణ ప్రతిభావంతుడైన కవిగా దాశరథిని గుర్తించవచ్చు.

తెలంగాణ వాస్తవికతను ఆనాటి సమాజ పోకడల్ని చాలా స్పష్టంగా, నిర్దిష్టంగా తనరచనల్లో ప్రతిబింబించిన రచయితగా వట్టికోట ఆళ్వారుస్వామిని గుర్తించవచ్చు. ఆయన రాసిన ప్రసిద్ధ రచన 'ప్రజలమనిషి' ని తెలంగాణలో మొట్టమొదటి నవలగా పేర్కొనవచ్చు. ఆళ్వారుస్వామిలోని కళాదృష్టి మనుషులపట్ల, అలాగే సమాజంపట్ల ఆయనకున్న విశ్వాసం, ఒక రచయితకుండవలసిన సాహిత్య నిబద్ధత, ఆయనను తెలుగుసాహిత్య సీమలో కలంయోధునిగా అజరామరుణ్ణి చేశాయి.



'విశ్వనరుడు' అనే వ్యాసంలో నవయుగకవి చక్రవర్తి గుర్రం జాషువా 'గబ్బిలం' కావ్యం గురించి రాస్తూ 'కసరి బుసకొట్టు నాతని గాలిసోక/ నాల్గు పడగల హైందవ నాగరాజు' అనే కవితా వాక్యాల్ని ఉటంకిస్తూ హిందుత్వాన్ని చాలా తీవ్రంగా నిరసించాడని.. కలాన్ని గళంగా మార్చి తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యదీపాల్ని వెలిగించాడని జాషువాను కొనియాడుతూ, ఆయన రచనలను చదివి వారి ఆశయాలను నెరవేర్చడమే మనం ఆయనకిచ్చే అసలుసిసలైన నివాళి అంటాడు.

'రగులుతున్న పంక్తులు.. పగుళ్ళుపారిన పాదాలు నెత్తురోడ్చే అక్షరాలు... కత్తిమొనలాంటి కవిత' అనే కవిత్వపాదాల్ని తీసుకొని తెలంగాణ సాహితీదిగ్గజం సినారె గురించి... అత్యంత ప్రతిభావంత బహుముఖ కవిగా, ఆయన రాసిన పద్యాల్ని, కవితల్ని, సినిమా పాటల్ని, గజళ్లను కథల్ని, ఇలా వివిధ ప్రక్రియల్లో అందెవేసిన చేయిగా తెలుగు సాహిత్యంలో అనేక కొత్త ప్రయోగాలకు ఆద్యుడైన సినారె సాహిత్య అద్భుతంగా వర్ణిస్తాడు.

ఆకలికేకల్లోంచే అసలైన కళలు, కళాకారులు ఉదయిస్తారనడానికి జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత డా.రావూరి భరద్వాజ సృజియించిన సాహిత్యాన్ని, జీవితాన్ని ఉదాహరణగా తీసుకోవచ్చు. కణకణలాడిన పేగుల బాధలు పాకుడు రాళ్లపై జారీ జారీ... అనుభవాల ఉలితో తనను తాను చెక్కుకున్న అక్షరశిల్పి రావూరి అంటూ... ఆకలి ఆ రచనలకు ప్రేరణ అని... ఆ ఆకలిబాధను మర్చిపోవడానికే అక్షరాలను ఆలింగనం చేసుకొని సృజన కళను ఆవాహన చేసుకున్న అక్షరబ్రహ్మ రావూరి.

ప్రపంచ సాహిత్యచరిత్రలో గొప్ప రచయితగా నిలిచిన మాక్సిమ్ గోర్కీ రాసిన 'అమ్మ' నవల ఎంత ప్రభావవంతమైనదో ఆ నవల గురించి ఎన్ని భాషల్లో ఎంతమంది ఎన్ని వ్యాసాలు రాసినా ఆ నవలలో ఏదో కోణం మిగిలే ఉంటుందనేది నిర్వివాదాంశం. ఎందుకంటే అమ్మ అనే పదమే అనంతమైనది. ఆ పదానికి హద్దులు, సరిహద్దులు ఎవరూ గీయలేరు. ఎంతరాసినా పూర్తికాని కావ్యం/ అమ్మంటే అనంతం అని 'అనంతం' అనే కవితలో నేను మా అమ్మగురించి రాసుకున్న వాక్యాలు గుర్తుకొచ్చినవి. ధారలోని 'నాటికి ..నేటికీ.. స్ఫూర్తి.. అమ్మ' అనే వ్యాసంలో గోర్కీ ఎందుకు ఉత్తమశ్రేణి రచయిత అయినాడో వివరిస్తూ యదార్థ జీవితసత్యాల్ని, సంఘటనలను, సంభాషణలను తన రచనలలో చూపడమే కాకుండా, పోరాటస్ఫూర్తిని ప్రోదిచేస్తూ మనుషులమధ్య మనిషిగా బతకడంలోని ఉదాత్తతను చెప్పి రచనగా కితాబు ఇస్తాడు.

"అన్యాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి/ అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తి ప్రాప్తి/ అన్యాన్నే దిరించినోడు నాకు ఆరాధ్యుడు" అని జీవితాంతం తెలంగాణ ప్రజల ప్రత్యేక అస్తిత్వం కోసం కలమెత్తి, గళమెత్తి నినదించడమే కాకుండా వాళ్ళ పక్షాన నిలబడి అన్యాయాన్ని ఎదిరించిన గొప్ప మానవతావాది అంటూ "దిక్కారకలం" అనే వ్యాసంలో కాళోజీని ఆవిష్కరించాడు. కాళోజీ వంటి ప్రజాస్వామ్య విలువలు బోధించిన ప్రజాస్వామిక ప్రవక్త మరో వెయ్యి ఏండ్లకు కూడా పుట్టబోరని కన్నాభిరాన్ వ్యాఖ్యానించాడంటే కాళోజీ బహుముఖీన ప్రతిభని అర్థం చేసుకోవచ్చు.

"ఎల్లలు లేని కవితాకాశంలో/ ఎవరెవరి బాధలైనా రాస్తా/ క్షమించండి.../ నా ఒక్కడివి మాత్రం దాస్తా..." అని కన్నీటికడలిలో ప్రయాణంచేస్తూ కూడా కవిత్వాన్ని రాయడం మానని అక్షరయోధుడని, ఈ దోపిడీ సమాజంపై అక్షరాయుధాల్ని ఎక్కుపెట్టి సాహితీ చీకటిని చీల్చిన ఆద్యతీయకవి అని అలిశెట్టిని ప్రశంశిస్తాడు.

తెలంగాణ సాయుధ పోరాటంలో ఒక గెరిల్లా యోధునిగా, రాత్రిబడి నేర్చిన అక్షరాలతో బానిస బతుకుల కథలు చెరిపి నెత్తురు. కన్నీళ్లతో తడిసి ముద్దైన తెలంగాణ ప్రాంత చరిత్రని బండెనకబండి కట్టి/ పదహారు బండ్లు కట్టి /ఏ బండ్లో పోతవు కొడకో/నా కొడకా ప్రతాపరెడ్డి.. అనే పోరాటగీతాన్ని రచించిన బండి యాదగిరిని, ఆయన త్యాగాన్ని తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరువరన్నది వాస్తవం.

గిడుగువారి వ్యవహారిక భాషోద్యమంవల్ల ఆధునిక సాహిత్యం కొత్తసొగసులు సంతరించుకోవటమే కాకుండా రచనా వైవిధ్యం, వైశిష్ట్యంతో పుష్టి చేకూరిందని అంటారు. ఆధునిక విజ్ఞానవ్యాప్తికి వచన రచనలకు కావ్యభాష పనికి రాదని సామాన్య జనానికి అర్థమయ్యే సమకాలీన 'శిష్టవ్యవహారికం'లో ఉండాలని ఆనాటి సాంప్రదాయిక పండితులతో యుద్ధం చేసి ఆధునిక ప్రమాణ భాషను ప్రతిష్ఠించిన మార్గదర్శకుడని మోహన్‌కృష్ణ తన 'తెలుగు వెలుగు' వ్యాసంలో గిడుగు కార్యదీక్షను కొనియాడతాడు.

'నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను/ నేను సైతం విశ్వవృష్టికి అశ్రువొక్కటి ధారపోశాను'... అంటూ మాటల్ని తూటాలుగా పేల్చి తెలుగుసాహిత్యాన్ని శాసించిన మహాకవి శ్రీశ్రీ కవిత్వ ఇంద్రజాలాన్ని, సాహిత్య పరిమళాన్ని పరిచయం చేస్తారు. శ్రీశ్రీ ఒక సాహితీ మహాసముద్రమని, ఆ సముద్రంలో ఎన్ని బిందువులున్నాయో లెక్కపెట్టలేమని ఆయన కవితా నేపద్యాన్ని అర్థం చేసుకోవటం అనితరసాధ్యమని ఆయన కవిత్వ వైశిష్ట్యాన్ని గుర్తుచేస్తాడు.

ఇంకా ఈ 'ధార' గ్రంథంలో 'సాయుధపోరాటం సాహిత్య చైతన్యం', 'స్త్రీల అభివృద్ధి సమాజాభివృద్ధి', 'దళిత ఉద్యమ వైతాళికుడు కుసుమధర్మన్న', 'అగ్నివీణ అనిశెట్టి', 'సాహిత్యం మహిళలు' అన్న అద్భుతమైన విశ్లేషణాత్మక వ్యాసాల్లో ఆయా రచయితల సృజనాత్మక శక్తిని అద్భుతంగా విశ్లేషించారు. తెలుగు సాహితీప్రియులు ముఖ్యంగా పరిశోధకులు తప్పక చదవవలసిన విమర్శనా గ్రంథం ఈ 'ధార'. ఎంతో శ్రమకోర్చి ఇంతమంది అద్వితీయ రచయితల్ని సాహితీలోకానికి పరిచయం చేసిన అనంతోజు మోహన్ నిజంగా అభినందనీయుడు. ముందు ముందు ఇంకా లోతైన విశ్లేషణా వ్యాసాలు రాసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేయాలి.



డా. బాణాల శ్రీనివాసరావు,
9440471423

తెలంగాణ సాహితీ దశాబ్ది ఉత్సవాలు

హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో నవంబర్ 8వ తేదీ ఉదయం 10 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుంది. ఈ సభలో చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జ్ విసి సూర్య ధనుంజయ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఈ సభలో కె. ఆనందాచారి, పి.శ్రీనివాస్ గౌడ్, సి.హెచ్.ఉషారాణి, చరణ్ పరిమి, తంగిరాల చక్రవర్తి, ఏబూషి నరసింహ, నస్రీన్‌ఖాన్, పాలపర్తి సంధ్యారాణి తదితరులు పాల్గొంటారు. కవితల పోటీ విజేతలకు బహుమతులు ప్రదానోత్సవం ఉంటుంది.

- శరత్ సుదర్శి,7386046936

వెలమల సిమ్మన్నకి 'జ్ఞానజ్యోతి' పురస్కారం

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా, తెలుగు సాహిత్యరంగంలో అత్యంత విశేష కృషి సల్పుతున్న పరిశోధక రచయితకు ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఇచ్చే 'జ్ఞానజ్యోతి' పురస్కారం 2024కి ప్రముఖ పరిశోధకులు, రచయిత ఆచార్య వెలమల సిమ్మన్నకు ప్రకటించింది. నవంబర్ 17వ తేదీ సాయంత్రం విజయవాడలోని మహాత్మగాంధీ రోడ్డులోగల ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో రచయితని సత్కరించడం జరుగుతుంది. ఈ సభలో డా. చిల్లర భవానీదేవి, డా. పాపినేని శివశంకర్, కె.రమాదేవి తదితరులు పాల్గొంటారు.

- చలపాక ప్రకాష్

ఖమ్మం ఈస్తటిక్స్ 2024 సాహితీ అవార్డుల ఫలితాలు

ఖమ్మం ఈస్తటిక్స్ సాహితీ అవార్డుల ఫలితాలు ప్రకటించారు. కవిత్వం విభాగంలో జూకంటి జగన్నాథం కవితా సంపుటి 'ఒక కప్పు చాయ్ నాలుగు మెసేజ్‌లు', ప్రత్యేక ప్రశంసకు రాళ్ళబండి శశిశ్రీ కవితా సంపుటి 'అనుమంద్రం', తెలుగు వెంకటేష్ కవితా సంపుటి 'కబోధి చేపల కబుర్లు' ఎంపికయాయి. ఎస్. గోపి కవితా సంపుటి 'క్రియ ఒక జీవన లయ'కు విశిష్ట పురస్కారం, కథల విభాగంలో ఉత్తమ కథగా కె.వి.మన్ ప్రీతమ్ 'నూరేళ్ల మోసే తల్లికథ' ద్వితీయ ఉత్తమ కథగా సయ్యద్ గఫార్ 'న్యూ బాబాయిజం', తృతీయ ఉత్తమ కథగా కరీం 'ఝూజా' గెలుచుకున్నాయి. సంపుటిగా ప్రచురించే కథలు... డీ గాడు (జి ఉమామహేశ్వర్), ఏ రూమ్ అఫ్ దెయిర్ ఓన్ (సింహ ప్రసాద్), బలి (వేల్పుల నారాయణ), గోడ (రాజా నరసింహ), అమ్మోరి భ్రమరాంబ (రోహిణి వంజారి), ఆమె చెప్పిన ఆమెకథ (సుగుణారావు), మనసు మరచి పోయింది (శాంతి ప్రబోధ), ప్రపోసల్ (పి కిషన్), సాగరాలు దాటి (శివ ప్రసాద్). డిసెంబర్ 15వ తేదీన ఖమ్మంలో జరిగే అవార్డుల ప్రదాన కార్యక్రమంలో విజేతలకు నగదు బహుమతి తో పాటు షీల్డ్ అందించనున్నట్లు కమిటీ ప్రకటించింది.

- రవి మారుత్, ఖమ్మం ఈస్తటిక్స్

సాహితీకిరణం కథలపోటీలు

సాహితీకిరణం మాసపత్రిక వివిధ సంస్థల సౌజన్యంతో విడదల నీహారికా ఫౌండేషన్ సంక్రాంతి కథలపోటీ, -2025, ముట్నూరు కమలమ్మ ఫౌండేషన్ చిన్నకథలపోటీ-2024 నిర్వహిస్తున్నది. కథలు పోస్ట్/కొరియర్ ద్వారా మాత్రమే పంపాలి. డిటిపిలో కథ 3 పేజీలు, చిన్న కథ 2 పేజీలు వుండాలి. నవంబర్ 30 లోపు సాహితీకిరణం, ఇం.నెం.11-13-154, అలకాపురి, రోడ్ నెం.3, హైదరాబాద్-500102 చిరునామాకు పంపాలి. వివరాలకు 9490751681.

బిజినెస్

అవినీతి దుష్పరిణామాలపై వాకథాన్

- ఎల్ఐసీలో విజిలెన్స్ వారోత్సవాలు

నవతెలంగాణ -హైదరాబాద్



ప్రభుత్వ రంగంలోని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు చేపట్టింది. ఆదివారం హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని అన్ని శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు, ఏజెంట్ల భాగస్వామ్యంతో వాకథాన్‌ను నిర్వహించింది. సర్దార్ వల్లాభాయ్ పటేల్ జన్మదినం సందర్భంగా ప్రతీ ఏడాది పీఎస్‌యూల్లో విజిలెన్స్ వారోత్సవాలు (అవినీతి దుష్పరిణామాలపై అవగాహన) నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా అక్టోబర్ 28 నుంచి నవంబర్ 3వరకు జరిగాయి. చివరి రోజూ వాకథాన్‌తో కార్యక్రమాలు ముగిశాయని ఎల్ఐసి తెలిపింది. గడిచిన వారంలో ఆన్‌లైన్ క్విజ్, వ్యాస రచన పోటీలు నిర్వహించి ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఆదివారం ఏర్పాటు చేసిన వాకథాన్‌లో 450 మంది పైగా ఉద్యోగులు, ఏజెంట్లు పాల్గొన్నట్లు వెల్లడించింది. తెలుగుతల్లి ఫ్లైఓవర్, సైఫాబాద్ పోలీసు స్టేషన్, లుంబినీ పార్క్ మీదుగా సాగి ఎల్ఐసి జోనల్ కార్యాలయం వద్ద ముగిసిన వాకథాన్‌ను జోనల్ మేనేజర్ పునీత్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. అవినీతి దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే విజిలెన్స్ అవేర్‌నెస్ లక్ష్యమని రీజినల్ మేనేజర్ ఆర్ సతీష్ బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విజిలెన్స్ అధికారి కె సునందన్, ఉన్నతాధికారులు ఎం రవి కుమార్, ఉతుప్ జోసెఫ్, జి మధు సుధన్, ప్రమోద కుమార్ సాహు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నామ్‌టెక్-ఎబిబి ఒప్పందం

నవ తెలంగాణ - హైదరాబాద్

స్కూల్ ఆఫ్ రోబోటిక్స్‌ను స్థాపించడానికి ఎబిబి రోబోటిక్స్, న్యూ ఏజ్ మేకర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నామ్‌టెక్ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించాయి. ఈ భాగస్వామ్యంలో భాగంగా 2025లో స్కూల్ ఆఫ్ రోబోటిక్స్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపాయి. దేశంలో ఆటోమేషన్, రోబోటిక్స్ నైపుణ్యాలు, పరిశ్రమ ఏకీకరణ విద్యలో ఉన్న అంతరాన్ని తొలగించే లక్ష్యంగా పెట్టుకొని ఈ ఒప్పందం చేసుకు ఎబిబి ఇండియా అధ్యక్షుడు సుబ్రత కర్మాకర్ తెలిపారు. ఉన్నత నాణ్యతతో ఇంజనీరింగ్, సాంకేతిక విద్యలో పెట్టుబడి పెట్టనున్నామన్నారు. రోబోటిక్స్, ఆటోమేషన్‌లో వినూత్న విద్యావిధానాన్ని ఏకీకృతం చేయడానికి, తయారీ రంగం నిరంతర వృద్ధికి తాము మద్దతునిస్తున్నామన్నారు. దేశంలో రోబోటిక్స్ ఇంజనీరింగ్‌లో ప్రతిభావంతుల కొరత ఉందని నామ్‌టెక్ డైరెక్టర్ జనరల్ అరుణ్ కుమార్ పిళ్లై పేర్కొన్నారు. ఈ సహకారం రోబోటిక్స్ రంగం వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు.

డిక్సన్ టెక్నాలజీతో సెల్లెకార్ గాడ్జెట్స్ భాగస్వామ్యం

హైదరాబాద్ : వాషింగ్ మెషీన్‌లను తయారు చేయడానికి డిక్సన్ టెక్నాలజీస్ (ఇండియా) లిమిటెడ్‌తో సెల్లెకార్ గాడ్జెట్స్ భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. దీంతో గృహోపకరణాల విభాగంలో తమ ఉనికిని మరింత బలోపేతం చేసుకోవడానికి దోహదం చేయనుందని పేర్కొంది. ఈ భాగస్వామ్యం కింద సెల్లెకార్ కోసం అనేక రకాల వాషింగ్ మెషీన్‌లను తయారు చేయనున్నట్లు డిక్సన్ తెలిపింది. ఇందుకోసం విస్తృత స్థాయి నైపుణ్యం, అత్యాధునిక సౌకర్యాలను ఉపయోగించుకోనున్నట్లు పేర్కొంది. వినియోగదారుల డ్యూరబుల్స్, లైటింగ్, మొబైల్ ఫోన్‌ల తయారీలో డిక్సన్ ఉంది.

లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటూ గెలవని బీఆర్‌ఎస్‌కు వంద సీట్లా?

- ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కసీటైనా గెలవని పార్టీ వంద సీట్లు ఎలా గెలుస్తుందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. ఆర్నెళ్ల క్రితమే బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పారనీ, లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి 16 చోట్ల డిపాజిట్లు కూడా రాలేదని చెప్పారు. తెలంగాణలో నిరంకుశత్వాన్ని తరిమికొట్టి ప్రజలు ప్రజాస్వామ్య పాలనను తెచ్చుకున్నారని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నాయకులతో చరణ్ కౌశిక్ యాదవ్, సామ రామ్మోహన్‌రెడ్డి, పవన్ మల్లాది, డాక్టర్ లింగం యాదవ్, భాస్కర్ యాదవ్, వచన్ కుమార్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్‌లో పోస్టులు పెట్టడం తప్ప.. ప్రజల వద్దకు వెళ్లింది లేదని చెప్పారు. ఎక్స్‌వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్న కేటీఆర్‌కు ఎలాన్ మస్క్ సన్మానం చేస్తారని ఎద్దేవా చేశారు. బామ్మర్ది టిల్లు.. బావ సొల్లు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. పదేండ్లలో ఇచ్చిన రెండు మ్యానిఫెస్టోలను తీసుకుని వస్తే వాటిపై బహిరంగంగా చర్చిద్దాం...రాండి అంటూ సవాల్ విసిరారు. అందులో ఎన్ని అమలు చేశారో, ఎన్ని చేయలేదో ప్రజలకు తెలుస్తుందన్నారు.

సిడ్నీకి చేరుకున్న స్పీకర్ బృందం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఆస్ట్రేలియాలో రెండురోజులపాటు జరగనున్న 67వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు హైదరాబాద్ నుంచి బయలుదేరిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఆయన భార్య గుత్తా అరుంధతి, డిప్యూటీ చైర్మెన్ బండా ప్రకాష్ ముదిరాజ్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు సిడ్నీకి చేరుకున్నారు. వారికి ఆస్ట్రేలియా తెలుగు ప్రవాసీలు స్వాగతం పలికారు.

హలో గిరిజనం.. చలో ఖమ్మం

5, 6 తేదీల్లో రాష్ట్రస్థాయి సమ్మేళనం

- ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రం వేదిక
- గిరిజన సంఘం వ్యవస్థాపకులు గుగులోత్ ధర్మా ప్రథమ వర్ధంతి సందర్భంగా గిరిజన సమ్మేళనం
- సమస్యలపై చర్చించనున్న గిరిజన సంఘాలు





నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:

పేదలు, గిరిజనుల హక్కులపై రోజురోజుకూ దాడి తీవ్రతరం అవుతోంది. గిరిజన సంస్కృతీ సాంప్రదాయాలు, నాగరికత హరించి వేయబడుతున్నాయి. గిరిజనులు అనేక కష్టనష్టాలను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గిరిజన సంఘం వ్యవస్థాపకులు గుగులోత్ ధర్మా స్ఫూర్తితో ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రం వేదికగా 5, 6 తేదీల్లో తెలంగాణ రాష్ట్రస్థాయి గిరిజన సమ్మేళనాన్ని టీజీఎస్ ఖమ్మం జిల్లా కమిటీ ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోని గిరిజన ఉద్యమ నాయకులు, మేధావులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, విద్యార్థులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. వారి నుంచి విలువైన సూచనలు, సలహాలు తీసుకొని ఉద్యమాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఈ సమ్మేళనంలో కార్యచరణ రూపొందిస్తారు.

2011 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జనాభా లెక్కల ప్రకారం 59,18,073 మంది గిరిజనులు ఉన్నారు. తెలంగాణలో 32 తెగల గిరిజనులు ఉన్నారు. గిరిజన జనాభా 32.87 లక్షలు. రాష్ట్ర జనాభాలో 9.3శాతం మంది గిరిజనులే. అధికంగా లంబాడీలు 20,46,117 మంది, కోయ 4,86,391 మంది జనాభా ఉన్నారు. కాగా, శాతం పరంగా అత్యధికంగా గిరిజనులు ఉన్న ప్రాంతం ఉమ్మడి ఖమ్మం జిల్లా. ఒక్క ఖమ్మం జిల్లాలోనే 5 లక్షలకు పైగా గిరిజనులు జీవిస్తున్నారు. వీరు రకరకాల సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆవిర్భవించింది. గతంలో భద్రాచలం కేంద్రంగా ఐటీడీఏ ఉంది. ఖమ్మం ప్రత్యేక జిల్లా అయినా ఇక్కడ ఐటీడీఏ ఏర్పాటు చేయట్లేదు. జిల్లాల విభజన తర్వాత ఐటీడీఏ ప్రాభావాన్ని కోల్పోయింది. ఖమ్మం జిల్లాలో గిరిజన సమస్యల పరిష్కారానికి కేంద్రం అంటూ లేకుండా పోయింది.

ఐటీడీఏ లేదు.. అనాథ పాఠశాలలుగా ఆశ్రమాలు..

ఐటీడీఏ లేకపోవడంతో ఖమ్మం జిల్లా.. భద్రాచలంలోని ఐటీడీఏ ప్రాభావాన్ని కోల్పోవడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా గిరిజనులు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఖమ్మం జిల్లాలో 20కి పైగా ఉన్న గిరిజన ఆశ్రమాలు అనాథ పాఠశాలలుగా మారాయి. పది గిరిజన వసతి గృహాలు సమస్యల లేమితో సతమతమవుతున్నాయి. వీటిలో ఐదువేలకు పైగా విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరిలో మూడు వేల మంది వరకు బాలికలే ఉన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో పర్మనెంట్ టీచర్లు లేరు. అంతా కాంట్రాక్టు ఉపాధ్యాయులతోనే విద్యాబోధన సాగుతోంది. మెనూ విధానంలో మార్పులు చేసినా సక్రమంగా అమలుకావడం లేదు. గిరిజన హాస్టల్స్, పాఠశాలల్లోని ఆర్‌ఓఆర్ ప్లాంట్స్ పనిచేయట్లేదు. వీటిని పునరుద్ధరించాల్సి ఉంది. అత్యధికంగా 70వేల మంది వరకు గిరిజన జనాభా ఉన్న కారేపల్లిలో అనేక సమస్యలు ఉన్నాయి. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని 50 పడకల ఆస్పత్రిగా మార్చాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. కనీసం ఈ మండలానికి 108 వాహనం సైతం ఏర్పాటు చేయలేదు. ఇక్కడే కాదు గిరిజనులు అత్యధికంగా ఉన్న ప్రాంతాల్లో విద్యా వైద్యం సక్రమంగా అందడం లేదు. ఏజెన్సీ మండలాలను ఐటీడీఏ చిన్నచూపు చూస్తోంది. జిల్లాలో కామేపల్లి, కారేపల్లి, ఏన్కూరు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పినపాక, ఇల్లెందు, అశ్వారావుపేట, భద్రాచలం, ఖమ్మంలో వైరా మొత్తం పదింట ఐదు ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గాలు ఉన్నా వీటి బాగోగులను పట్టించుకునే పరిస్థితి లేదు.



విద్యా, ఉపాధి అవకాశాలూ అంతంతే..

విద్యా, ఉపాధి అవకాశాల కల్పన విషయంలోనూ నిర్లక్ష్యం కొనసాగుతోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో అనేక బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీకి నోచుకోవట్లేదు. ప్రతి మండల కేంద్రంలో గిరిజన భవనం నిర్మించాలనే డిమాండ్ ఉన్నా పట్టించుకోవట్లేదు. ఖమ్మంలోని బంజార భవన్ నిర్మాణానికి రూ.5 కోట్లు ఇస్తామన్న హామీ.. హామీగానే మిగిలింది. గిరిజన పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చి, ఇండ్ల నిర్మాణాలు చేయాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవట్లేదు. మరోవైపు గిరిజన సంప్రదాయాలపై బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాడులు కొనసాగిస్తోంది. అనేక తెగల ఆచార వ్యవహారాలను నిర్వీర్యం చేసి హిందూ మతాన్ని చొప్పించే చర్యలు కొనసాగుతున్నాయని గిరిజన పెద్దలు వాపోతున్నారు. గిరిజన నిరుద్యోగులకు భృతి, ఉపాధి కల్పన చర్యలు లేకుండా పోయాయి. గిరిజన ఉపాధి కోసం బయ్యారంలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉన్నా ప్రభుత్వాలు పెడిచెవిన పెడుతున్నాయి. వెదురు పరిశ్రమ ఏర్పాటు కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. రాష్ట్రస్థాయి గిరిజన సమ్మేళనం ద్వారా సమస్యల పరిష్కారానికి ఎలా ముందుకు వెళ్లాలో గిరిజన సంఘాలు నిర్ణయానికి రానున్నాయి.

పొడు భూములుగా పోడు భూములు..

పోడు సమస్యను సంపూర్ణంగా పరిష్కరించే చర్యలు లేవు. ఒక్క ఖమ్మం జిల్లాలోనే మూడువేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. భద్రాద్రి జిల్లాలో పదివేలకు పైగా దరఖాస్తులకు పరిష్కారం లభించలేదు. గిరిజన వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం వైపు నుంచి సహకారం లేదు. బోర్లు, మోటార్లు, కరెంట్ సౌకర్యం కల్పించట్లేదు. ఫారెస్టు అధికారులు ఇవేవీ రాకుండా అడ్డుపడుతున్నారు. హక్కు పత్రాలున్న ప్రతి రైతుకూ ఈ సౌకర్యాలను కల్పించాల్సిన అవసరం ఉంది. ఇక గత ప్రభుత్వం గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా గుర్తించినా రెవెన్యూ హెూదా ఇవ్వలేదు. ఫలితంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 500 గిరిజన పంచాయతీలు రెవెన్యూ హెూదా కోసం ఎదురుచూస్తున్నాయి. తండాల మౌలికాభివృద్ధికి రూ.కోటి విడుదల చేస్తామన్న ప్రభుత్వాలు ఆ ఊసే మరిచాయి.

గుగులోత్ ధర్మా స్ఫూర్తితో..

పుచ్చలపల్లి సుందరయ్య, మంచికంటి కిషన్‌రావు, ఏలూరి లక్ష్మీనారాయణ, బోడేపూడి వెంకటేశ్వరరావు, కంగాల బుచ్చయ్య వంటి మార్క్సిస్టు నేతల ఆదర్శాలను పుణికి పుచ్చుకొని అగ్రనాయకుల సూచనతో 1994లో గుగులోత్ ధర్మా నేతృత్వంలో మైదాన ప్రాంత గిరిజన సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా కేంద్రంగా ఏర్పాటైంది. అనతికాలంలోనే ఇది రాష్ట్రవ్యాప్తంగా విస్తరించింది. ఓసీ కోయగూడెం, సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం, వ్యవసాయ కార్మికుల కూలీ రేట్ల పెంపు, రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు తదితర ఉద్యమాల్లో గిరిజన సంఘం క్రియాశీలకంగా వ్యవహరించింది. 2006లో 65 రోజుల పాటు 1200 గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లో ధర్మా పాదయాత్రలు నిర్వహించారు. అటవీహక్కుల గుర్తింపు చట్టం కోసం వామపక్షాలతో కలిసి గిరిజన సంఘం ఉద్యమాలు నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా గిరిజన జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని, పోడు భూముల పోరాటంలో ధర్మా జైలుకు వెళ్లారు. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం, గిరిజన వ్యతిరేక విధానాలపై రాజకీయాలకు అతీతంగా ఐక్య ఉద్యమాలు నిర్వహించిన నేత గుగులోత్ ధర్మా. ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈ గిరిజన సమ్మేళనాన్ని ఏర్పాటు చేశాం. రాష్ట్రవ్యాప్తంగా వేలాదిగా గిరిజనులు తరలివచ్చి దీన్ని విజయవంతం చేయాలి. దీనిలో భాగంగా గిరిజన కళా ప్రదర్శనలు ఉంటాయి.



భూక్యా వీరభద్రం,
ఆహ్వానసంఘం ప్రధాన కార్యదర్శి

ఖమ్మంలో ఉద్యోగుల 'వన' సందడి..



- సకల ప్రభుత్వ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం
- హాజరైన మంత్రులు పొంగులేటి, తుమ్మల, ఎంపీ రామసహాయం, ఎమ్మెల్సీ అలుగుబెల్లి..
- భారీగా ఉద్యోగుల హాజరు

ంనవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ ఎంప్లాయిస్ గెజిటెడ్ ఆఫీసర్స్, టీచర్స్, వర్కర్స్ అండ్ పెన్షనర్స్ (టీజీఈజేఏసీ) ఆధ్వర్యంలో ఖమ్మం-గొల్లగూడెం రోడ్డులోని చెరుకూరి మామిడితోటలో ఆదివారం అత్యంత కోలాహలంగా ఖమ్మం జిల్లా సకల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం కొనసాగింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా, మహబూబాబాద్ జిల్లా నుంచి పదివేల మందికి పైగా ఉద్యోగులు కుటుంబ సమేతంగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. రోజంతా తోటలో ఉల్లాసంగా గడిపారు. క్రీడా, సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. పసందైన వంటకాలను ఆరగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 60కి పైగా శాఖల ఉద్యోగులు, యూనియన్లు, జర్నలిస్టులతో సహా ఈ వన సమారాధనకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఉద్యోగులు సహకరిస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో 204 ఉద్యోగ సంఘాలు ఐక్యంగా పనిచేశాయి కాబట్టే రాష్ట్రం సిద్ధించిందని తెలిపారు. వచ్చే మార్చి నాటికి ఆర్థిక లేమిని అధిగమించి, ఉద్యోగులు, రాష్ట్ర ప్రజల ముఖంలో చిరునవ్వులు చూస్తామని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధైర్యం చేసి ప్రజలకు ఇచ్చిన హామీలను నిలుపుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న నిర్బంధాలను అధిగమించి ఈ ప్రభుత్వంలో స్వేచ్ఛాయుతంగా పనిచేస్తున్నామని ఏలూరి శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా మంత్రులను ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు, చైర్మెన్ మారం జగదీశ్వర్ శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మెన్ మువ్వా విజయ్‌బాబు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరావు, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి, టీజీవో జిల్లా అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మోదుగు వేలాద్రి, రుక్మారావు, దేవరకొండ సైదులు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడ్లు కొనడం లేదని అన్నదాతల ఆగ్రహం

- సిరిసిల్ల జిల్లాలో ధర్నా
- కేంద్రం వద్దకు వచ్చి రైతులకు హామీ ఇచ్చిన కలెక్టర్



నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి 15రోజులు అయినా కొనుగోలు చేయడం లేదని రైతులు ఆగ్రహం వక్తం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో ప్రధాన రహదారిపై ఆదివారం ధర్నా చేశారు. స్పందించిన కలెక్టర్ కేంద్రం వద్దకు వచ్చి రైతులకు హామీ ఇచ్చి ధాన్యం కొనుగోలును ప్రారంభించారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని పదిర గ్రామంలోని ఐకేపీ సెంటర్లలో ధాన్యం పోసి నెల రోజులైనా కొనుగోలు చేయడం లేదని గ్రామ రైతులు కామారెడ్డి - సిరిసిల్ల ప్రధాన రహదారిపై వడ్లు పోసి బైటాయించారు. వడ్లను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నాలో పాల్గొన్న మాజీ జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావుతో అధికారులు ఫోన్‌లో మాట్లాడి ధర్నా విరమింప చేయాలని కోరారు. అయినా రైతులు ఆందోళన కొనసాగింది. సమచారం అందుకున్న పోలీసులు ధర్నా స్థలానికి చేరుకొని వారితో మాట్లాడి విరమింపచేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సంప్రదించి పదిర ఐకేపీ సెంటర్‌ను సందర్శించి వెంటనే వడ్లను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చి కేంద్రాన్ని ప్రారంభించారు. ధర్నాలో సుమారు 100 మంది పైగా రైతులు పాల్గొన్నారు.

టెన్షన్..టెన్షన్..

ముఖ్యమంత్రిపై పెరిగిన పని ఒత్తిడి

- కీలక శాఖలన్నీ ఆయన వద్దే
- క్యాబినెట్ విస్తరణను అడ్డుకుంటున్నదెవరు?
- పది నెలలుగా ఊరిస్తున్న అధిష్టానం
- పార్టీలో పెరుగుతున్న పోటీ
- ఆశావహుల్లో ఉత్కంఠ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రజాపాలనను సమర్థవంతంగా ప్రజలకు అందించే క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్రమైన పని ఒత్తిడి పెరుగుతున్నది. కీలక శాఖలన్నీ ఆయన వద్దే ఉండటంతో వాటిపై సమీక్షలు నిర్వహించాల్సి వస్తున్నది. అంతే కాకుండా ఏ మంత్రికి కేటాయించని ముఖ్యమైన శాఖలు కూడా సీఎం దగ్గరే ఉన్నాయి. ప్రజాబాహుళ్యానికి అత్యంత కీలకమైన శాఖలను రేవంత్ పర్యవేక్షించాల్సి వస్తున్నది. ముఖ్యంగా హోం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, శాంతిభద్రతలు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమం, విద్యాశాఖ, కార్మిక శాఖతోపాటు మంత్రులకు కేటాయించని శాఖలన్నింటినీ ముఖ్యమంత్రి సమన్వయం చేయాల్సి వస్తున్నది. దీంతో పాలన నిర్వహణ, సమీక్షలకు ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తున్నది. సంక్షేమ పథకాలకు రూపకల్పన చేయడం, వాటిని ప్రణాళికాబద్ధంగా అమలు చేయటం, అభివృద్ధి పనులను వేగవంతం చేయటంపై ఇది ప్రభావం చూపిస్తున్నది. ఎన్నికల హామీ మేరకు ఆయా శాఖల్లో అనేక మార్పులు, సంస్కరణలు తీసుకురావాల్సి ఉన్నది. కానీ ఆ మార్పులు ఇంకా మొదలు కావడం లేదు. రోజువారీగా పాలనా నిర్వహణ తప్ప ఆయా శాఖల్లో కొత్త కొత్త పథకాలను అమలు చేయడం లేదనే చెప్పొచ్చు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చడంతో ఆర్థిక నిర్వహణ కూడా పెద్ద సవాల్‌గా మారుతున్నది. ఇప్పటికే రైతు భరోసా ఆలస్యం కావడంతో అన్నదాతల ముఖాల్లో చిరునవ్వులు కనిపించడం లేదు. ఇచ్చిన హామీలను అమలు చేసే క్రమం నత్తనడకన సాగుతోన్నది. వీటిన్నింటిపై ముఖ్యమంత్రి దృష్టి సారించాలంటే మంత్రి వర్గ విస్తరణ చేపట్టాలని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

పది నెలలైనా కార్యరూపమేది?


కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదినెలలైంది. అప్పటి నుంచి ఇప్పటివరకు మీడియాలో మంత్రివర్గ విస్తరణపై పుంఖానుపుంఖాలుగా కథనాలు వస్తున్నాయి. కానీ అది కార్యరూపం దాల్చడం లేదు. ముఖ్యమంత్రి ఎప్పుడు ఢిల్లీకి వెళ్లినా అదిగో మంత్రివర్గ విస్తరణ, ఇదిగో మంత్రివర్గ విస్తరణ అంటూ బ్రేకింగులు, స్క్రోలింగ్‌లు వస్తున్నాయి. అవన్నీ మీడియాలో చూసి ఆశావహులు కూడా ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో క్యాబినెట్ విస్తరణపై చర్చ పాత చింతకాయ పచ్చడిలా తయారైందని రాజకీయ వ్యాఖ్యాతలు సెటైర్లు వేస్తున్నారు. మంత్రులను నియమించడంలో ముఖ్యమంత్రికి విచక్షణాధికారాలు ఉన్నప్పటికీ ఇందులో పార్టీ అధిష్టానం కీ రోల్‌గా మారింది.

ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు సహచర మంత్రులు, పీసీసీ అధ్యక్షుడి అభిప్రాయాలు కూడా తీసుకోవాల్సి ఉంది. మన అసెంబ్లీలో సంఖ్యాబలం ఆధారంగా శాసనసభ్యుల్లో 15 శాతం మంత్రులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. దీని ప్రకారం సీఎంతోసహా 18 మంది మంత్రులు ఉండాలి. కానీ ప్రస్తుతం 12 మంది మంత్రులు మాత్రమే ఉన్నారు. మరో ఆరుగురికి మంత్రివర్గంలో అవకాశం ఉన్నది. పది ఉమ్మడి జిల్లాల్లో ఆరు జిల్లాలకు ప్రాతినిధ్యం ఉండగా, ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు బెర్తులు దక్కలేదు. ఆయా జిల్లాలకు క్యాబినెట్‌లో స్థానం కల్పిస్తేగానీ సీఎంపై పని ఒత్తిడి తగ్గే అవకాశం లేదు. తలా ఓ శాఖను అప్పగించడం ద్వారా ఆయన తనపై పడే భారాన్ని తగ్గించుకోవచ్చు. తద్వారా ప్రజాపాలనను ప్రజల దగ్గరికి చేర్చేందుకు మార్గం సుగమమవుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

బ్రేకింగులు, స్క్రోలింగులే...

మంత్రిపదవి కోసం పార్టీ నేతల్లో పోటీ కూడా విపరీతంగా ఉన్నది. దీంతోపాటు సామాజిక సమీకరణాలు కూడా పార్టీకి సవాల్‌గా నిలుస్తున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టనున్న నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీలతోపాటు బీసీల్లో కొన్ని (ముదిరాజ్, యాదవ, రజక) కులాల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్లు వస్తున్నాయి.



మంత్రులు కూడా ఫలాన వారికి అవకాశం ఇవ్వాలంటూ పట్టు పడుతున్నట్టు తెలిసింది. మంత్రివర్గ విస్తరణ కంటే ముందు కార్పొరేషన్ల చైర్మెన్లు, సభ్యులను నియమించడం ద్వారా మంత్రులను సీఎం కొంతమేరకు సంతృప్తిపరిచారు. మరికొంత మందికి చైర్మెన్ పదవులపై కసరత్తు జరుగుతున్నది. కానీ క్యాబినెట్ విస్తరణకు మాత్రం బ్రేకులు పడుతున్నాయి. ఏఐసీసీ స్థాయిలో కసరత్తు చేస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అనుకూలమైన వారికే క్యాబినెట్‌లో చోటు కల్పించాల్సి ఉంటుంది. అలా జరిగినప్పుడే ఇబ్బందులు లేకుండా పాలన కొనసాగుతుంది. అయితే మంత్రివర్గంలో చోటు కోసం పోటీ పడుతున్న ఎమ్మెల్యేల సంఖ్య చాంతాడంత ఉంది. అందులో ప్రధానంగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమసాగర్ రావు, మక్తల్ ఎమ్మెల్యే వాకటి శ్రీహరి ముదిరాజ్, ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, డోర్నకల్ ఎమ్మెల్యే రామచందర్ నాయక్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావులు మంత్రి పదవుల కోసం పోటీ పడుతున్న వారిలో ముఖ్యులుగా ఉన్నారు. ఇప్పటికే వారు ఢిల్లీ పెద్దలతో పైరవీలు కూడా చేస్తున్నారు. పార్టీ పరంగా సీఎంపై ఒత్తిడి పెరుగుతుండడంతో వారిలో ఎవరికి పదవి ఇవ్వాలి, ఎవరిని పక్కన పెట్టాలన్న దానిపై రేవంత్ నిర్ణయం తీసుకోలేని పరిస్థితులు నెలకొన్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సామాజిక సమీకరణాల విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతోనే మంత్రి వర్గ విస్తరణ ఆలస్యం అవుతున్నట్లు ఆయా వర్గాలు భావిస్తున్నాయి.

రాజ్యాధికారమే లక్ష్యంగా ఉద్యమం

- రెడ్డి సామాజిక తరగతి నుంచి రేవంత్‌రెడ్డే చివరి సీఎం
- రాష్ట్రవ్యాప్తంగా బీసీల సమర శంఖారావం : మిర్యాలగూడ బీసీ గర్జనలో తీన్మార్ మల్లన్న

నవతెలంగాణ-మిర్యాలగూడ



బీసీలంతా ఐక్యమయ్యే రోజులు వచ్చాయని, త్వరలోనే తెలంగాణలో బీసీ రాజ్యం రాబోతుందని, రాష్ట్రానికి రెడ్డి సామాజిక తరగతి నుంచి రేవంత్‌రెడ్డే చివరి ముఖ్యమంత్రి అని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో బీసీ జేఏసీ కో కన్వీనర్ తమ్మడబోయిన అర్జున్ అధ్యక్షతన నిర్వహించిన బీసీ గర్జన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. 60 శాతం జనాభా ఉన్న బీసీలను 70 ఏండ్లుగా రాజకీయంగా అణగదొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా ఉద్యోగాల్లో బీసీలకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈడబ్ల్యూఎస్ కోటా తీసుకొచ్చి 29 జీవో ద్వారా ఉద్యోగాలను లాక్కుంటున్నారని చెప్పారు. బీసీలను అన్యాయం చేసే అగ్రకుల రాజకీయ నాయకులను సమాధి చేయడమే లక్ష్యంగా ఉద్యమం కొనసాగుతుందన్నారు. విద్యా ఉద్యోగం, రాజకీయ ప్రాధాన్యత బీసీలకు భిక్ష కాదని హక్కు అని తెలిపారు. నల్లగొండ జిల్లాలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క అగ్రకుల నాయకున్ని గెలవనివ్వబోమని అన్నారు. మిర్యాలగూడలో 15 మంది ఎమ్మెల్యేలు అయ్యారని, కానీ ఇప్పటివరకు ఒక్కరు కూడా బీసీలు ఎమ్మెల్యే కాలేదని చెప్పారు. బీసీ బిడ్డలకు ఏ చిన్న అన్యాయం జరిగినా ఊరుకోబోమని, ఏ చిన్న సమస్య వచ్చినా తనను సంప్రదించాలని కోరారు. భవిష్యత్‌లో రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో బీసీల సభ నిర్వహిస్తామని చెప్పారు. నల్లగొండ, సూర్యాపేట, భువనగిరిలో బీసీల సమర శంఖం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మెన్ నేతి విద్యాసాగర్, మాజీ ఎమ్మెల్సీలు పూల రవీందర్, ఆకుల లలిత, మాజీ ఎమ్మెల్యే పుట్టమధు, బీపీ మండల్ మనువడు సూరజ్ మండల్, రిటైర్డ్ కలెక్టర్ చిరంజీవులు, నాయకులు చెరుకు సుధాకర్, వట్టి జానయ్యయాదవ్, పిల్లి రామరాజుయాదవ్, తండు సైదులుగౌడ్, జనార్దన్, వరంగల్ శ్రీనివాస్, కొల సైదులు, మారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోమా పేషేంట్‌కు రేవంత్ సర్కార్ చేయూత

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలం నాగంపేటకు చెందిన బదనపల్లి సాయన్న అనారోగ్య కారణాల తో పది నెలలకుపైగా ఖతార్‌లోని ఆస్పత్రిలో కోమా స్థితిలో ఉన్నారు. కంపెనీ యాజమాన్యం సాయన్నను ఈనెల 1న ఖతార్ నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించింది. అక్కడినుంచి నిమ్స్‌కు బదిలీ చేశారు. వైద్య ఖర్చులు భరించే స్తోమత లేదనీ, నిమ్స్ ఆస్పత్రిలో అడ్మిషన్ ఇప్పించి, ఉచిత వైద్యం అందించాలని సాయన్న భార్య ప్రేమలత, కుమారులు వికాస్, వినీత్‌లు సీఎం ఏ రేవంత్‌రెడ్డి, బాల్కొండ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి ముత్యాల సునీల్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు వారు విడుదల చేసిన వీడియో విజ్ఞప్తికి, అంతకు ముందు పంపిన వినతి పత్రానికి స్పందించిన రాష్ట్ర ప్రభుత్వ జీఏడీ ఎన్నారై విభాగం ఐఏఎస్ అధికారి ఎస్. వెంకట్రావు, సెక్షన్ ఆఫీసర్ ఇ. చిట్టిబాబు చొరవ తీసుకుని నిమ్స్‌లో అడ్మిషన్ కు అనుమతి మంజూరు చేయించారని ప్రభుత్వ తెలిపింది.

పాక్‌లో మరో రెండు పోలియో కేసులు

ఇస్లామాబాద్ : పాకిస్థాన్‌లోని ఖైబర్ ఫఖ్తుంక్వా ప్రావిన్స్‌లో కొత్తగా రెండు పోలియో కేసులను గుర్తించినట్టు అధికారులు తెలిపారు. దీంతో పాకిస్థాన్‌లో ఈ ఏడాది పోలియో కేసుల సంఖ్య 45కి చేరింది. లక్కీ మార్వాత్, డేరా ఇస్మాయిల్ ఖాన్ ప్రావిన్స్‌లలో తాజా కేసులు వెలుగుచూశాయని నేషనల్ ఎమర్జెన్సీ ఆపరేషన్స్ సెంటర్ పేర్కొన్నట్టు స్థానియ మీడియా తెలిపింది. ఈ కేసులను డబ్ల్యుపివి1గా ప్రాంతీయ లేబరేటరీ నిర్ధారించినట్టు పేర్కొంది. ఈ రెండు జిల్లాల నుండి ఈ ఏడాది పోలియో కేసు నమోదు కావడం ఇది రెండవసారి. ఈ ప్రాంతంలో వైరస్ వ్యాప్తి చెందే ప్రమాదం అధికంగా ఉన్నట్టు తెలిపింది. కౌంటీలో నాలుగు ప్రావిన్స్‌లోని 76 జిల్లాల్లో డబ్ల్యుపివి1ని గుర్తించామని అధికారులు తెలిపారు. ఈ కేసులతో దేశవ్యాప్త పోలియో నిర్మూలన కోసం చేపడుతున్న కార్యకలాపాలను మరింత వేగవంతం చేయాల్సి వుందని పేర్కొన్నారు. బలూచిస్తాన్ నుండి 22, సింధ్ నుండి 12, ఖైబర్ ఫఖ్తుంక్వా నుండి 9, పంజాబ్, ఇస్లామాబాద్‌ల నుండి ఒక్కొక్కటి చొప్పున దేశవ్యాప్తంగా మొత్తం 45 కేసులు రికార్డయ్యాయి.వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు ఐదేళ్లలోపు 4.5 కోట్ల మంది పిల్లలకు టీకాలు వేయాలనే లక్ష్యంతో చేపడుతున్న 'వారం రోజుల పోలియో వ్యాక్సినేషన్ ప్రచారం' గత సోమవారం ప్రారంభమైంది.

ఏపీలో ఉప్పు భూములపై కార్పొరేట్ కన్ను



- తీర ప్రాంతానికి మరో ముప్పు
- ఇప్పటికే పూర్తయిన డ్రోన్ సర్వే

అమరావతి : కృష్ణపట్నం పోర్టు విస్తరణ కోసం సముద్రపు ఒడ్డునే ఉన్న 775 ఎకరాల ఉప్పు భూములను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అదాని గ్రూపు కోరింది. ఆ సంస్థకు చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కొద్ది రోజుల క్రితం కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు నిజానికి కృష్ణపట్నం తీరంలోని ఈ భూముల పై పోర్టు యాజమాన్యం కన్ను ఇప్పటిది కాదు!

ఇక్కడే కాదు. దేశ వ్యాప్తంగా తీర ప్రాంతంలో ఉన్న ఉప్పు భూములను తమకు అప్పగించాలని కార్పొరేట్ యాజమాన్యాలు ఎప్పటి నుండో కోరుతున్నాయి. పర్యావరణ పరంగా సున్నితమైన ఈ భూములను ప్రైవేటు సంస్థలకు కేటాయించకూడదని నిబంధనలు స్పష్టంగా ఉండటంతో వాటి ప్రయత్నాలు ఫలించలేదు. వరుసగా మూడవసారి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం ఆ నిబంధనలను మార్చివేసింది. ఉప్పు భూములను కార్పొరేట్లకు కట్టబెట్టడానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తూ గుట్టుచప్పుడు కాకుండా కొద్దిరోజుల క్రితం సర్క్యులర్ జారీ చేసింది. వెంటనే కార్పొరేట్ డేగలు ఆ భూములను ఎగరేసుకుపోవడానికి సిద్ధమయ్యాయి. దేశ ఆర్థిక రాజధాని ముంబాయిలోని ఉప్పు భూములపై తొలివేటు పడింది. బిజెపి భాగస్వామ్యంతో నడిచే ఆ రాష్ట్ర ప్రభుత్వం అదాని సంస్థకు ఆ భూమిని అప్పగించింది. దేశంలోనే అతిపెద్ద మురికివాడగా గుర్తింపు పొందిన 'ధారవి'లో పునరుద్దరణ ప్రాజెక్టులో భాగంగా పేదలకు ఇళ్ల నిర్మించి ఇచ్చే పేరిట ఈ పందేరాన్ని పర్యావరణ వేత్తలు, రాజకీయ పార్టీలు వ్యతిరేకిస్తున్నా అక్కడి ప్రభుత్వం పట్టించకోవడం లేదు. ముంబాయి తరువాత ఆంధ్రప్రదేశ్‌లోని ఉప్పు భూములను స్వాధీనం చేసుకోవడంపై అదాని సంస్థ దృష్టి సారించింది.

ఎంత విస్తీర్ణం...?

దేశ వ్యాప్తంగా 59,768 ఎకరాల్లో ఉప్పు భూములు ఉన్నాయి. వీటిలో అత్యధికం 20, 716 ఎకరాలు ఉన్న ఘనత మన రాష్ట్రానిదే! మన రాష్ట్రం తరువాత తమిళనాడు, మహారాష్ట్రలు ఉన్నాయి. ఆహారంలో అత్యంత కీలకమైన ఉప్పు ఈ భూముల్లోనే సాగవుతుంవటం, పర్యావరణ పరంగా అత్యంత కీలకం కావడంతో ఈ భూములను మొదటి నుండి కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంచారు. కేంద్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక అధికారులను, సిబ్బందిని నియమించి ఈ భూముల పరిరక్షణతో పాటు, ఉప్పు తయారీని పర్యవేక్షించేది. దేశంలో సరళీకరణ ఆర్థిక విధానాలు ప్రారంభమైన కార్పొరేట్ సంస్థల కన్ను ఈ భూములపై పడింది.

నిబంధనల్లో మార్పులు ఇలా...

ఉప్పు తయారీకి ఇతర అవసరాలకు ఈ భూములను వినియోగించ కూడదన్న నిబంధన చాలా సంవత్సరాల పాటు కొనసాగింది. అయితే, ముంబాయితో పాటు మరికొన్ని ప్రాంతాలో ప్రజావసరాల కోసం ఈ భూమిని వినియోగించుకోవాలన్న విజ్ఞప్తిని అనేక ప్రభుత్వ సంస్థలే చేశాయి. ఈ నేపథ్యంలో 2012వ సంవత్సరంలో మొట్టమొదటి సారి ఈ నిబంధనలను మార్చారు. అప్పుడు కూడా ప్రైవేటు సంస్థలకు ఎటువంటి పరిస్థితుల్లోనూ ఈ భూములు అప్పగించకూడదని స్పష్టంగా పేర్కొన్నారు. అదే సమయంలో పర్యావరణ అంశాలను, నిబంధనలను ఖచ్చితంగా పాటించి తీరాలని నిర్దేశించారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో కూడా తొలుత కేంద్ర ప్రభుత్వశాఖలకు, ఆ తరువాత కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు, చివరగా రాష్ట్ర ప్రభుత్వశాఖలకు, సంస్థలకు కేటాయించాలని నిబంధనల్లో పేర్కొన్నారు. ఈ భూములు పొందే సంస్థలు ఉప్పుతయారీకి ప్రత్యామ్నాయ భూమిని చూపించడంతో పాటు, మార్కెట్ విలువ కూడా చెల్లించాల్సిఉంటుంది. ఈ ఏడాది ఆగస్టులో జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశం అనంతరం ఈ నిబందనలను మరింతగా దిగజార్చారు. 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, వాటి ఆధీనంలోని వివిధ సంస్థలు ఆన్‌లైన్‌లో వేలంలో భూములను తీసుకోవడానికి ముందుకు రాకపోతే, ప్రైవేటు సంస్థలను అనుమతించవచ్చు.' అని తాజా నిబంధనల్లో పేర్కొ న్నారు. అదే విధంగా ఈ భూములను దక్కించుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థలు ఆ భూములను సబ్‌లీజుకు ఇయ్యవచ్చని నిబంధనల్లో పేర్కొన్నారు. 99 సంవత్సరాల వరకు ఈ సబ్‌లీజుకు కాలపరిమితిని విధించారు. మురికివాడల అభివృద్ధి, బలహీన వర్గాల గృహనిర్మాణం వంటి పథకాల అమలును ఈ సబ్‌లీజుకు ఇవ్వడానికి షరతులుగా విధించినప్పటికీ, ఒకసారి భూములు దక్కించుకున్న తరువాత ఏం జరుగుతుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. తాజాగా మార్గదర్శకాల్లో పర్యావరణ పరిరక్షణ, కోస్టల్ రెగ్యులేటరీ జోన్ (సిఆర్‌జడ్) నిబంధనలు పాటించడం వంటి అంశాల ప్రస్తావనే లేకపోవడం గమనార్హం.

చకచకా కదలిక

కొన్ని సంవత్సరాలుగా ఉప్పు భూముల గురించి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ భూములపై అజమాయిషీ ఉన్న కేంద్ర ప్రభుత్వానికి చందిన సాల్ట్ కమిషన్ ఆఫీసులు అనేక చోట్ల నామమాత్రంగానే పనిచేస్తున్నాయి. కొన్ని చోట్ల ఈ కార్యాలయాలను మూసివేసి సిబ్బందిని వెనక్కి పిలిపించుకున్నారు. అయితే, ఈ భూములను కార్పొరేట్లకు కట్టబెట్టవచ్చంటూ నిబంధనలు సవరించగానే ప్రభుత్వ శాఖల్లో కదలిక వచ్చింది. దేశ వ్యాప్తంగా ఈ భూముల స్థితిగతులపై సర్వేలు నిర్వహిస్తున్నారు. మన రాష్ట్రంలోనూ ఉప్పు భూములున్న అన్ని ప్రాంతాల్లోనూ డ్రోన్‌ల సహాయంతో సర్వేను ఇప్పటికే పూర్తి చేశారు. భూముల ప్రస్తుత స్థితిగతులకు సంబంధించిన వివరాలను పూర్తి స్థాయిలో సేకరించారు. స్థానికులెవరైనా ఈ భూముల్లో ప్రవేశించి ఉంటే వారిని ఖాళీ చేయించే పనులు కూడా ప్రారంభమయ్యాయి.

పోర్టులకు.. పారిశ్రామిక అవసరాలకు కూడా...

గత ఉత్తర్వుల ప్రకారం కాలుష్యానికి, పర్యావరణ ధ్వంసానికి కారణమయ్యే అన్ని రకాల పనులను ఈ ఉప్పు భూముల్లో నిషేధించారు. తాజా ఉత్తర్వుల్లో కేంద్ర ప్రభుత్వం దానికి భిన్నమైన వైఖరి తీసుకుంది. పోర్టులకు, పోర్టు అనుబంధ కార్యక్రమాలకు కూడా ఈ భూములను కేటాయించవచ్చని పేర్కొంది.





అమెరికా అధ్యక్ష ఎన్నికలు
రేపే తుది సమరం

- పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు
- విజేత ఎవరో తేలడానికి సుదీర్ఘ నిరీక్షణ

వాషింగ్టన్: ప్రపంచంలోనే అత్యంత సంపన్నమైన, శక్తివంతమైన దేశంలో అధ్యక్ష ఎన్నికల తుది ఘట్టానికి రంగం సిద్ధమైంది. ఇప్పటికే 7 కోట్ల మంది అమెరికన్లు వివిధ ఓటింగ్ కేంద్రాల్లో ముందస్తుగా ఓటు వేశారు. కీలకమైన తుది ఓటింగ్ మంగళవారం (నవంబరు5) జరగనుంది. అయితే విజేత ఎవరో తేలడానికి రోజులు పట్టవచ్చు. ఏడు స్వింగ్ స్టేట్స్‌కు గాను ఆరింటిలో ట్రంప్‌దే పైచేయిగా ఉన్నట్టు అట్లాస్ తాజా పోల్ సర్వే పేర్కొనగా, ఇద్దరి మధ్యచాలా గట్టి పోటీ నెలకొన్నట్లు న్యూయార్క్‌టైమ్స్ సర్వే పేర్కొంది. తుది ఓటింగ్‌కు మరో 24 గంటల్లో తెర లేవనుండడంతో కమలా హారిస్ (డెమొక్రాటిక్ పార్టీ), డొనాల్డ్ ట్రంప్ (రిపబ్లికన్ పార్టీ) మధ్య మాటల యుద్ధం పతాక స్థాయికి చేరింది. ఒకరిపై ఒకరు తీవ్ర స్థాయిలో మాటల తూటాలు పేల్చుతూ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నారు. కీలకమైన సమస్యలను ఎజెండాపైకి రానీయకుండా వ్యక్తిగత దూషణలు, ఊక దంపుడు ఉపన్యాసాలతో ప్రచారాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. ఎలక్టొరల్ కాలేజీలో అత్యధిక ఎలక్టొర్స్ కలిగిన రాష్ట్రాల్లో ఒకటైన పెన్సిల్వేనియాలో ప్యూర్టోరికన్లపై ఆదివారం నాటి ఎన్నికల ర్యాలీలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు హారిస్‌కు ఆయాచిత వరంగా పరిణమించాయి. ప్యూర్టోరికో చెత్త దీవి అని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు పెన్సిల్వేనియాలో ఆయన విజయావకాశాలను దెబ్బతీసేలా ఉన్నాయి. ట్రంప్ వ్యాఖ్యలపై ప్యూర్టోరికన్లు ఆగ్రహంగా ఉన్నారు. దీనిని సొమ్ము చేసుకోవడానికి హారిస్ యత్నిస్తున్నారు. జాతి దురహంకారం, విద్వేష రాజకీయాలకు పెట్టింది పేరు ట్రంప్ అని ఆమె దుయ్యబట్టారు. తాజాగా నిర్వహించిన ఓ ఒపీనియన్ పోల్‌లో హారిస్‌కు అమెరికన్ల మద్దతు 44 శాతం నుండి 43 శాతానికి తగ్గినట్టు వెల్లడించింది. దీంతో ఈ సారి ఎన్నికల ఫలితాన్ని జార్జియా, మిచిగాన్ వంటి ఏడు స్వింగ్ రాష్ట్రాలు నిర్ణయించనున్నాయని పరిశీలకులు భావిస్తున్నారు. హారిస్ తన దృష్టంతా ఇప్పుడు మిచిగాన్ పై కేంద్రీకరించారు. ఇజ్రాయిల్‌కు అమెరికా మద్దతు తెలపడాన్ని అరబ్ అమెరికన్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అరబ్ అమెరికన్లు ఎక్కువగా ఉన్న రాష్ట్రం ఇదే. పాలస్తీనీయులను ఊచకోత కోస్తున్న ఇజ్రాయిల్‌కు గత సంవత్సర కాలంలో అమెరికా 380 కోట్ల డాలర్ల మిలిటరీ సాయాన్ని అందజేసింది. ట్రంప్ కూడా ఇజ్రాయిల్‌ను పూర్తిగా వెనకేసుకొస్తున్నారు. ఈ విషయంలో ట్రంప్, హారిస్‌ల మధ్య తేడా ఏమీ లేదు. అలాగే కార్పొరేట్ పన్ను తగ్గించే విషయంలో డెమొక్రాటిక్స్‌కి, రిపబ్లికన్స్‌కి మధ్య ఎలాంటి పేచీ లేదు. జాన్‌ఎఫ్ కెనడీ, ఐషెన్ హోవర్ కాలంలో 90 శాతంగా ఉన్న కార్పొరేట్ టాక్స్ నేడు 21 శాతానికి కుదించబడిందంటే దీనికి ఈ రెండు పార్టీలే కారణం. విదేశీ వలస కార్మికులు, కష్టజీవుల విషయంలో ట్రంప్ చాలా క్రూరమైన వైఖరి తీసుకున్నారు. ఈసారి తాను గెలిస్తే ఎలాంటి సరైన పత్రాలు లేకుండా దేశంలో ఉంటున్న 2 కోట్ల మంది విదేశీయులను గెంటివేస్తానని బాహాటంగా చెబుతున్నారు. హారిస్ దీనికి ప్రత్యామ్నాయం ఏమిటో చెప్పకుండా ట్రంప్ రేసిస్టు, విద్వేషి అని విమర్శించడానికే పరిమితమవు తున్నారు. ఈ రెండు ప్రధాన పార్టీలకు పూర్తి భిన్నంగా, పీపుల్స్ అజెండాతో అమెరికన్ కమ్యూనిస్టు పార్టీ ఎన్నికల్లో పాల్గొంటున్నది. 'మాగా' (ఎంఎజిఎ- మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) నినాదంతో ముందుకొస్తున్న ఫాసిస్టు ట్రంప్‌ను ఓడించేందుకు కార్మిక, ప్రగతిశీల శక్తులను కలుపుకుని వీలైనంత విశాల ఐక్యత సాధించేందుకు కమ్యూనిస్టు పార్టీ కృషి చేస్తోంది. కొన్ని రాష్ట్రాల్లో అణగారిన వర్గాలకు ఓటు వినియోగించుకునే హక్కు తిరస్కరించబడుతున్నందున వారి ఓటు వేసే హక్కును కాపాడతామని, కార్మిక హక్కులను పరిరక్షించడం, పేద, ధనికుల మధ్య విపరీతంగా పెరిగిపోయిన అంతరాలను తొలగిస్తామని, పునరుత్పత్తి హక్కు పరిరక్షిస్తామని, టెస్లా, నెట్ ఫ్లిక్స్, జనరల్ ఎలక్ట్రికల్స్, టెస్లా వంటి గుత్త సంస్థల పై కార్పొరేట్ పన్ను పెంచుతామని, తద్వారా సమకూరిన ఆదాయాన్ని అందరికీ విద్య, వైద్యం, గృహవసతి కల్పించేందుకు వినియోగిస్తామని కమ్యూనిస్టు పార్టీ తన ఎజెండాలో పేర్కొంది. అంతేకాదు, క్యూబాపై దశాబ్దాలుగా అమెరికా సాగిస్తున్న ఆర్థిక దిగ్బంధనాన్ని ఎత్తివేస్తామని, యూదు దురహంకార ఇజ్రాయిల్‌కు అన్ని రకాల సాయాన్ని నిలిపివేస్తామని, శాశ్వత కాల్పుల విరమణకు కృషి చేస్తామని కమ్యూనిస్టు పార్టీ తెలిపింది. పచ్చి మితవాది ట్రంప్‌ను ఓడించేందుకు శాయశక్తులా కృషి చేయాలని కమ్యూనిస్టు పార్టీ తన శ్రేణులకు పిలుపునిచ్చింది.

ఇజ్రాయిల్‌కు బుద్ధి చెబుతాం



- ఎప్పుడు అనేది సైన్యం నిర్ణయిస్తుంది :ఇరాన్
- అదే జరిగితే ఇజ్రాయిల్‌ను ఆపలేం: అమెరికా

టెహ్రాన్ : ఇజ్రాయిల్ ఇటీవల తమ దేశంపై జరిపిన దాడికి బుద్ధి చెప్పేందుకు ఇరాన్ సుప్రీం జాతీయ భద్రతా మండలి పథక రచన చేసింది. అయితే ఎదురు దాడి ఎప్పుడు చేపట్టేది మిలిటరీ ఉన్నతాధికారులు నిర్ణయిస్తారని ఇరాన్ రివల్యూషన్ గార్డు కార్ప్స్ (ఐఆర్‌జిసి) మాజీ కమాండర్ , రక్షణ, భద్రత వ్యవహారాల పార్లమెంటరీ కమిటీ సభ్యుడు ఇస్మాయిల్ కోశారి చెప్పారు. ప్రతి దాడి ఎలా ఉండాలి అనే దానికి సంబంధించిన అన్ని వివరాలు మిలిటరీ నాయకులకు ఇచ్చాం. ఈ దాడులు ఎప్పుడు చేపట్టాలనేది వారే నిర్ణయిస్తారని ఆయన అన్నారు. 'యూదు దురహంకార ఇజ్రాయిల్‌కు గట్టిగా బుద్ధి చెప్పాలనే విషయంలో ఇరాన్ సుప్రీం జాతీయ భద్రతా మండలి ఏకాభిప్రాయంతో ఉంది. ఇజ్రాయిల్ తాజా దురాగతానికి జవాబివ్వడం మా చట్టబద్ధమైన హక్కు. మేము దీనిని తప్పక ఉపయోగించుకుంటాం' అని కోశారి చెప్పారు. ఇరాకీ భూ భాగం నుంచి ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు గత శనివారం ఇరాన్‌లోని మిలిటరీ స్థావరాలపై జరిపిన దాడిలో నల్గురు ఇరాన్ సైనికులు చనిపోయారు. ఒక పౌరుడు కూడా గాయాలతో తరువాత చనిపోయాడు. హనియే ను ఏప్రిల్‌లో ఇజ్రాయిల్ దాడి చేసి చంపినప్పటి నుంచి ఈ రెండు దేశాల మధ్య దాడులు, ప్రతి దాడులు గొలుసుకట్టుగా జరుగుతున్నాయి.

ఇరాన్ మళ్లీ దాడి చేస్తే
ఇజ్రాయిల్‌ను ఆపడం కష్టం : అమెరికా బెదిరింపు

ఇరాన్ గనుక మళ్లీ దాడి చేస్తే ఇజ్రాయిల్‌ను ఆపడం కష్టమని, ఇది యుద్ధ విస్తరణకు దారి తీస్తుందని అమెరికా బెదిరించింది. ఇరాన్ మరోసారి దాడికి ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు ఇజ్రాయిల్ గూఢచారి వర్గాలు సూచించిన నేపథ్యంలో అమెరికా ఈ బెదిరింపులకు దిగింది. అమెరికా అధ్యక్ష ఎన్నికలలోపే ఇరాన్ దాడి చేయవచ్చని ఇజ్రాయిల్ ఇంటెలిజెన్స్‌ను ఉటంకిస్తూ యాక్సియోస్ వార్తా సంస్థ తెలిపింది.

స్పెయిన్ రాజుకు చేదు అనుభవం

- వెళ్లిపోండి అంటూ

వరదబాధితుల ఆగ్రహం

మాడ్రిడ్ : ఇటీవల స్పెయిన్‌లో ఆకస్మిక వరదల బీభత్సం సృష్టించాయి. దేశ చరిత్రలో అత్యంత దారుణమైన ప్రకృతి విపత్తుల్లో ఇదీ ఒకటి. దాదాపు 200మందికి పైగా మృతి చెందారు. వాలెన్సియా శివారులోని పైపోర్తా ప్రాంతంలోనే 60 మంది ప్రాణాలు కోల్పోయారు. వేలాది నివాసాలు దెబ్బతిన్నాయి. ఈ క్రమంలోనే వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటనకు వెళ్లిన స్పెయిన్ రాజు ఫెలిప్-6కు చేదు అనుభవం ఎదురైంది. వరద బాధితులంతా ఆగ్రహంతో రాజుతోపాటు అధికారులపై బురదజల్లారు. అంతటితో ఆగకుండా దురాషేలాడినట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.



వాస్తవానికి స్పెయిన్ రాజుకు ప్రజల్లో మంచి ఆదరణ ఉంది. రాజభవనం విషయంలో తాజా ఘటన అనూహ్య పరిణామం. అయితే, వరద సహాయక చర్యల విషయంలో అధికారుల నిర్లక్ష్యంపై బాధితుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. రాజు పర్యటన వేళ వారిలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. "వెళ్లిపోండి.. వెళ్లిపోండి.. హంతకులారా" అంటూ విరుచుకుపడ్డారు. బురద జల్లడంతో అంగరక్షకులు గొడుగులతో రక్షణ కల్పించారు. నిరసనకారులను నిలువరించేందుకు పోలీసులు రంగంలోకి దిగాల్సి వచ్చింది. మరోవైపు రాజు మాత్రం ప్రశాంతంగా ఉండి.. బాధితులతో మాట్లాడేందుకు యత్నించారు. రాణి లెతిజియా, ప్రాంతీయ వాలెన్సియా అధ్యక్షుడు కార్లో మజోన్ కూడా అదే బృందంలో ఉన్నారు.

ఇటీవలి వరదల సమయంలో అధికారులు రెండు గంటలు ఆలస్యంగా పౌరుల ఫోన్‌లకు హెచ్చరిక సందేశాలు పంపడం గమనార్హం. దీంతో అప్పటికే నష్టం జరిగిపోయింది. అనంతరం కూడా యంత్రాంగం నుంచి సరైన స్పందన కరవవడంతో స్థానికంగా మరింత ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇండ్లను శుభ్రపరచడం వంటి పనులు చాలావరకు నివాసితులు, స్వచ్ఛంధ కార్యకర్తలే చేశారు. ఈ పర్యటనలో రాజుతోపాటు ప్రధాని పెడ్రో సాంచెజ్ కూడా రావాల్సి ఉంది. అయితే.. ఆయన అక్కడ ఉన్నారా? అనేది స్పష్టంగా తెలియలేదు. దాదాపు అరగంట పాటు కొనసాగిన ఉద్రిక్తతల అనంతరం రాజు అక్కడినుంచి వెనుదిరిగారు.

బీసీ రిజర్వేషన్లపై జాగ్రత్తలు తీసుకోండి : సీఎం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్లకు న్యాయపరమైన చిక్కులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పుల నేపథ్యంలో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, ఉన్నతాధికారులతో కలిసి బీసీ రిజర్వేషన్లపై ఆదివారంనాడాయన ముఖ్యమంత్రి తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఈనెల 6వ తేదీ నుంచి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల సర్వే ప్రారంభం కానున్నదని తెలిపారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి భవిష్యత్‌లో ఇబ్బందులు రాకుండా ఉండేందుకు, న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ఉండేందుకు కోర్టు తీర్పులను తప్పకుండా అనుసరించాలని చెప్పారు. అందరి అభిప్రాయాల మేరకు వెంటనే బీసీ డెడికేటేడ్ కమిషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులను సోమవారం జారీ చేయాలని చెప్పారు. కుల గణన, స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలో ఇటీవల హైకోర్టు లేవనెత్తిన అంశాలను ప్రభుత్వం పున:సమీక్షించిందనీ, ఏకాభిప్రాయం మేరకు డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వానికి ఎలాంటి బేషజాలు లేవనీ, స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు.

యువజన సమస్యలపై నిరంతర పోరాటాలు

త్యాగాల తోవలో 44 ఏండ్ల డీవైఎఫ్ఐ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

యువజన సమస్యలపై డీవైఎఫ్ఐ నిరంతర పోరాటాలు నిర్వహిస్తుందని ఆసంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ తెలిపారు. డీవైఎఫ్ఐ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర కార్యాలయంలో డీవైఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమస్ఫూర్తితో భగత్‌సింగ్ వంటి వీరుల ఆశయ వారసత్వంతో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ)1980లో పంజాబ్‌లోని లూథియానాలో ఆవిర్భవించిందని వివరించారు. 15 లక్షల యువత సభ్యత్వంతో ప్రారంభమై, ఇప్పుడు 1.50 కోట్ల సభ్యత్వానికి చేరి, దేశంలోనే అతిపెద్ద యువజన సంఘంగా నిలిచిందని తెలిపారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరంతర పోరాటం చేస్తుందనీ, ప్రపంచ దేశాలపై సామ్రాజ్య వాద దేశాల పెత్తనాన్ని వ్యతిరేకిస్తుందన్నారు. అవినీతి నిర్మూలనకోసం అనేక పోరాటాలు చేసిందనీ, నిరుద్యోగుల సమస్యల సాధన కోసం ఎన్నో ఉద్యమాలు నడిపామన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎమ్‌డీ జావెద్, నాయకులు నరేష్, క్రాంతి, శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ సర్కార్ ఆగమాగం

- ఏ హామీనీ నెరవేర్చలేదు : బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షులు డాక్టర్ కే లక్ష్మణ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

"రైతులకు రైతు బంధు రాదు, రుణమాఫీ పూర్తి కాదు, బోనస్ బోగస్, పంటలు కొనే దిక్కు లేదు. పత్తి రైతులకు మద్దతు ధర లేదు. రైతు భరోసా ఊసే లేదు. రైతులకు వ్యవసాయ రుణాలు ఇచ్చే సమయంలో రేషన్ కార్డు ఆధారంగా ఇచ్చారా? రుణ మాఫీకీ, దీనికి లింకు పెట్టడం ఏమిటి?" అని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కే లక్ష్మణ్ రేవంత్ సర్కారును ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగాలు భర్తీ చేయలేదనీ, సర్కారు సొమ్ముతో జల్సాలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన పది నెలల్లో 25 విదేశీ పర్యటనలు చేశారన్నారు. హడావిడిగా అభయహస్తం దరఖాస్తులు తీసుకుని, ఇప్పటికీ దానిపై ఏ ప్రకటన చేయలేదన్నారు. హైడ్రా పేరుతో డ్రామాలు చేస్తున్నారనీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయట్లేదని చెప్పారు.పోలీసులు ధర్నాలు చేయడం చరిత్రలో ఇదే మొదటిసారి అని ఎద్దేవా చేశారు.

బీసీలపై భస్మాసుర హస్తం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కులగణన పేరుతో రాష్ట్ర ప్రభుత్వం బీసీల నెత్తిన భస్మాసుర హస్తం పెడుతున్నదని స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ అన్నారు. ఈ మేరకు ఆదివారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. కులగణను కుట్రగణనగా మార్చొద్దని విజ్ఞప్తి చేశారు. సర్వే చేసేది హస్తం పార్టీనో, ప్రభుత్వమో అర్థం కావట్లేదనీ, దీన్ని కాంగ్రెస్ సర్కస్‌గా మారుస్తున్నారని విరమర్శించారు.

మొట్టమొదటిసారి నల్లజాతి మహిళ నాయకత్వంలో
బ్రిటీష్ కన్సర్వేటివ్ పార్టీ

శనివారంనాడు జరిగిన ఓటింగ్‌లో బ్రిటీష్ కన్జర్వేటివ్ పార్టీ కొత్త నాయకురాలిగా కెమీ బాడెనోచ్ ఎన్నికయింది. ఈ విధంగా రిషి సునక్ స్థానంలో ప్రధాన బ్రిటీష్ రాజకీయ పార్టీకి నాయకత్వం వహించిన మొదటి నల్లజాతి మహిళగా ఈమె నిలిచింది. ఈమె బ్రిటన్‌లో పుట్టి, నైజీరియా, అమెరికాల్లో పెరిగింది. 44 ఏండ్ల నాయకత్వ ప్రత్యర్థి ఎంపీ రాబర్ట్ జెన్రిక్‌ను 12,418 ఓట్లతో ఓడించారని బ్రిటీష్ వార్తా సంస్థ బీబీసీ తెలిపింది. తన విజయ ప్రసంగంలో, బ్యాంకింగ్, ఐటీల్లో ఉద్యోగం చేసిన తర్వాత 2017లో ఎంపీగా మారిన బాడెనోచ్, జూలైలో జరిగిన సాధారణ ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయాన్ని చవిచూసింది. తర్వాత పార్టీని పునరుద్ధరిస్తానని ప్రతిజ్ఞ చేసింది.

టోరీలను విడిచిపెట్టిన ఓటర్లను "తిరిగి తీసుకురావాల్సిన" అవసరాన్ని ఆమె నొక్కి చెప్పింది. "మన దేశ విజయానికి పార్టీ కీలకం" అని ఆమె పేర్కొంది. బాడెనోచ్ తన మాట వినడానికి, పార్టీ మరింత నిజాయితీగా ఉండాలని, ప్రభుత్వంలో గత 14 ఏండ్లుగా




"తప్పులు చేసిందని", "ప్రమాణాలు దిగజారి పోనివ్వటం జరిగింది" అని అంగీకరించాలని పట్టుబట్టింది. బ్రిటీష్ కన్జర్వేటివ్ పార్టీ జులైలో ఎన్నడూ లేని విధంగా ఎన్నికల్లో ఘోర ఓటమిని చవిచూసింది. 14 ఏండ్లలో మొదటిసారిగా లేబర్ పార్టీ అధికారంలోకి వచ్చింది. బోరిస్ జాన్సన్, లిజ్ ట్రస్, ఆ తర్వాత సునక్‌ల పాలనలో బ్రిటీష్ ప్రజల జీవన ప్రమాణాలు కనీవినీ ఎరుగని రీతిలో క్షీణించాయి. కరెంట్ బిల్లులు విపరీతంగా పెరిగాయి. ధరలు పెరగటంతో ద్రవ్యోల్బణం ప్రబలమైంది. 2022లో రష్యా చమురును బ్రిటన్ దిగుమతి చేసుకోవటం విరమించిన తర్వాత బ్రిటన్‌లో పరిస్థితి మరింతగా దిగజారింది.

ఉక్రెయిన్ 'అత్యంత శక్తివంతమైన'
రష్యన్ దాడిని ఎదుర్కొంటోంది

టాప్ జనరల్

ఉక్రెయిన్ సైన్యం 2022 నుంచి జరిగిన వాటన్నింటికంటే "అత్యంత శక్తివంతమైన" రష్యా దాడులను ఎదుర్కొంటోందని ఉక్రేనియన్ సాయుధ దళాల టాప్ కమాండర్ జనరల్ అలెగ్జాండర్ సిర్స్కీ చెప్పాడు. చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ కారెల్ రెహ్కా నేతృత్వంలోని చెక్ రిపబ్లిక్ సైనిక ప్రతినిధి బృందంతో సమావేశం తర్వాత సిర్స్కీ శనివారంనాడు ఈ వ్యాఖ్య చేశాడు. ప్రేగ్‌ను కీవ్ కు "విశ్వసనీయ మిత్రుడు" అని ఉక్రేనియన్ కమాండర్ ప్రశంసించాడు. యుద్ధభూమిలో దిగజారుతున్న పరిస్థితి గురించి తన ఆందోళనలను ఆయనతో పంచుకున్నాడు.

"ప్రస్తుతం ఉక్రెయిన్ సాయుధ దళాలు 2022లో పూర్తి స్థాయి దండయాత్ర ప్రారంభమైనప్పటి నుంచి అత్యంత శక్తివంతమైన రష్యన్



దాడుల్లో ఒకదానిని నిలువరిస్తున్నాయి" అని సిర్స్కీ టెలిగ్రామ్‌లో రాశాడు. ఉక్రేనియన్ యూనిట్లు "దాని వనరులను తిరిగి నింపడానికి స్థిరమైన డిమాండ్" కలిగి ఉన్నాయని అతను నొక్కి చెప్పాడు. కీవ్‌లోని అధికారులు పాశ్చాత్య ఆయుధాల రవాణాలో జాప్యం, అలాగే రష్యా లోపల లోతైన దాడులకు కొన్ని దీర్ఘ శ్రేణి ఆయుధాలను ఉపయోగించడంపై పరిమితులు డాన్‌బాస్, ఇతర ప్రాంతాలలో ఇటీవలి నష్టాలకు దోహదపడుతున్నాయని చాలా కాలంగా ఫిర్యాదు చేశారు.

ఆగస్టు ప్రారంభంలో రష్యాలోని కుర్స్క్ ప్రాంతంలోకి ఉక్రెయిన్ చొరబాటు ఇతర ప్రాంతాల్లో రష్యన్ దళాల పురోగతిని తగ్గించడంలో విఫలమైంది. అక్టోబర్‌లో భారీగా వ్యూహాత్మకమైన మైనింగ్ పట్టణం ఉగ్లేదార్‌ను స్వాధీనం చేసుకున్న రష్యన్ సైనికులు ఇటీవలి నెలల్లో స్థిరంగా ఉక్రెయిన్ భూభాగాలను ఆక్రమిస్తున్నారు. ఉక్రేనియన్ దళాలను కుర్స్క్ ప్రాంతం నుంచి బయటకు నెట్టివేసే లక్ష్యంతో మాస్కో కూడా ప్రతిదాడిని ప్రారంభించింది.

అధ్యక్ష అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్, అనేక మంది ప్రముఖ రిపబ్లికన్లు కీవ్‌కు సైనిక సహాయం స్థాయిని తీవ్రంగా విమర్శిస్తున్నారు. దీనిపైన ఉక్రేనియన్ నాయకుడు వ్లాదిమిర్ జెలన్స్కీ ఏప్రిల్‌లో మాట్లాడుతూ, అమెరికాలో రాజకీయ తగాదాలకు ఉక్రెయిన్ "బందీగా" మారిందని అన్నాడు.



మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బడంగ్‌పేట్‌లోని 1వ డివిజన్ నవయుగ కాలనీలో చేపట్టిన కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహా రెడ్డి ఆదివారం కార్పొరేటర్ పెద్దబావి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. వారి వెంట కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ - మహేశ్వరం
సోమవారం | నవంబర్ 04, 2024 | www.navatelangana.com

ఘనంగా చిలుక మధుర జన్మదిన వేడుకలు

నవతెలంగాణ - దిల్‌సుఖ్‌నగర్



తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ నేత చిలుక ఉపేందర్ రెడ్డి సతీమణి చిలుక మధుర జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్కేపురం డివిజన్ నేతలు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేశారు. అనంతరం మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దేప సురేఖ భాస్కర్ రెడ్డి దంపతులు చిలుక మధురను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వాసవీ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గౌరి శెట్టి చంద్రశేఖర్ గుప్త, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న నిర్మల గణేష్, జ్ఞానేశ్వర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ- బడంగ్‌పేట్

డివిజన్ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 31వ డివిజన్‌లోని గ్రీన్ రిచ్ ఎవెన్యూ కాలనీలో పార్క్ ప్రహరీ గోడ ప్రారంభోత్సవ వేడుకలకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి హాజరై మాట్లాడారు.

అభివృద్ధి కోసం తాము ఎల్లప్పుడూ ప్రజలకు సహకరిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రమాకాంత్ రావినూతుల, ఉపాధ్యక్షులు డాక్టర్ జి. లక్ష్మీనారాయణ, ఎం.ఆనంద్, రవీందర్ రెడ్డి, రాజేష్, సురేష్ , మోహన కృష్ణ, లక్ష్మి, విద్య కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యానికి కరాటే ఎంతో అవసరం



- సక్సెస్ షోటోకాన్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలను ప్రారంభం
- అందెల శ్రీరాములు యాదవ్

నవతెలంగాణ- బడంగ్‌పేట్

నేటి సమాజంలో ఆత్మస్థైర్యానికి కరాటే ఎంతో అవసరమని మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని చిప్ప వెంకటేశం ఫంక్షన్ హాల్లో 7వ సక్సెస్ షోటోకాన్ కరాటే ఛాంపియన్షిప్-2024 పోటీలను రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే ఆత్మస్థైర్యానికి, మనోధైర్యానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. క్రీడా స్ఫూర్తితో క్రీడాకారులంతా ముున్ముందు దేశానికి ఉపయోగపడే విధంగా తమ ప్రతిభను చాటి చెప్పాలన్నారు. అనంతరం శ్రీరాములు పోటీల్లో గెలుపొందిన వారికి మెడల్స్, సర్టిఫికెట్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి, నిర్వాహకులు చంద్రశేఖర్, అసోసియేషన్ సభ్యులు, కరాటే విజేతలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ను ఆదా చేయాలి : మాధవ రెడ్డి



నవతెలంగాణ - హయత్‌నగర్


విద్యుత్‌ను ఆదా చేస్తే ఉత్పత్తి చేసినట్లేనని సరూర్‌నగర్ సర్కిల్ విద్యుత్ ఎస్ఈ మాధవరెడ్డి అన్నారు. విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని ఆదివారం హయత్‌నగర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని అధికారులకు సూచించారు. శారదనగర్ కాలనీలో 2 అంతర్గత పోల్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించాలన్నారు. ఫిర్యాదులు అందడంతో 24 గంటల్లో సమస్య పరిష్కరించాలని ఏఈ నాగరాజును ఆదేశించారు. టి జి ఎస్‌పిడిసిఎల్ యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్ లోడ్ చేసుకొని నెల నెల బిల్లులు చెల్లింపులతో పాటు ఏవైనా సమస్యలు ఉన్న ఆ యాప్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. 24 గంటలు తమ సిబ్బంది అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తారని వెల్లడించారు. విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు తెగి పడితే దగ్గర్లో ఉన్న విద్యుత్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. నాణ్యత గల పరికరాలను కొని విద్యుత్‌ను ఆదా చేయాలన్నారు. నాణ్యత గల ఐఎస్ఐ కెపాసిటర్లను అమర్చుకోవాల న్నారు. ప్రతి విద్యుత్ యూనిట్ వ్యర్థం మన ప్రగతికి ఒక మెట్టు వెనుకంజ అని అన్నారు. విద్యుత్ వెలుగు జాతికి మెరుగు, గ్రామీణ విద్యుద్దీకరణ జాతి ప్రగతికి నాంది అని అన్నారు. విద్యుత్‌ను పొదుపుగా వాడండి అని పిలుపునిచ్చారు. సకాలంలో బిల్లులు చెల్లించి మెరుగైన సేవలు పొందాలన్నారు. విద్యుత్ చౌర్యం,చట్టరీత్యా నేరం అని అన్నారు. మొత్తం వ్రాత పూర్వకంగా 6 ఫిర్యాదులు, మౌఖికంగా మరో 4 వచ్చాయని తెలిపారు. ఎస్ఈ, డిఈ స్థాయిలో పరిష్కారం కానీ సమస్యలు ఉంటే కన్స్యూమర్ గ్రీవేన్స్ సెల్, 040 23431228లో ఫిర్యాదు చేయవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ రాజ రాం రెడ్డి, ఎస్ ఎఓ రమణ రెడ్డి, ఏడీఈ విజయ భాస్కర్, ఏఈలు శ్రీనివాస చారి, నాగ రాజు, శంకర్, ఏండి పాషా కాద్రి, వినియోగ దారులు తదితరులు పాల్గొన్నారు.

పన్నాల కృష్ణారెడ్డి గృహప్రవేశంలో సబితమ్మ

నవతెలంగాణ- బడంగ్‌పేట్



మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జి పన్నాల కృష్ణారెడ్డి..బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్ గుల్ గ్రామంలో ఉన్న కింగ్స్ వే గేటెడ్ కమ్యూనిటీలో నూతనంగా నిర్మించిన విల్లా గృహప్రవేశ మహోత్సవానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హాజరై కృష్ణారెడ్డి దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాదర్‌గుల్ రైతు సహకార సంఘం బ్యాంకు చైర్మెన్ మర్రి నర్సింహారెడ్డి, మాజీ కౌన్సిలర్ ఎల్బుల మమత సుదర్శన్ రెడ్డి, కార్పొరేటర్లు సంరెడ్డి వెంకట్ రెడ్డి, బోయపల్లి దీపిక శేఖర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు మర్రి జగన్ మోహన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ యాదయ్య, ప్రజా ప్రతినిధులు, బంధు మిత్రులు తదితరులు పాల్గొన్నారు.



పశువుల పాకలో కొండచిలువ కలకలం

నవతెలంగాణ- కొత్తపేట



సత్యానగర్‌లోని రోడ్ నెంబర్ 13లో ఓ జీహెచ్ఎంసీ పార్క్ వద్ద యాదవులు ఒక పశువుల పాక నిర్మించుకున్నారు. ఒక ఆవు దూడ, ఒక బర్రె దూడ ఆ పాకలో ఉన్నాయి. అందులోకి కొండచిలువ దూరింది. ఈ క్రమంలో సాయంత్రం వాకిం గ్‌కు వెళ్లి వస్తున్న ఓ ముగ్గురు వ్యక్తులు దానిని గమనించారు. ఈ విషయాన్ని వెంటనే యాదవులకు చెప్పారు. దీంతో వారు భయాందోళన కు గురయ్యారు. నాగేష్, లింగయ్య, రాజు అనే ముగ్గురు వ్యక్తులు గూగుల్లో సెర్చ్ చేసి స్నేక్ టీం నెంబరు తీసుకున్నారు. వెంటనే కొండచిలువ సమాచారాన్ని వారికి అందజేశారు. స్నేక్ టీం ఘటనాస్థలానికి చేరుకొని ఆ కొండచిలువను పట్టుకొని వెళ్లారు. అనంతరం ఆ ముగ్గురి వ్యక్తులకు యాదవులు కృతజ్ఞతలు తెలియజేశారు.



పేదింటి అమ్మాయి పెండ్లికి

ఉప్పల ఫౌండేషన్ చేయూత

ఉప్పల శ్రీనివాస్ గుప్త

నవతెలంగాణ - నాగోల్

ఓ పేదింటి అమ్మాయి పెండ్లికి ఉప్పల ఫౌండేషన్ చేయూతగా నిలిచిందని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో- కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు, ఉప్పల ఫౌండేషన్ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్తా అన్నారు. హైదరాబాద్‌లోని నాగోల్ ఉన్న ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఓ పేదింటి అమ్మాయి పెండ్లికి మంగళసూత్రం, మెట్టెలు, గాజులను ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల ఫౌండేషన్ ద్వారా అనేక మంది పేద ఆడపిల్లల వివాహానికి మంగళ సూత్రం, మెట్టెలు అందజేసి వారికి ఆసరాగా నిలిచినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతల రజినీకాంత్, లోకేష్, హర్షవర్ధన్, నాగరాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ నిర్మాణం కోసమే కులగణన



- బీసీలు ఏయే రంగాల్లో వెనకబడ్డారో గుర్తించి న్యాయం చేస్తాం
- కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ- బడంగ్‌పేట్

బీసీలను రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, కుల గణన చేపట్టిందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 6 నుంచి చేపట్టబోయే కుల గణన సర్వేకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. అన్ని రంగాల్లో సమాన హక్కులు కల్పించేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందని అన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా కాంగ్రెస్ నాయకత్వం సమసమాజ నిర్మాణం కోసం పని చేస్తుందని గుర్తు చేశారు. విపక్షాలు ప్రజల్లో అపోహలు సృష్టించేందుకు కుట్ర చేస్తున్నాయని మండిపడ్డారు. బడుగు బలహీన వర్గాలను బలోపేతం చేస్తామని, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

బీసీలు రాజ్యాధికారం కోసం పోరాడాలి



మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు

నవతెలంగాణ-హయత్‌నగర్

బీసీలకు ఎన్నికల్లో ఇచ్చే తాయిలాలతోనే పబ్బం గడుపుకుంటున్నామని, ఇక నుంచి రాజ్యాధికారం కోసం పోరాటం చేయాలని బీసీ ఇంటలెక్చువల్ ఫోరమ్ కన్వీనర్, మాజీ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు పిలుపునిచ్చారు. ఆదివారం మిర్యాలగూడలో జరుగుతున్న బీసీ గర్జనకు వెళ్తున్న క్రమంలో ఎల్బీనగర్ నుంచి పలువురు బీసీ నేతలు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు ఆయనతో పాటుగా పలువురు బీసీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలను ఇన్ని రోజులు రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా వాడుకుని అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలు రాజకీయ చైతన్యం భూమికగా రాజ్యాధికారం సాధించేంత వరకూ పోరాటం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ డాక్టర్ల ఫోరమ్ కన్వీనర్ డాక్టర్ ఆలేటి శ్రీనివాస్ గౌడ్, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు చామకూర రాజు, సోషల్ జస్టిస్ పార్టీ తెలంగాణ ఇంచార్జ్ కేవి గౌడ్, జాతీయ స్పోక్స్ పర్సన్ వేముల కొండల్ గౌడ్, ఉపాధ్యక్షులు చెన్న శ్రీకాంత్, బీసీ కులాల సమన్వయ వేదిక అధ్యక్షులు బొమ్మ రఘురాం నేత, బీసీ జేఏసీ చైర్మెన్ అవ్వారు వేణు కుమార్, రంగారెడ్డి డీసీసీ స్పోక్స్ పర్సన్ బాంగు వెంకటేష్, మేరు సేవా సంఘం అధ్యక్షుడు అశోక్ మేరు, బీసీ రిజర్వేషన్ల పోరాట సమితి అధ్యక్షులు కోట్ల వాసుదేవ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

'కేటీఆర్ పాదయాత్రకు సంపూర్ణ మద్దతు'

నవతెలంగాణ-బడంగ్‌పేట్



బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ప్రజల తరఫున, ప్రజల గొంతుగా చేయబోయే పాదయాత్రకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని, ఈ పాదయాత్రను పహాడిషరీఫ్‌లోని బాబా షర్ఫుద్దీన్ దర్గా నుండి ప్రారంభించాలని మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హమీద్ కోరారు. మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న ఎర్రకుంటలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. అధికార కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలు ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. హైడ్రా పేరిట అమాయక ప్రజలపై బుల్డోజర్‌లు పంపి వారి బతుకులను రోడ్డు పాలు చేసిందని ఆరోపించారు. మూసీ ప్రక్షాళన పేరిట లక్షల కోట్లు దోసి ఢిల్లీకి కప్పం కట్టేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ఈ కాంగ్రెస్ పాలనలో రైతులు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు, ఉద్యోగస్తులు ఎవరు కూడా సంతోషంగా లేరని, నగరంలో శాంతి భద్రతలు క్షీణించాయని, దేవాలయాలపై దాడులు జరువుతున్నాయని, తెలంగాణలో హిందూ- ముస్లింల మధ్య చిచ్చుపెట్టి మత కల్లోలాలు సృష్టించి లబ్ధి పొందటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో పాదయాత్ర చేసి ప్రజల తరఫున ప్రభుత్వంపై పోరాడాలని కేటీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలు స్వాగతిస్తున్నారని తెలిపారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆశీస్సులతో తామంతా కేటీఆర్ పాదయాత్రలో పాల్గొంటామని చెప్పారు.

పేదల ఇండ్ల

జోలికి వస్తే ఊరుకోం

నవతెలంగాణ-ఎల్బీనగర్



ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

పేదల ఇండ్ల జోలికి వస్తే ఊరుకోమని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. చైతన్యపురి డివిజన్ పరిధిలోని ద్వారాకపురం కాలనీలో మూసీ పరివాహక ప్రాంత బాధితులతో ఆదివారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదని, బుల్డోజర్లతో పేద ప్రజలకు అన్యాయం చేస్తామంటే బుల్డోజర్లకు అడ్డుగా మేము నిలబడుతామని అన్నారు. రేవంత్ సర్కార్ తమ ఇండ్లను ఎప్పుడు కూలుస్తదో అని కంటి మీద కునుకులేకుండా, తిండి మానేసి బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఎలాంటి మార్కింగులు వేసిన, మీకు ఎలాంటి నష్టం జరగనివ్వనని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఒక ప్రణాళికబద్ధంగా చేయాల్సింది పోయి.. ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందని ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. ఏది ఏమైనా అన్ని పార్టీలను కలుపుకొని ముందుకు పోతామని, ప్రజలకు ఎలాంటి నష్టం కలిగినివ్వమని కాలనీవాసులకు భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు తోట మహేష్ యాదవ్, సొంటి చంద్రశేఖర్ రెడ్డి, త్రివేది, లక్ష్మీ నారాయణ, మెహన్ రాజ్, అజయ్, రమణారెడ్డి, అనంత్, పలువురు నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

'తప్పుడు డాక్యుమెంట్స్

సృష్టించిన వారిపై ఫిర్యాదు చేస్తాం'



నవతెలంగాణ-ఎల్బీనగర్

ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో సర్వేనెంబర్ 9/1లో ఉన్న స్థలంలో పీ.వీ హనుమంత్ రావు ఫ్యామిలీ నుండి సయ్యద్ అబ్దుల్ ఖాదర్ 1981లో 2 ఎకరాల స్థలం కొనుగోలు చేశారని, అప్పటి నుండి ఆ స్థలం తమ ఆధీనంలోనే ఉందని బాధితులు తెలిపారు. ఇప్పుడు కొత్తమంది తప్పుడు డ్యాక్యుమెంట్లు సృష్టించి.. అక్కడ ఉన్న స్థలం కబ్జా చేయాలని చూస్తున్నారని ఈ విషయంపై త్వరలోనే డీపీజీకి ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. బాధితుల తరఫున రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షులు పొగాకు రామాకాంత్ రావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ సేవాదల్ ఉపాధ్యక్షులు ఇస్మాయిల్ న్యాయం చేయాలి కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ నగర్ లో ఉన్న స్థలంలో అమృత నగర్ కాలనీ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు తప్పుడు సర్వే నెంబర్ డాక్యుమెంట్స్ సృష్టించి అక్రమంగా చొరబడి స్థలం కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ స్థలం కబ్జా విషయాన్ని సీఎంకు, రెవెన్యూ మంత్రి పొంగులేని శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఎల్బీనగర్ పోలీసులు కబ్జాదారులకు సపోర్ట్ చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైన పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి..అక్రమంగా చొరబడిన అమృతనగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేన్ వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోరబోయిన యాదగిరి, బాధితులు సయ్యద్ అజీపాషా, మహ్మద్ అజిముద్దిన్, రామకృష్ణరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ - చంపాపేట్



విశ్రాంతి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీకి ఆదివారం ఎన్‌సీసీపీఏ ఎస్.సోమయ్య తోటి ఉద్యోగులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిజిహెచ్ఎస్, ఆర్ ఈ ఎల్ హెచ్ ఎస్ అండ్ వైద్య సంబంధిత సమస్యలు, సిజి పెన్షనర్లు, బిఎస్ఎన్ఎల్ పై నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఎన్ సి సి పిఏ) విశ్రాంతి ఉద్యోగస్తుల సమస్యలను పరిష్కరించేవిధంగా పార్లమెంట్ లో మాట్లాడాలని ఎంపీని కోరారు. వినతి పత్రం అంద జేసిన వారిలో ఈపీఎస్, ఎం బ్రహ్మచారి, వై.వి సుధావన్, కె వెంకయ్య శేషు, డిఎల్ఆర్ఎల్ పి. శివలింగం, కే. జైహింద్, బి. బాల్ రాజ్, జాఫర్ ఉల్లా పాల్గొన్నారు.

మానవ మనుగడకు కరాటే అవసరం

- మర్రి హన్మంత్ రెడ్డి

నవతెలంగాణ- బడంగ్‌పేట్

నేటి సమాజంలో మానవ మనుగడకు కరాటే ఎంతో అవసరమని నాదర్‌గుల్ గ్రామ మాజీ సర్పంచ్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్రి హన్మంత్ రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ లోని చిప్ప వెంకటేశం గార్డెన్స్‌లో 7వ సక్సెస్ షోటాఖాన్ కరాటే ఛాంపియన్షిప్ -2024 ఎస్ ఎస్ ఎస్ కో ఇండియా చీఫ్ రవీందర్ కుమార్, ఫౌండర్ అనిల్ కుమార్, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీలకు ఆదివారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా కార్పొరేషన్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ వల్లపు సుభాన్ యాదవ్‌తో కలిసి విజయం సాధించిన విజేతలకు మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సంజీవ, శివ కరాటే విజేతలు తదితరులు పాల్గొన్నారు.



టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన కర్రోల్ల ప్రవీణ్ కుమార్



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ నియోజకవర్గ ఎస్సీ సెల్ ఏ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కార్రోల్ల ప్రవీణ్ కుమార్ శనివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను గాంధీ భవన్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి నిరంతరం పనిచేస్తున్నట్లు తెలిపారు.

సీసీ కెమెరాల మరమ్మతుల కోసం విరాళం అందజేత



నవతెలంగాణ-కీసర

సీసీ కెమెరాల మరమ్మతుల కోసం సీఐ వెంకటయ్యకు కీసర గ్రామానికి చెందిన నూకలగూడెం సత్తిరెడ్డి రూ.75 వేల చెక్కును ఆదివారం అందజేశారు. కీసర మండల కేంద్రానికి చెందిన నూకలగూడెం చిన్నప్ రెడ్డి శ్రీసాయి రామ్ ఫౌల్ట్రీ ఇండస్ట్రీస్ యజమాని కీసరలో ఉన్న 95 కెమెరాల మరమ్మతుల కోసం స్వచ్ఛందంగా డబ్బులు అందజేశారు. ప్రజల భద్రత దృష్ట్యా సీసీ కెమెరాల మరమ్మతు కోసం దాతలు ముందుకు రావడం చాలా సంతోషంగా ఉందని సీఐ వెంకటయ్య అన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



నవతెలంగాణ-ఉప్పల్

ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. నేర్థం బాలయ్య భాగ్యలక్ష్మి సంస్థ చైర్మెన్ నిర్థం భాస్కర్ గౌడ్ నెర్థం ప్రసాద్ గౌడ్, రాజుగౌడ్, బాలకృష్ణేశ్వర్, అనూషగౌడ్ భాగ్యశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షలు, అద్దాల పంపిణీ కార్యక్రమానికి వారు ముఖ్యతిథులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా ధృక్పథం కలిగి ఉండాలన్నారు. ప్రజాసేవ చేయడానికి పాలకులే కావాల్సిన అవసరం లేదని, సమాజ స్పృహ కలిగిన ప్రతీ పౌరుడు సేవ చేయవచ్చునని చెప్పారు. నేర్థం బాలయ్య భాగ్యలక్ష్మి సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. నెర్థం బాలయ్య భాగ్యలక్ష్మి సంస్థ చైర్మెన్ భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ..ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష ఆదరణ లభించిందని, ఇలాంటి ఉచిత వైద్య శిబిరంలో మరెన్నో నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం హెూమియోపతి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంల రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ ,బాల్ రెడ్డి, మోహన్, రవికుమార్ గౌడ్, యాదగిరి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

లక్ష్మీ నృసింహ స్వామిని దర్శించుకున్న నవీన్ మిట్టల్ దంపతులు



నవతెలంగాణ-కీసర

కార్తీక మాసం మొదటి ఆదివారం సందర్భంగా చీర్యాల లక్ష్మీ నృసింహ స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర ల్యాండ్ రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ దంపతులు దర్శించుకున్నారు. వారికి ఆలయ ఫౌండర్ చైర్మెన్ మల్లారపు లక్ష్మీనారాయణ వేద పండితులతో కలిసి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం స్వామివారి శేష వస్త్రాలు తీర్ధ ప్రసాదాలతో ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శ్రీ హరి పాల్గొన్నారు.

కురుమలు రాజ్యాధికారానికి కృషి చేయాలి



- ఎంపీ ఈటల రాజేందర్

నవతెలంగాణ-ఉప్పల్

కురుమలు అన్ని రంగాల్లో ముందుంటూ రాజ్యాధికారం కోసం కృషి చేయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఇటీవల ఎన్నికైన ఉప్పల్ కురుమ సంఘం సభ్యులు ఆదివారం ఈటల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గొంగడి, రుమాలు, శాలువాతో సత్కరించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. కురుమల అభివృద్ధికి, రాజ్యాధికారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యా అభివృద్ధి, పార్టీ పోస్టులలో రాజకీయంగా ప్రాధాన్యత కల్పిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు గొరిగె కృష్ణ కురుమ, కురుమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గొరిగె మల్లేష్ కురుమ, మల్కాజగిరి పార్లమెంట్ బీజేవైఎం ఇన్‌చార్జి రాజు కురుమ, వెలుగు గుట్ట దేవస్థానం చైర్మెన్ జన్ని రఘు కురుమ, డైరెక్టర్ సోము జంగయ్య ఉన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడితే దేశాన్ని కాపాడిన్నట్టే



- జ్ఞానమాల నిర్వహకులు భిక్షపతి
- 13వ వారం జ్ఞానమాల

నవతెలంగాణ - జవహర్ నగర్

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటే మన దేశాన్ని మనము కాపాడుకున్నట్టే అని జానమాల నిర్వహకులు మహంకాళి భిక్షపతి అన్నారు. ఆదివారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బాలాజీ నగర్ ప్రధాన రహదారిలో అంబేద్కర్, జగ్జీవన్ రావు విగ్రహాలకు, పూల మాల వేసి జై భీమ్ లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అగ్రకుల ఆర్య బ్రాహ్మణులు సామాన్య ప్రజలను మూఢత్వంలోకి లాగి మోసం చేస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఏకమై సామాజిక న్యాయన్ని సాధించి అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీస్ అధ్యక్షులు కోయ్యాడ వెంకటేష్, గాదె రమేష్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మోగిలిపాక వెంకటేష్, ఎస్సి సెల్ రాష్ట్ర నాయకులు గడ్డం శ్రీను, కళాకారులు, గజ్జెల్లి రాంచందర్, జేఏసీ అధ్యక్షురాలు గీతాంజలి, విజయ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తాయి

- బీజేపీ మతోన్మాద విధానాలు దేశానికి ప్రమాదకరం
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నరసింహారావు





నవతెలంగాణ-ముషీరాబాద్

జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తాయని, బీజేపీ మతోన్మాద విధానాలు దేశానికి ప్రమాదకరంగా మారుతున్నాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నరసింహారావు అన్నారు. ఆదివారం సీపీఐ(ఎం) ముషీరాబాద్ జోన్ కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.వెంకటేష్, విమల, జోన్ కమిటీ సభ్యులు పాషా ఆధ్వర్యంలో పార్టీ ముషీరాబాద్ జోన్ నాలుగో మహాసభ కార్యక్రమం గోల్కొండ క్రాస్ రోడ్డులోని నగర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీ నరసింహారావు మాట్లాడుతూ..బీజేపీ మతోన్మాద విధానాలు యావత్ దేశానికి ప్రమాదకరంగా మారుతు న్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలంటే కేవలం కమ్యూనిస్టులతోనే సాధ్యమవుతుందన్నారు. అంతర్జాతీ యంగా వామపక్ష పార్టీలు పశ్చిమ దేశాలలో అధికారం వైపు వెళుతున్నాయని, ఆ దిశలోనే శ్రీలంకలో కమ్యూ నిస్టులు అధికారంలోకి వచ్చారన్నారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం వీడి శాంతి వైపు ప్రయాణించాలని ఐక్యరాజ్య సమితి చెప్పినా వినడం లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా కాలయాప న చేస్తుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రతి ఒక్కటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. విమర్శలు ప్రతి విమర్శలతో అభివద్ధి జరగదని సూచించారు. అంతకుముందు దోమలగూడలో కమిటీ సీనియర్ సభ్యులు అమరవీరులు కామ్రేడ్ వనిత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. అనంతరం కమిటీ సభ్యులు విజయ్ కుమార్ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శి ఎం. శ్రీనివాస్, కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. వెంకటేష్, ముషీరాబాద్ జోన్ కార్యదర్శి దశరథ్, కార్యదర్శి వర్గ సభ్యులు రమేష్ ,పి మహేందర్ ,సైదులు, నర్సింగ్ రావు, వెంకటమ్మ, సిరాజుద్దీన్, తదితరులున్నారు.

ఏ సంస్థకైనా వినియోగదారులే ఇంధనం

- ఏడీఈ అశోక్ రావు
- ఘనంగా విద్యుత్తు వినియోగదారుల దినోత్సవం



నవతెలంగాణ-శామీర్‌పేట

ఏ సంస్థకైనా వినియోగదారులే ఇంధనం లాంటివరని శామిర్ పేట ఏడీఈ అశోక్ రావు అన్నారు. ఆదివారం శామిర్ పేట మండల కేంద్రంలోని విద్యుత్తు ఉపకేంద్రం వద్ద ఆయన ఆధ్వర్యంలో విద్యుత్తు వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్తు సమస్యలు పరిష్కరానికి సదస్సు ఏర్పాటు చేసి వినియోగదారుల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ... శామిర్ పేట సెక్షన్ పరిధిలో 5 అర్జీలు వచ్చాయన్నారు. అందులో మూడు ఎక్కువ బిల్లు వస్తున్నాయని అర్జీలు వచ్చాయన్నారు. బొమ్మరాసిపేటలో ఒక ట్రాన్స్ ఫార్మర్, మందాయిపల్లిలో ఒక కొత్త ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని, అలియాబాద్ సెక్షన్ పరిధిలోని తుర్కపల్లి గ్రామంలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగకుండా లైన్ ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని, సింగిల్ ఫేజ్ లైన్ స్థానంలో త్రీ ఫేజ్ లైన్ ఏర్పాటు చేసి ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చూడాలని కాంగ్రెస్ నాయకులు జీడిపల్లి వేణుగోపాల్ రెడ్డి తన అర్జీని అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శామిర్ పేట ఏఈ రాఘవేందర్ రావు, అలియాబాద్ ఏఈ వెంకట నారాయణ, సబ్ ఇంజనీర్లు శ్రీధర్, దీనకర్, స్టాఫ్ పాల్గొన్నారు.

కన్నుల పండుగగా కూచిపూడి నాట్య వైభవం



నవతెలంగాణ-కల్చరర్

కూచిపూడి నాట్య సంప్రదాయం అనుసరిస్తూ ప్రారంభ శ్లోకాలు తదుపరి రంగ పూజతో కళాకారిణులు తమ నాట్య ప్రదర్శన ఆరంభించి రామదాసు కీర్తన పలుకే బంగారమాయెనా, రాజరాజేశ్వరి అష్టకం, జయ జనార్ధన తదితరాల అంశాలు లావణ్య బసవ శిష్య బృందం నాయనానందకరంగా ప్రదర్శించారు. శ్రీత్యాగ రాయ గానసభ ప్రధాన వేదికపై శ్రీసాయి దేవ్ కూచిపూడి అకాడమీ దశమ వార్షిక వేడుకలులో సుమారు వంద మంది లావణ్య శిష్యులు నాట్య మహెూత్సవంలో పాల్గొని తమ నాట్య ప్రతిభ చూపారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్యతిథిగా హాజరైన ఆంధ్రనాట్య గురువు డాక్టర్ కళా కృష్ణ మాట్లాడుతూ.. విఖ్యాత నాట్య గురువు శోభా నాయుడు శిష్యురాలిగా లావణ్య గురువు ఆశయం కొనసాగిస్తూ కూచిపూడి నాట్య ప్రాచుర్యంలో తనవంతు పాత్ర వహిస్తున్నారని అభినందించారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న నాట్య గురువు సుజాత మూర్తి మాట్లాడుతూ ఎయిర్ హెూస్టెస్‌గా వృత్తిలో రాణిస్తూ గురువు శోభా నాయుడుకు ఉత్తమ శిష్యురాలుగా ఎంతో మందికి నాట్యం లో శిక్షణ ఇస్తు తన ప్రవృత్తి కొనసాగిస్తున్న లావణ్య అభినందనీయురాలన్నారు. మరొక నాట్య గురువు సుమలత తమ శుభాకాంక్షలు తెలిపారు.





డీఎంఅండ్‌హెచ్‌ఓ రఘునాథస్వామికి సన్మానం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రముఖ ఆరోగ్య సంస్థల సంఘం, తెలంగాణ హాస్పిటల్ అండ్ నర్సింగ్ హెూమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నోవోటెల్‌లో ఆదివారం థానాకాన్-2024 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్ సమక్షంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథ స్వామిని ఘనంగా సన్మానించారు. రఘునాథ్‌స్వామి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పలు ఆరోగ్య కార్యకలాపాల్లో ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ గౌరవాన్ని అందుకున్నారు. ఈ ప్రాంతంలో ప్రజారోగ్య రంగంలో, ముఖ్యంగా ఆరోగ్య సంరక్షణ, మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం, వైద్య సౌకర్యాలు అందించడం వంటి కార్యకలాపాల్లో రఘునాథస్వామి చేసిన కృషి అభినందనీ యమైంది. అనేక ఆరోగ్య, నివారణ చర్యలు, సామూహిక ఆరోగ్య భద్రతకు సంబంధించిన కార్యక్రమాల అమలులో ఆయన తన అపూర్వమైన నిబద్ధతను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రఘునాథస్వామి మాట్లాడుతూ మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో వైద్య సేవలు అందించే దిశగా తనకు తోడ్పడిన ప్రతి అధికారి, సిబ్బందికి కతజ్ఞతలు తెలిపారు.

'ఫ్లాగ్ షిప్ స్టోర్' డిజైనర్ స్టూడియో ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

స్వయం డిజైనర్ స్టూడియో పేరుతో నగరంలో సరికొత్త డిజైనర్ స్టూడియో అందుబాటులోకి వచ్చింది. యమునా బధిత ఏర్పాటు చేసిన ఈ ఫ్లాగ్ షిప్ స్టోర్‌ను ప్రముఖ సినీనటి ప్రణీత సుభాష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రణీత సుభాష్ మాట్లాడుతూ ఒకప్పుడు డిజైనర్ దుస్తులు డిజైనర్లు హైదరాబాదులో అందుబాటులో ఉండేవారు కాదనీ, ఇప్పుడు ప్రపంచ వేదికపై హైదరాబాద్ డిజైనర్‌లో తమ ఖ్యాతిని చాటుతున్నారని తెలిపారు. అంతే కాకుండా సాంప్రదాయ దుస్తులకు ఆధునికతను మేళవిస్తూ అద్భుతంగా సృష్టిస్తున్నారన్నారని చెప్పారు. శుభకార్యాలు, అందాల వేడుకలు ఏవైనా ఇప్పుడు డిజైనర్ దుస్తులు ప్రత్యేకంగా నిలుస్తున్నాయన్నారు. తాను సైతం డిజైనర్ దుస్తులను అవసరానికి అనుగుణంగా ధరిస్తానని చెప్పారు. నిర్వాహకురాలు యమునా బదిత మాట్లాడుతూ తాను లండన్‌లో మాస్టర్ చేశాననీ, డిజైనర్ రంగంపై తనకున్న అభిలాషతో ఈ స్టోర్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తాము అందించే డిజైన్లు సౌకర్యవంతంగా అందాన్ని ఇనుమడింపజేసేలా ఉంటాయని తెలిపారు. స్వయం అంటే సంస్కృతంలో సొంతం అని అర్థం అన్నారు. సొంతంగా ప్రేమించడం మనం ధరించిన వాటిని ఇష్టపడటం కోసం ఈ పేరును ఎంపిక చేసుకున్నట్టు తెలిపారు. గతంలో ఆన్‌లైన్‌లో తమ సేవలు అందించామనీ, ఇప్పుడు నగరవాసులకు ఈ స్టోర్ ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చినట్టు వివరించారు. ఖాజాగూడలో ఏర్పాటు చేసిన ఈ స్టోర్ ప్రత్యేకంగా నిలుస్తుందని తెలిపారు.

'కిమ్స్'లో రాష్ట్రస్థాయి చర్మ వ్యాధుల సదస్సు



నవతెలంగాణ-సిటీబ్యూరో

శారీరకంగా ధృడంగా, మానసికంగా స్థిరంగా ఉన్నా ముఖంపై ముడతలు మనుషుల ఆత్మస్థైర్యాన్ని కాస్త దెబ్బతీస్తాయనీ, వీటిని జయించేందుకు ఆధునిక వైద్యం తోడ్పడుతుందని సీనియర్ డెర్మటాలజిస్టులు తెలిపారు. సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన "అప్‌డేట్ ఇన్ ప్రొసీజరల్ డెర్మటాలజీ" సదస్సులో పలువురు వైద్యులు పాల్గొని, రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన సుమారు 300 మంది డెర్మటాలజిస్టులకు పలు విషయాలు తెలిపారు. ముందుగా ఈ సదస్సును కిమ్స్ హాస్పిటల్స్ సికింద్రాబాద్ మెడికల్ సూపరింటెంట్ డాక్టర్ సంబిత్ సాహు జ్యోతి వెలిగించి ప్రారంభించి మాట్లాడారు. నిరంతరం నేర్చుకోవడం వైద్య వృత్తిలో చాలా కీలకమనీ, డెర్మటాలజిస్టులు ఈ దిశగా వస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్ట్స్, వెనీరియాలజిస్ట్స్, అండ్ లెప్రాలజిస్ట్స్ (ఐఈడీవీఎల్) తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. కిమ్స్ ఆస్పత్రికి చెందిన కన్సల్టెంట్ డెర్మటాలజిస్టు డాక్టర్ ఆనంద్ కుమార్ వగ్గు ఈ సదస్సుకు నిర్వాహకులుగా వ్యవహరించారు. డాక్టర్ ఏకె.లహరి ఈ సదస్సుకు సైటింఫిక్ కన్వీనర్‌గా వ్యవహరించారు. ఇందులో ప్రధానంగా వృద్ధాప్యాన్ని జయించేందుకు ఉన్న వివిధ రకాల పద్ధతులు, మూలకణ చికిత్సలు, గోళ్లలో వచ్చే ఇన్ఫెక్షన్లు, మచ్చల నివారణకు వస్తున్న ఆధునిక చికిత్సలు లాంటి అంశాలపై లోతుగా చర్చించారు. మూలకణ చికిత్సలు చాలా విప్లవాత్మక ఫలితాలను ఇస్తున్నాయనీ, వీటి గురించి డెర్మటాలజిస్టులు మరింత పరిశోధనలు చేయాలని సూచించారు. వివిధ ప్రమాదాల్లో బాధితులకు ఆ తర్వాత ఏర్పడే మచ్చలు ఆత్మవిశ్వాసాన్ని తగ్గిస్తాయనీ, వీటిని నయం చేయడానికి వచ్చిన ఆధునిక పద్ధతులను అందరూ తెలుసుకోవాలని సీనియర్ డెర్మటాలజిస్టులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఏడీవీఎల్ తెలంగాణ శాఖ అధ్యక్షుడు డాక్టర్ వెంకటకృష్ణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జేవీడీఎస్ ప్రసాద్, కోశాధికారి డాక్టర్ షహన, సీనియర్ డెర్మటాలజిస్టులు డాక్టర్ ఎస్.రమేష్, డాక్టర్ సుధారాణి, డాక్టర్ సాయికష్ణ, జాతీయ ఐఏడీవీఎల్ గౌరవ ప్రధాన కార్యదర్శి డాక్టర్ భూమేష్ కుమార్, జాతీయ ఐఏడీవీఎల్ కోశాధికారి డాక్టర్ ఎస్.బి.కవిత, ఢిల్లీకి చెందిన సీనియర్ చర్మవ్యాధి నిపుణుడు డాక్టర్ మానస్ ఛటర్జీ పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులకు సన్మానం



నవతెలంగాణ-సిటీబ్యూరో

దీపావళి పండుగ సందర్భంగా టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేనీ(ముజీబ్)లకు ఆ సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్, స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ యూనిట్ అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్, వారి కార్యవర్గం ఆధ్వర్యంలో సెంట్రల్ అసోసియేట్ ప్రెసిడెంట్ కస్తూరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు కొండల్ రెడ్డి, టీఎన్జీవోస్ యూనియన్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు ఆశోక్, సిటీ అధ్యక్షులు శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్, సీటీవో సుదర్శన్, హయ్యర్ ఎడ్యుకేషన్ యూనిట్ నాయకులు కలీం, షాబుద్దీన్ సమక్షంలో పూలబోకే అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ ఎడ్యుకేషన్ యూనిట్ ఉపాధ్యక్షులు ఆర్గనైజింగ్ సెక్రటరీ ఫెర్రోస్ అహ్మద్, సుదర్శన్, శ్రీకాంత్, రామకృష్ణ రెడ్డి, అనిల్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

కొర్రెములలో ఘనంగా సదర్ ఉత్సవాలు

- హాజరైన కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్



నవతెలంగాణ-ఘట్కేసర్

యాదవుల సంప్రదాయ పండుగ సదర్ ఉత్సవాలు అని పీసీసీ మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఆదివారం కొర్రెముల గ్రామంలో శ్రీకృష్ణ యాదవ సంఘం నాయకులు గోపు బాలరాజు యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదర్ ఉత్సవాలకు ముఖ్యతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీపావళి సంబరాల్లో భాగంగా సదర్ ఉత్సవాలను జరపడం గొప్ప విషయమన్నారు. కాగా ఈ ఉత్సవాలలో యాదవులు దున్నపోతులను ఆటలు ఆడించారు. ఈ కార్యక్రమంలో గుర్రంలా యాదవ సంఘం సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలుపాల్గొన్నారు.

మ్యాన్ హెూల్‌కు మరమ్మతులు చేపట్టాలి



నవతెలంగాణ-చంపాపేట్

రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నియోజకవర్గం దుర్గ భవాని నగర్ భాష్యం హై స్కూల్ ఎదురుగా రోడ్డులో ప్రమాదకర మ్యాన్‌హెూల్‌కు అధికారులు మరమ్మతులు చేపట్టాలని కాలని వాసులు వాపోతున్నారు. రాకపోకలకు విద్యార్థులు మహిళలు పెద్దలు వాహనాల ధాటికి గుంత ప్రమాదకరంగా మారిందని తెలిపారు. .జీహెచ్ఎంసీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మ్యాన్ హెూల్‌కు మరమ్మత్తు చేపట్టాలని కోరుతున్నారు.



ఆదివారం కేపీహెచ్‌బీ కాలనీ మెయిన్ రోడ్ తబలా హెూటల్‌లో బీజేపీ నాయకులైన ముద్దా వైవి సుబ్రహ్మణ్యం, అనూష కుమార్తె విద్యా సావిత్రి పుష్పాలంకరణ వేడుకకు కూకట్ పల్లి జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పాల్గొని చిరంజీవి విద్యా సావిత్రిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అసమానతలు లేని సమాజమే డీవైఎఫ్ఐ లక్ష్యం



- కుత్బుల్లాపూర్ మండలం అధ్యక్షులు ఆది నాగరాజు

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

అసమానతలు లేని సమాజమే డివైఎఫ్ఐ లక్ష్యమని డివైఎఫ్ఐ నాయకులు అన్నారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం షాపూర్ నగర్ కార్యాలయంలో డివైఎఫ్ఐ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆది నాగరాజు, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు పసుల అంజయ్య పాల్గొని మాట్లాడారు. డివైఎఫ్ఐ 1980 నవంబర్ 1న లూథియానా రాష్ట్రంలో డివైఎఫ్ఐ ఆవిర్భవించింది. మా దేహం ముక్కలైన ఈ దేశాన్ని ముక్కలు కానివ్వం అనే నినాదంతో ఆనాటి నుంచి ఈనాటి వరకు దేశంలో ఉగ్రవాదానికి మతోన్మాదానికి వేర్పాటువాదానికి దాదాపు నాలుగువేల మంది డివైఎఫ్ఐ కార్యకర్తలు ప్రాణత్యాగం చేశారని తెలిపారు. దేశ సమైక్యత సమగ్రతలను కాపాడాలని విద్యా, వైద్యం ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని, ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని పేర్కొన్నారు. దేశంలో విపత్తులు సంభవించినప్పుడు బాధ్యత గల పౌరులుగా డివైఎఫ్ఐ కార్యకర్తలు సేవలు చేస్తున్నారన్నారు. భగత్ సింగ్, చేగువేరా స్ఫూర్తితో అవినీతిని పూర్తిగా నిర్మూలించాలని డివైఎఫ్ఐ పోరాడుతుందన్నారు. ఈ పోరాటానికి యువతి, యువకులు మద్దతు తెలిపి భగత్ సింగ్ కలలుగన్న అసమానతలు లేని సమాజ నిర్మాణానికి తోడ్పడాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పైన తెలిపిన విషయాలన్నీ పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరుద్యోగులను ఏకం చేసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్ పాషా, ఆసీస్, శ్రీనివాస్, డి.కరుణాకర్, భాష, సాయికుమార్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) మహాసభలను జయప్రదం చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పి.సత్యం

నవతెలంగాణ-బాలానగర్

ప్రగతినగర్‌లో జరిగే సీపీఐ(ఎం) పార్టీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పి.సత్యం కోరారు. కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ మండల పరిధిలోని పార్టీ కార్యాలయంలో శాఖ కార్యదర్శుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో సీపీఎం పార్టీ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా మూడోవ మహాసభలను జయప్రదం చేయాలని సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి పి.సత్యం పాల్గొని మాట్లాడారు. జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని, ఇందుకు కూకట్‌పల్లి నియోజవర్గం, కుత్బులా ్పూర్ నియోజకవర్గల ప్రజలు సహకారం అం దించాలని కోరారు. గత మూడు సంవత్సరాలలో జరిగిన పోరాటాలు, భవిష్యత్‌లో జరిపే ఉద్యమాల తీర్మానాలను ఆమోదిస్తుందని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో ఆయా ప్రభు త్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు అవలంభి స్తున్నాయన్నారు. ముఖ్యంగా మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో ఐదు నియోజకవర్గాలు ఉన్నాయని, ప్రతి నియోజవర్గంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రులను ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా మేడ్చల్ జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలను ఏర్పాట్లు చేయాలని, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.



ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కృష్ణారావు, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్ రామయ్య, ఐలాపురం రాజశేఖర్, కీలుకాని లక్ష్మణ్, ఎం.శంకర్, ఎం. నరేష్, జిల్లా నాయకులు లింగస్వామి, ఎ.విజయ, శివప్రసాద్, పి.శంకర్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ చైర్మెన్‌ను సత్కరించిన శ్రీరామోజు శివకుమార్



నవతెలంగాణ-కూకట్ పల్లి

తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు చైర్మన్‌గా నియమితులైన టీవీ5 అధినేత బీఆర్ నాయుడుని తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు శ్రీరామోజు శివకుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు బోర్డ్ సభ్యులుగా నియమితులైన నన్నూరి నర్సిరెడ్డి, ఎమ్మెస్ రాజుని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు చెప్పారు. ఆయనతో పాటు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు పాతూరు వెంకట్రావు, చేవెళ్ల పార్లమెంట్ నాయకులు ఎన్ఎస్ రాజు, టీఎన్ఎస్ఎఫ్ చేవెళ్ల పార్లమెంట్ నాయకులు సాయిరామ్, సందీప్, ఉత్తమ్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వంలో కుంటుపడిన అభివృద్ధి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్ పల్లి

కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి కుంటుపడిందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసి అత్యధిక మెజారిటీతో గెలిపించిన, కార్యకర్తలకు ఎలాంటి సమస్యలు వచ్చిన అండగా ఉంటానని తెలిపారు. ఆదివారం కూకట్ పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మూసాపేట డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో, స్థానిక మాజీ కార్పొరేటర్ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో, విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కార్యకర్తలు డివిజన్లో అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు చేస్తున్న అరాచకాలను, హైడ్రా పేరుతో ప్రజలను అధికారులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, స్థానికంగా ఉన్న అధికార పార్టీ నాయకులు, హైడ్రా పేరును అడ్డుపెట్టుకొని వసూళ్లకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత



పది సంవత్సరాలుగా వందల కోట్ల రూపాయలతో మూసాపేట డివిజన్‌ను అభివృద్ధి చేశామని రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి సమస్యలు, ట్రాఫిక్ సమస్యల నిర్మూలన చేపట్టామన్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడిన నుంచి నియోజకవర్గానికి ఒక్క రూపాయి బడ్జెట్ కూడా ఇవ్వకపోవడంతో, అభివృద్ధి కుంటుపడిందని వాపోయారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలను గెలిపిస్తే తెలంగాణ ప్రజలకు ఏమైనా న్యాయం చేశారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కై బీఆర్ఎస్ పార్టీని తిట్టడమే లక్ష్యంగా చేసుకున్నారే.. తప్ప అభివృద్ధి పైన దృష్టిసారించే ఆలోచన లేదన్నారు. పేదోళ్ల భవంతులను కూల్చడం మానేసి, పేదోళ్ల కడుపులు కొట్టడానికి హైడ్రా తీసుకువచ్చారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు ఎలాంటి ఆపదలు వచ్చినా, వెన్నంటి ఉంటానని ఎవరు కూడా భయభ్రాంతులకు గురికాకూడదని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ, జిల్లా గోపాల్, తదితర నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం



- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ సీనియర్ నేత కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. ఆయనని తన నివాసం వద్ద పలువురు నాయకులు, పలు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, మర్యాదపూర్వకంగా కలిసి, వివిధ కాలనీలలో సీసీ రోడ్లు, డ్రైనేజ్, వీధి దీపాలు తదితర సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. పలు వినతులు స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే వాటి పరిష్కారం కోసం, ఆయా కాలనీల అభివృద్ధి కోసం సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పలువురు ఆయనకి పలు శుభకార్యాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలు అందజేశారు.

హైదర్‌నగర్ గ్యార్వీ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ- కేపీహెచ్‌బీ

హైదర్‌నగర్ పరిధిలోని దర్గా వద్ద ముస్లిం మైనార్టీ ప్రజలు నిర్వహించిన గ్యార్వీ వేడుకల్లో కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలోని అన్నీ మతాలు, కులాలు ఒక్కటే అనే విషయాన్ని గుర్తించి మత సామరస్యంతో అందరూ ముందుకు వెళ్లాలని కోరారు. అన్నీ మతాలసారం ఒక్కటేనని, ఒకరికి ఒకరూ ప్రేమా ఆప్యాయతలతో సహాయపడుతూ దేశాన్ని ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. హైదర్‌నగర్ ప్రాంతం తనకు రాజకీయంగా పుట్టినిల్లు వంటిదన్నారు. ప్రజా ప్రతినిధిగా మొదటి ప్రస్థానం ఇక్కడే మొదలయ్యిందని అప్పటి నుంచి వెనుదిరిగి చూడకుండా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందటం జరిగిందన్నారు. తనను కౌన్సిలర్‌గా గెలిపించిన హైదర్‌నగర్ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషిచేసినట్లు తెలిపారు. శ్మశాన వాటికలకు, పాఠశాలలకు, ప్రార్థన స్థలాల కోసం భూములను ఆరోజుల్లోనే ఇప్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్ రావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, మొహమ్మద్ గౌసుద్దీన్, గొట్టిముక్కల బాస్కర్ రావు, స్థానిక నాయకులు కలీమ్, నక్క శ్రీనివాస్, న్యాయవాది శ్రీకాంత్, నర్సింగరావు, వెంకటేష్, సలీమ్, మహిళ నాయకురాలు జుబేదా బేగం, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కరాటే క్రీడ శారీరక ధృఢత్వానికి ప్రతీక



- టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం

నవతెలంగాణ-బాలానగర్

కరాటే క్రీడ శారీరక, ధృఢత్వానికి ప్రతీక అని టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం అన్నారు. కూకట్ పల్లిలోని శ్రీ పుల్లారి నారాయణదాస్ కల్యాణ మండపం లో జరిగిన ఐదోవ నేషనల్ లెవల్ ఓపెన్ కరాటే తాయిక్ వండ్ ఛాంపియన్ షిప్ 2024. ఈ కాంపిటిషన్ కార్యక్రమంలో కర్ణాటక, మహారాష్ట్ర, బెంగుళూరు, ముంబాయి, తెలంగాణలోని నాగర్ కర్నూల్, వరంగల్, పెద్దపల్లి జిల్లాల నుంచి 450 మంది విద్యార్థులు కాంపిటిషన్‌లో పాల్గొన్నారు. నీయుద్ధలీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు టి.సంతోష్ కుమార్ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించి లక్ష్యం దిశగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం ప్రతిభ కనబరించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్, బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో షీ టీం లక్ష్మి రుద్రమ దేవి సెల్ఫీడిఫెన్స్ అకాడమీ ఫౌండర్, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, బాలాజీ నగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్, రవి, శ్రీధర్, సత్య శంకర్ తదితర మాస్టర్లు, అకాడమీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దీపావళి పర్వదిన వేడుకల్లో ఆత్మీయ సమ్మేళనం



- పాల్గొన్న కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-బాలానగర్

కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని వినాయక్ నగర్ పరిధిలో దీపావళి పర్వదినాన సందర్భంగా వరలక్ష్మి టింబర్ డిపో వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లక్ష్మీ పూజలు నిర్వహించి టింబర్ డిపోలో ప్రత్యేక దీపారాధన కార్యక్రమాల్లో పాల్గొనిత బాణసంచా వేడుకలు జరుపుకున్నారు. అనంతం నిర్వాహకులు బోజన తాంబూలాలు స్వీకరించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ మేరకు పలువురు శ్రేయోభిలాషులు, విశ్వకర్మలు ఆత్మీయ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పి.కృష్ణమాచారి, విశ్వకర్మ సభ్యులు పి.వెంకట్ సునీల్, లక్ష్మణ్, మౌనప్ప, వెంకటాచారి, మల్లయ్యచారి, మహేందర్ రెడ్డి, సురేందర్ యాదవ్, గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ మాజీ సంయుక్త కార్యదర్శి అశోకాచారి తదితరులు పాల్గొన్నారు.

నిండా గోతులు.. నరకానికి దారులు

నవతెలంగాణ-చంపాపేట్

వరద నీరు నిలిచిపోవడంతో పాటు పైనుంచి వచ్చే వరద నీరు రోడ్లపై నుంచి పారుతుండటంతో రోడ్లు కనీసం నడవటానికి వీలు లేకుండా పోతోంది. ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ కర్మన్ ఘాట్ పవన్ పూరి కాలనీలో ఏడాది క్రితం వరదనీటి కాలువ నిర్మించారు. పనులు పూర్తయినా రోడ్లకు మరమ్మతులు చేయడం లేదు. ఏడాది క్రితం భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తయ్యాయి. ఇంతవరకు రోడ్ల నిర్మాణంపై అధికారులు, ప్రజాప్రతినిధులు కనీస ప్రతిపాదనలు రూపొందించడం లేదు. పవన్ పూరి కాలనీ రోడ్డు దుస్థితి అధ్వానంగా తయారైయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు పూర్తిగా దెబ్బతిని రాకపోకలు సాగించడం కష్టసాధ్యంగా మారింది. రోడ్లపై వరదనీరు నిలిచిపోవడంతో ఎక్కడికక్కడ పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ రోడ్లపై ప్రయాణించటం వాహనదారులకు, పాదచారులకు కష్టంతరంగా మారింది. బస్తీల్లో పైనుంచి వచ్చే వరదనీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు సాగించడం నరకప్రాయమవుతోంది. ఆయా ప్రాంతాల్లో కనీసం కంకరపొడి నింపి రోడ్లను రాకపోకలకు అనువుగా చేయాల్సిన జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ప్రతి డివిజన్ కాలనీలో తక్షణ మరమ్మ తుల కోసం ఏర్పాటు చేసిన బృందాలు సైతం ఈ రోడ్ల వైపు కన్నెత్తి చూడటం లేదు. వెంటనే ఆయా ప్రాంతాల్లోని రోడ్లకు కనీస మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



కబడ్డీ లీగ్ ప్రారంభించిన సురభి రవీందర్ రావు



నవతెలంగాణ-కూకట్ పల్లి

కూకట్ పల్లిలోని పల్లవి మోడల్ స్కూల్‌లో పీఈటీ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగరాజు ఆర్గనైజేషన్‌లో హిందూస్తాన్ కబడ్డీ లీగ్ ప్రారంభమైంది. ఈ కబడ్డీ లీగ్‌ను ప్రారంభోత్సవానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్‌రావు ముఖ్య అతిథిగా, గౌరవ అతిథులుగా డొల్ల మల్లేష్‌లు హాజరై కబడ్డీ లీగ్ ప్రారంభించారు. అనంతరం వారు క్రీడాకారులతో కలిసి కబడ్డీ ఆటలో పాల్గొని క్రీడాకారులను ఉత్తేజపరిచారు, విజేతలైన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకులు, నరేందర్ రెడ్డి, వంశి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



స్వామి సన్నిధిలో ఎల్మేటి అమరేందర్ రెడ్డి



నవతెలంగాణ-బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్, జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో కొత్తపేట్, వెంకటాపూర్ గ్రామ సరిహద్దుల్లో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీకాశీ విశ్వనాథ స్వామి ఆలయంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టీపీసీసీ సెక్రటరీ ఎల్మేటి అమరేందర్ రెడ్డి పాల్గొని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను పూల మాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు సిల్వేరి సాంబశివ, ఉపాధ్యక్షులు జిట్టరాజు, తోట్ల శ్రీనివాస్, కోలేటి నరసింహారావు, కొమ్ము మల్లేష్, కిరణ్ కుమార్, దేవేందర్, శంకర్ ఆలయ పూజారి సంజీవ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు రూ. 26వేల వేతనమివ్వాలి



నవతెలంగాణ-బాలాపూర్

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపల్‌లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయు బాలాపూర్ మండల కన్వీనర్ వి.శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ గ్రామంలో సీఐటీయు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఐటీయు యునియన్ ఎల్లపుడు కార్మికులకు అండగా ఉంటుందన్నారు. మున్సిపల్ కార్మికుల యూనిట్ సమావేశం మున్సిపల్ కార్మికుల కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తు కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 10 కేసులు నమోదు



నవతెలంగాణ- చంపాపేట్

చంద్రయాన్ గుట్ట డివిజన్ చౌరస్తా వద్ద బండ్లగూడ ట్రాఫిక్ పోలీసులు ఆదివారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. సౌత్ జోన్ ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ ఆదేశం మేరకు సీఐ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించగా సుమారు 10 కేసులను నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఎస్సై అక్బర్ షరీఫ్, ఆర్ఎస్ఐఎన్. రాఘవేందర్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 10 మంది ద్విచక్రవాదారులు, ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. ఎన్ని అవగాహన కార్యక్రమాలను నిర్వహించినా వాహనదారుల్లో మార్పు రావడం లేదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు సిబ్బంది అబ్దుల్ రహమాన్, వెంకటయ్య, సురేందర్, సయ్యద్ హమీద్, సామ్సన్, అబ్దుల్ అజీమ్ పాషా, లక్ష్మీనారాయణ, రాజేష్, కృష్ణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-దుండిగల్

మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు అలాగే మధ్యాహ్నం 2:00 గంట నుంచి 4:00 గంటల వరకు గణపతి ఆశారామం, పారిశ్రామికవాడ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని, ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని డీపీ పల్లి విద్యుత్ శాఖ ఏఈ ఎస్.సురేందర్ రెడ్డి తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
సోమవారం | నవంబర్ 04, 2024 | www.navatelangana.com

చెకుముకి సైన్స్ అవగాహన వాల్ పోస్టర్ విడుదల



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా వెంగళరావు నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వాల్ పోస్టర్‌ను స్కూల్ ఇన్‌చార్జి బి.మధు, ఉపాధ్యాయ బృందం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రవీంద్రబాబు పాల్గొని ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ సైన్స్ పై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని, జన విజ్ఞాన వేదిక అనేక రకా లుగా విద్యార్థులను చైతన్య పరుస్తున్నారన్నారు.



యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సదర్ వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్.గౌతమ్ రావు, కార్పొరేటర్ వై అమృతయాదవ్, నిర్వాహకులు జంగాల అనిల్ యాదవ్, ప్రవీణ్ యాదవ్, లల్లు యాదవ్, వినోద్ యాదవ్, రవి యాదవ్, వెంకటేష్ యాదవ్, సందీప్ యాదవ్, అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-అంబర్‌పేట

ఏసుక్రీస్తు బోధనలను పాటించాలి



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఏసుక్రీస్తు సూక్తులు ప్రతి ఒక్కరూ ఆచరించదగినవని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం అమీర్ పేట డివిజన్ ఎస్ఆర్ నగర్‌లోని క్రిస్టియన్ ఫెలో షిప్ చర్చిలో నిర్వహించిన కృతజ్ఞ తర్పణల పండుగలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్మార్గంలో పయనించాలి, సాటి వారికి సహాయ పడాలనే ఏసుక్రీస్తు బోధనలను పాటించాలని కోరారు. చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఆదివారం చర్చికి వచ్చి ప్రార్థనలు నిర్వహిస్తూ క్రిస్టియన్‌లు క్రమశిక్షణకు ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు. పండుగలు ఎన్ని ఉన్నప్పటికీ ప్రపంచం మొత్తం జరుపుకునే ఏకైక పండుగ క్రిస్మస్ అని అన్నారు. నెల రోజుల పాటు ఎంతో భక్తి శ్రద్ధలతో క్రిస్మస్‌ను జరుపుకుంటారనే విషయాన్ని గుర్తు చేశారు. ఎప్పుడు ఏ అవసరమొచ్చిన తాను అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం చర్చి నిర్వాహకులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, చర్చి కమిటీ ప్రతినిధులు జాయ్ మనోరమ, సైమన్ పీటర్, హైజక్ బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు సంతోష్, అశోక్ యాదవ్, ప్రవీణ్ రెడ్డి, కూతురు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అమీర్‌పేట ఎలక్ట్రికల్ డివిజన్ ఆఫీసులో కన్స్యూమర్స్ డే వేడుకలు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఎల్లారెడ్డిగూడలో గల అమీర్పేట ఎలక్ట్రికల్ సబ్ డివిజన్ ఆఫీసులో వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కరెంటు బిల్లు, మీటర్ రీడింగ్‌పై వినియోగదారులు అడిగిన అనేక ప్రశ్నలకు ఏడీఈ ప్రేమ్ కుమార్ వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిగూడ ఏఈ ఆపరేషన్ సాంబశివరావు, యూసుఫ్ గూడా ఏఈ ఆపరేషన్ జాన్ పీటర్, శ్రీకృష్ణ నగర్ ఏఈ ఆపరేషన్ తిరుపతి రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడీఈ ప్రేమ్ కుమార్ వినియోగదారులతో మాట్లాడుతూ విద్యుత్ వాడకంలో అనేక జాగ్రత్తలు తీసుకోవాలని, కరెంటు బిల్లులు ఎక్కువ వచ్చినప్పుడు మీకు ఏదైనా అనుమానం ఉంటే, బిల్లు తీసుకొని ఎల్లారెడ్డి గూడలోని మా ఆఫీసుకు వచ్చి పరిశీలించుకోవచ్చునన్నారు.

హైదరాబాద్ దిశ కమిటీ సభ్యురాలిగా శారద మల్లేష్



నవతెలంగాణ-ఓయూ

హైదరాబాద్ జిల్లా దిశ కమిటీ సభ్యురాలు బీజేపీ సికింద్రాబాద్ సీనియర్ నాయకులు రాలు శ్రీమతి శారద మల్లేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె ఆదివారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసి తనకు దిశ కమిటీలో అవకాశం కల్పించినందుకు కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. శారద మల్లేష్ ప్రస్తుతానికి బీజేపీ మహంకాళి జిల్లా అధికార ప్రతినిధిగా గతంలో బీజేపీరాష్ట్ర మహిళ మోర్చ కార్యవర్గ సభ్యురాలిగా పనిచేశారు. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మెట్టుగూడ డివిజన్ కార్పోరేటర్‌గా పోటీ చేశారు. దిశ కమిటీ నియమ నిబంధనలను అనుగుణంగా పని చేస్తానని శారద మల్లేష్ అన్నారు. కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నేత మల్లేష్ పాల్గొన్నారు.

బాధ్యతరహితానికి భారీ మూల్యం

నవతెలంగాణ-బంజారాహిల్స్



సమాజంలోని అన్ని రకాల బాధ్యతలను సక్రమంగా అమలు చేయడానికి ఏర్పరచుకున్న న్యాయస్థానం సముచితమైన తీర్పుతో జవాబుదారీగా వ్యవహరిస్తున్న తీరు అద్భుతం.. ప్రతి ఒక్కరికి ఆమోదయోగమైన తీర్పునిచ్చి పోలీసుల పని తీరుకు నిదర్శనంగా నిలిచింది. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో కొన్ని రోజులు క్రితం యువ వ్యాపార వేత్త, స్టాండప్ కమెడియన్ ఉత్సవ్ దీక్షత్ చేసిన బాధ్యతరహిత రాష్ డ్రైవింగ్‌కు కోర్టు 1988 మోటార్ యాక్ట్, బీఎన్ఎస్ సెక్షన్ 110, 281 బీఎన్ఎస్ సెక్షన్ 184 ఆఫ్ ఎంవీ యాక్టు, సెక్షన్ 3, క్రింద కేసు నమోదు చేసి అతని లైసెన్స్‌ను రద్దు చేశారు. వివరాల్లోకి వెళ్తే శుక్రవారం ఉదయం జూబ్లీహిల్స్ నుండి బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి సమీపంలోని గోడను ఢీ కొట్టడంతో పాటు చెట్టును ఢీకొని ఆగింది. పోర్షే టీఎస్ 10ఎఫ్‌హెచ్0900 నెంబర్ కారు నెంబర్ ప్లేట్లను సైతం వాడకుండా కారులోనే వాటిని దాచి పారిపోయేందుకు ప్రయత్నించిన అతన్ని సమీపంలోని కొందరు 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పట్టుబడి పోలీసులు దర్యాప్తుతో కోర్టు శిక్షించడం జరిగింది.



అడిషనల్ డీసీపీ నరసయ్యని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన సీనియర్ నాయకులు ధాత్రిక్ నాగేందర్ బాబ్జి,మదన్ యాదవ్, రమేష్, రాజు, హేమంత్, రాజ్ కుమార్, విష్ణు, శ్రీనివాస్, నిమ్మర్ తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-అంబర్‌పేట

'కులగణన'కు రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలి

- వ్యతిరేకించే పార్టీలకు రాజకీయ సమాధి తప్పదు
- బీసీ కుల సంఘాల జేఏసీ



నవతెలంగాణ-బంజారాహిల్స్

కులగణనను ఎవరు అడ్డుకున్న బీసీలు వాళ్ల భారతం పడతారని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమయ్యే కులగణనకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించి కులగణనలో భాగస్వామ్యం కావాలని భాగస్వామ్యం కాని పార్టీలను బీసీ ద్రోహులుగా ప్రకటించి వారిని రాజకీయ సమాధి చేయడానికి బీసీలు సిద్ధంగా ఉన్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఈనెల 6 తేదీ నుండి 20వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరిగే కులగణన చైతన్య సదస్సుల వాల్ పోస్టర్‌ను ఇతర బీసీ సంఘాల నేతలు కుందారం గణేష్ చారితో కలిసి జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన తర్వాత మొదటిసారి తెలంగాణ రాష్ట్రంలో చారిత్రాత్మకంగా సమగ్ర కులగణన జరుగుతున్న దృశ్య కాంగ్రెస్ పార్టీ లాగే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కూడా కులగణనకు బేషరత్తుగా మద్దతు ప్రకటించి రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి సమావేశాలు ఏర్పాటు చేసి కులగణనలో ఆయా పార్టీల భాగస్వామ్యం కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కులగణన జీఓ విడుదలైన అప్పటి నుండి నేటి వరకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల అధ్యక్షులు కేసీఆర్, కిషన్ రెడ్డిలు కులగణనపై మాట్లాడకుండా ఎన్ని రోజులు మౌనం వహిస్తారని, కులగననకు అనుకూలమా? వ్యతిరేకమా? ఏదో ఒకటి తమ విధాన నిర్ణయాన్ని ఆయా పార్టీలు ఎందుకు ప్రకటించడం లేదని ఆయన ప్రశ్నించారు.

కులగణనలలో రాష్ట్రంలోని 136 బీసీ కుల సంఘాలను, మేధా వులను, విద్యార్థి, యువజన, మహిళల, ఉద్యోగులను ప్రతి ఒక్కరు భాగస్వామ్యం అయ్యేలా ఈనెల 6 తేదీ నుండి 20వ తేదీ వరకు 15 రోజుల పాటు అలంపూర్ నుండి ఆదిలాబాద్ వరకు కులగణన చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నామని, ఈ చైతన్య సదస్సులలో లక్షలాది మందిని భాగస్వామ్యం చేసి బీసీ కులాలకు కులగణన పట్ల పూర్తి అవగాహన కల్పిస్తామన్నారు. బీసీ కులాల అస్తిత్వాన్ని, ఐక్యతను, ముందుకు తీసుకుపోతామని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రశ్నావళిలో బీసీలకు కొన్ని సందేహాలు ఉన్నాయని, కుల సంఘాలు, మేధావులు లేవనెత్తుతున్న కొన్ని ప్రశ్నలకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలన్నారు. కులగణనపై ప్రత్యేకంగా ఒక నోడల్ ఏజెన్సీని నియమించాలని, రాష్ట్ర సచివాలయంలో రాష్ట్రవ్యాప్తంగా కుల గణనపై వచ్చే సందేహాలకు టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేయాలని ప్రజల్లో విస్తృతమైన అవగాహన, ప్రచారం కల్పించాలని ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కులగణన ప్రక్రియ పూర్తి జరిగే వరకు తెలంగాణ వ్యాప్తంగా బీసీ సంఘాలు, కుల సంఘాలు, ఉద్యోగులు, మేధావులు, విద్యార్థులు, యువజనులు, మహిళలు, అప్రమత్తంగా ఉండాలని కులగణన జరిగి బీసీ రిజర్వేషన్లు పెంచే వరకు బీసీల పోరాటం కొనసాగుతూనే ఉంటుందన్నారు. కులగణన పటిష్టంగా, శాస్త్రీయంగా, ఎలాంటి వివాదాలకు తావు లేకుండా జరగడానికి సామాజిక నిష్ణాతులతో, న్యాయ పరిజ్ఞానం ఉన్న రిటైర్డ్ జడ్జీలు, రిటైర్డ్ ఐఏఎస్‌లు, ప్రొఫెసర్లు, మేధావులతో రాష్ట్ర ప్రభుత్వం ఒక సలహా మండలిని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బాలగాని బాలరాజ్ గౌడ్, కూల్యచర్ల శ్రీనివాస్ తదతరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్‌గా బొమ్మెర స్టాలిన్

నవతెలంగాణ-ఓయూ



తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్‌గా డాక్టర్ బొమ్మెర స్టాలిన్‌ని నియమిస్తూ తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బొమ్మెర స్టాలిన్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఈ పదవి అప్పగించిన విద్యార్థి ఉద్యమ రథసారథి తెలంగాణ విద్యార్థి జేఏసీ మాజీ చైర్మెన్ డాక్టర్ పిడమర్తి రవికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమం చేసిన ఉద్యమకారులందరికీ 250 గజాల ఇంటి స్థలం సాధన కోసం ఉద్యమకారులకు ప్రభుత్వం అనేక అంశాలను దృష్టిలో పెట్టుకునే పని చేస్తానన్నారు.

వ్యక్తి అదృశ్యం

నవతెలంగాణ-ముషీరాబాద్



మద్యానికి బానిసైన వ్యక్తి అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏ.ఆనంద్‌రావు అనే వ్యక్తి నల్లకుంటలోని నరసింహ బస్తీలో భార్యా తన కూతురుతో కలిసి నివాసం ఉంటున్నారు. ఐబిటీసీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. మద్యానికి అలవాటు పడి ఆనందరావు తరచూ మద్యం సేవిస్తూ ఇంట్లో ఉన్న సామాగ్రిని సైతం అమ్మడం మొదలుపెట్టాడు. మద్యం మత్తులో ఆరు నుంచి పది రోజుల వరకు ఉద్యోగానికి వెళ్లకుండా ఇంట్లోనే ఉండేవాడు. గతంలో మద్యం సేవిస్తూ రెండు నుంచి మూడు రోజుల వరకు ఇంటికి రాకుండా ఉండే వాడు. అదేవిధంగా గత నెల 28న ఇంట్లో నుంచి బయటికి వెళ్లి ఐదు రోజులు గడిచిన ఇంతవరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వాళ్లను బంధువులను ఆరా తీసిన ఎటువంటి ప్రయోజనం లేకపోవడంతో స్థానిక నల్లకుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ప్రభుత్వ విద్య బలోపేతం కోసం కృషి చేస్తా

- తెలంగాణ విద్యా కమిషన్ సలహాదారులు ఆర్.వెంకట్ రెడ్డి



నవతెలంగాణ-ఓయూ

ప్రభుత్వాలు నాణ్యమైన విద్య అందించడం ద్వారానే సమాజంలోని పేదరికం, నిరుద్యోగం, అసమానతలు నిర్మూలించబడతాయని ప్రభుత్వ విద్య బలోపేతం కోసం మరింత కృషి చేస్తానని తెలంగాణ విద్యా కమిషన్ సలహాదారులు ఆర్.వెంకట్ రెడ్డి అన్నారు. చిలకలగూడ దూద్ బావి కమిటీ హాల్‌లో సీపీఐ ఆధ్వర్యంలో కొమురెల్లి బాబు అధ్యక్షతన 'పేదరిక నిర్మూలనలో ప్రభుత్వ విద్య పాత్ర' అనే అంశంపై ఏర్పాటుచేసిన సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద వర్గాల ప్రజలకు నాణ్యమైన విద్య అందినప్పుడే పేదరికం నిర్మూలన జరుగుతుందని, సామాజిక రుగ్మతలు, అసమానతలు తొలగిపోతాయన్నారు. ప్రభుత్వ విద్య బలోపేతం కోసం సలహాలు, సూచనలు చేస్తూ ప్రభుత్వ విద్య బలోపేతం కొరకు కృషి చేస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గాజుల శ్రీధర్ మాట్లాడుతూ విద్య ద్వారానే మెరుగైన సమాజం నిర్మించబడుతుందని నాణ్యమైన విద్య అందించినప్పుడే నాణ్యమైన సమాజం నిర్మించబడుతుందన్నారు. ప్రభుత్వ విద్య పరిరక్షణకై రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. నాణ్యమైన విద్యను అందించినప్పుడే సమాజంలోని సకల సమస్యలను పరిష్కరించబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్, సీఆర్‌పీఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మీనారాయణ ,తల్లుల సంఘం రాష్ట్ర కార్యదర్శి భాగ్యలక్ష్మి, మల్లికార్జున్ రెడ్డి, రామలీల, ప్రవీణ్ కుమార్ , జోగు రాములు, బాలమణి, లక్ష్మి, పద్మ, శ్రీహరి, కళ్యాణ్, రాజ్ కుమార్, ప్రవీణ్, యాదగిరి, ప్రసంగి, రవికాంత్,పాల్గొన్నారు.

సదర్ ఉత్సవాలకు రాష్ట్ర పండుగ హెూదా పట్ల హర్షం

- యాదవ సంఘం (జాంబాగ్) ట్రస్టుసభ్యులు వి.కిషన్ యాదవ్



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

దీపావళి పండుగ అనంతరం జంట నగరాల్లో యాదవ సోదరులు అత్యంత ఘనంగా నిర్వహించుకునే సదర్ ఉత్సవాలకు తెలంగాణ రాష్ట్ర పండుగ హెూదా కల్పించడం పట్ల గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం (జాంబాగ్) ట్రస్టు సభ్యులు వుష్కెల కిషన్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. జంట నగరాల్లో యాదవులు వైభవోపేతంగా జరుపుకునే సదర్ ఉత్సవాలకు గుర్తింపు కల్పించేలా రాష్ట్ర పండుగ హెూదా కల్పించి యాదవ సోదరుల గౌరవాన్ని పెంపొందించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి యాదవ సంఘం పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతీయేటా దీపావళి పండుగ అనంతరం యాద వుల సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతి బింబించేలా యాదవుల ధూమ్ ధామ్.. సదర్ సమ్మేళన కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో పాటు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసి రాష్ట్ర పండుగ హెూదాను కల్పించి యాదవుల మనోభావాలకు, ఆత్మ గౌరవానికి పెద్దపీఠ వేసిన తెలంగాణ ప్రభు త్వానికి యాదవులంతా రుణపడి ఉంటార న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో యాదవులకు తగిన ప్రాతిని ధ్యం కల్పించి యాదవుల సంక్షేమాభివృద్ధికి చొరవ చూపడంతో పాటు సదర్ ఉత్సవాలకు రాష్ట్ర పండుగ హెూదా కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, సదర్ ఉత్సవాలకు రాష్ట్ర పండుగ హెూదా కల్పించేందుకు పెద్దన్న పాత్ర పోషించిన మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, అందు కోసం సహకరించిన రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్‌కు గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం (జాంబాగ్) చైర్మెన్ నందకిశోర్ యాదవ్ అధ్యక్షులు బోయిని వెంకటేష్ యాదవ్, ట్రస్టు సభ్యులు వి.కిషన్ యాదవ్, మనీష్ యాదవ్, శైలేందర్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ శాసనసభ్యులు హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపినాథ్ క్యాంపు కార్యాలయంలో కలిసి ఆదివారం వెంగల్ రావు డివిజన్ నాయకులు దీపావళి శుభాకాంక్షలు తెలిజేయశారు. ఈ కార్యక్రమంలో వెంగల్ రావు డివిజన్ కార్పొరేటర్ దేదీప్యా రావు, విజయ్, వేణు, శ్యామ్ రావు, ఆంజనేయులు, తదితరులు

యూసుఫ్ గూడా కార్పొరేటర్ రాజకుమార్ పటేల్, డివిజన్ అధ్యక్షుడు సంతోష్ ముదిరాజ్, జనరల్ సెక్రెటరీ నర్సింగ్ దాస్, బసవరాజు, వేణుగోపాల్, నాగరాజు తదితరులు కలిసి ఎమ్మెల్యేకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

ఎల్లారెడ్డి గూడ హరిజన బస్తీ నూతన కమిటీ ఏర్పాటు

- ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన కమిటీ సభ్యులు

నవతెలంగాణ-జూబ్లీహిల్స్



జూబ్లీహిల్స్ శాసనసభ్యులు హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపినాథ్ క్యాంపు కార్యాల యంలో శ్రీనగర్ కాలనీ డివిజన్ ఎల్లా రెడ్డిగూడ హరిజన బస్తీలో నూతనంగా ఎన్నికైన కమిటీ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ కొమ్ము భిక్షపతి, శ్రీ నల్ల పోచమ్మ దేవాలయం చైర్మెన్‌గా నియమితు లైన కొమ్ము చిన్న బాబు, కార్యవర్గ సభ్యులు, సాగర్, గాంధీ, గోవర్ధన్, కపిల్, చంద్రశేఖర్, జహీర్, కలిమ్, అవినాష్, పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత

నవతెలంగాణ-బేగంపేట్



మేధాశక్తిని పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని యూసి మాస్ సంస్థ చేపట్టిన గణితశాస్త్రంలో పిల్లలు ఎంతో ప్రతిభ కనబరిచారని మాజీ మంత్రి మరి శశిధర్ రెడ్డి అన్నారు. ఆదివారం హర్యానా భవన్‌లో ఏర్పాటు చేసిన యుసి మాస్ ఎడ్యుకేషన్ వారు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దేశం గర్వపడేలా చిన్నారులు ముందుకు వెళ్తున్నారని వారు ఇలాగే మరిన్ని విజయాలు సాధించాలని వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రం నుండి వివిధ 80 సెంటర్ల నుండి వచ్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. వివిధ సెంటర్ల నుండి 1200 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. గణిత శాస్త్రంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ మెహర పాల్గొన్నారు.

హబ్సిగూడ మలబార్ షో రూమ్‌లో 'మైన్ డైమండ్' షో



నవతెలంగాణ- ఓయూ

హబ్సిగూడ మలబార్ షో రూమ్‌లో నవంబర్ 2 నుండి 7 వరకు మైన్ డైమండ్ షో నిర్వహించనున్నారు. పలువురు కస్టమర్స్ మైన్ డైమండ్ షోను ప్రారంభించారు. ప్రపంచంలోనే అతి పెద్ద జ్యూవెలరీ సంస్థ ఒకటైన మలబార్ గోల్డ్, డైమండ్స్ తమ హబ్సిగూడ షోరూంలో"మైన్ డైమండ్స్' షోని ప్రారంభించింది. మలబార్ గోల్డ్, డైమండ్స్ అతి వేగంగా పెరుగుతున్న నమ్మకమైన జ్యూవెలరీ బ్రాండ్ మలబార్ గ్రూప్ సంబంధించిన మూలమైన సంస్థ. ఈ సంస్థ తమ హబ్సిగూడ షోరూంలో ప్రత్యేక వజ్రాభరణాల ప్రదర్శనను ఈ డైమండ్ షోని ముఖ్య అతిథులుగా డైమండ్స్ ప్రతినిధుల సమక్షంలో ప్రారంభించారు. వినియోగదారులు, శ్రేయోభిలాషులు, మలబార్ గోల్డ్ ఈ డైమండ్ షోలో రోజూ ధరించే నగలు, వివాహ ఆభరణాలు, లైట్ వెయిట్ ఆభరణాలు, పురుషుల ఆభరణాలు, ప్లాటినం ఆభరణాల సముదాయాన్ని అందిస్తున్నారు. మీకు నచ్చి సొంతం చేసుకొనే విధంగా కేవలం మలబార్ గోల్డ్ డైమండ్స్ హబ్సిగూడ షోరూంలో నేటి నుండి నవంబర్ 7 వరకు ఈ డైమండ్ షో కొనసాగుతుందని షోరూం హెడ్ మొహమ్మద్ అహమ్మెద్ సోఫీ తెలియజేశారు. వినియోగదారులు కొనుగోలు చేయాలనుకున్న బంగారం విలువలో 10శాతం ముందుగా చెల్లించి అడ్వాన్స్ బుకింగ్ సదుపాయాన్ని పొందవచ్చునని తెలిపారు. మలబార్ గోల్డ్, డైమండ్స్ నిబద్ధతలో భాగంగా, తమ వినియోగదారులకు 11 న్యాయమైన వాగ్దానాలను అందిస్తుంది. ఖచ్చితమైన తయారీ ధర, రాళ్ల బరువు, నికర బరువు, ఆభరణాల రాళ్ల విలువతో కూడిన పారదర్శక ధరల పట్టి, ఆభరణాలకు జీవితకాల ఉచిత నిర్వహణ, పాత బంగారు ఆభరణాలను తిరిగి విక్రయించేటప్పుడు బంగారం వజ్రాలపై 100 శాతం విలువ. నూరు శాతం బీఐఎస్ హాల్ మార్కుతో ధృవీకరించబడిన స్వచ్ఛమైన హెచ్‌యుఐడీ బంగారం, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా 28 పాయింట్ల నాణ్యత పరీక్షలు నిర్వహించిన ఐజీఐ, జీఐఎ ధృవీకరించిన వజ్రాభరణాలు, బైబ్యాక్ గ్యారెంటీ, నాణ్యతను తనిఖీ చేయడానికి క్యారెట్ ఎనలైజర్, జీవితకాల నిర్వహణ, బాధ్యతాయుతమైన మూలాల నుండి బంగారం సేకరణ వంటి వాగ్దానాలను అందిస్తుందని తెలిపారు. మలబార్ గోల్డ్, డైమండ్స్ ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అతిపెద్ద జ్యూవెలరీ రిటైలర్లలో 6వ స్థానంలో నిలిచింది. డెలాయిట్ యొక్క గ్లోబల్ పవర్స్ ఆఫ్ లగ్జరీ గూడ్స్ 2023 ర్యాంకింగ్‌లో 19వ స్థానం కైవసం చేసుకుంది.

మ్యారేజ్ బ్యూరో ముసుగులో వ్యభిచారం..

నవతెలంగాణ-బంజారా హిల్స్

పెళ్లి సంబంధాలు చూస్తామని కార్యాలయం ఏర్పాటు చేసి అందులో తగిన లాభాలు రావడం లేదని దురుబుద్ధితో అత్యాశతో వ్యభిచార గృహాన్ని కొనసాగించిన ఓ మహిళ శనివారం పోలీసులకు పట్టుబడింది. సెంట్రల్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు పక్కా సమాచారంతో షాదన్ కాలేజ్ ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న ఈ ఘటన విషయాన్ని తెలుసుకుని దాడులు నిర్వహించగా ఓ నిర్వాహకురాలు నలుగురు విటులు, వివిధ రాష్ట్రాలకు చెందిన మరో నలుగురు యువతులనూ అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకుని యువతులను స్టేట్ హెూంకు తరలించి విటులను కోర్టుకు హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

తంగడపల్లిలో వైద్య శిబిరం



నవతెలంగాణ-చేవెళ్ల

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవా లని తంగడపల్లి గ్రామ మాజీ సర్పంచ్ అనూష సత్యనా రాయణ అన్నారు. ఆదివారం చేవెళ్ల మండల పరిధిలోని తంగడపల్లి గ్రామంలో శ్రీ సత్య సాయి సేవ సమితి శివం వారి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వై ద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన వచ్చిం ది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ... వైద్య శిబిరంలో బ్లడ్ టెస్ట్ బీపీ షుగర్ టెస్టులు చేశామని అన్నా రు. టెస్టులు నిర్వహించి, ఉచిత మందులు పంపిణీ చేశా మన్నారు. మాజీ సర్పంచ్ అనూషసత్తయ్య మాట్లాడుతూ... ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం పట్ల సత్య సాయి సేవ సమితి వారికి అభినందనలు తెలిపారు. తం గడపల్లి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించడం సంతో షంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, శ్రీ సత్య సాయి సేవ సమితి సభ్యులు, గ్రామస్తులు , తదితరులు పాల్గొన్నారు.



పలు శుభకార్యాల్లో పాల్గొన్న మాజీ జడ్పీటీసీ



నవతెలంగాణ-తాండూరు

తాండూరు నియోజకవర్గంలో ఆదివారం జరిగిన పలు శుభకార్యాలలో మాజీ జడ్పీటీసీ ప్ర మోదినిరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. నిండు నూరేళ్ళు సుఖసంతోషాలతో ఉండాలని దీవించారు. అలా గే తాండూరు మండలం అల్లాపూర్ గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ప్రతాప్‌రెడ్డి సతీమణి మృతి చెందగా ఆమె మృతదేహాన్ని సందర్శించి వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తాండూరు నియో జకవర్గంలోని వివిధ మండలాల నాయకులు, పాల్గొన్నారు.

ఘనంగా విద్యుత్ వినియోగదారుల దినోత్సవం



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ స్థాపనకు గుర్తుగా, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని అన్ని కార్యాలయాల్లో ఆదివారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మింట్ కాంపౌండ్, మెట్రో జోన్ కార్యాలయంలో సంస్థ డైరెక్టర్లు, ఇతర ఉన్నత అధికారుల సమక్షంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వినియోగదారులు, వివిధ సంఘాల నాయకులు పలు సూచనలు, సలహాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను సంస్థ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌చార్జి డైరెక్టర్లు, చీఫ్ ఇంజినీర్లు మాట్లాడుతూ.. తమ సంస్థలోని ఆర్టీజన్ నుంచి సీఎండీ వరకు వినియోగదారులకు నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్ కల్పనే లక్ష్యంగా సేవలందిస్తున్నారన్నారు. విని యోగదారులకు నాణ్యమైన సేవల కల్పనకు సంస్థ పరిధిలో చేపట్టే దైనందిన వ్యవహారాల్లో అధునాతన సాంకేతికతను పొందుపరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా వినియోగదారులకు గల హక్కులు, వారి సమస్యల పరిష్కారం కోసం ఉన్న ప్రత్యామ్నాయ వేదికల గురించి మెట్రో జోన్ చీఫ్ ఇంజినీర్ చక్రపాణి వివరించారు.

ఈ కార్యక్రమంలో సంస్థ ఇన్‌చార్జి డైరెక్టర్లు నందకుమార్, డాక్టర్ నర్సింహులు, చీఫ్ ఇంజినీ ర్లు సాయిబాబా, చక్రపాణి, సీజీఆర్ఎఫ్ ఇండిపెండెంట్ మెంబర్ వెంకట్, సూపరింటెండెంటింగ్ ఇంజినీర్లు వెంకన్న, కరుణాకర్, గోపయ్య, సోమిరెడ్డి, దిలీప్ కుమార్, ఇతర డివిజనల్ ఇంజినీర్లు, అధికారులు పాల్గొన్నారు.



పంచవటి కాలనీ ప్రధాన రహదారికి మరమ్మతులు

- మణికొండ వైస్ చైర్మెన్ నరేందర్‌రెడ్డి



నవతెలంగాణ-గండిపేట్

మణికొండ మున్సిపాలిటీ పంచవటి కాలనీలోని ప్రధాన రహదారిపై గుంతలకు మరమ్మతులు చేపడుతున్నట్టు మున్సిపల్ వైస్ చైర్మెన్ కొండకళ్ళ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన రహదారిలో నిత్యం రాకపో కలకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలతో రోడ్లపై గుం తలు ఏర్పడినట్టు తెలిపారు. గుంతలను పూడ్చినట్టు చెప్పారు. ఈ కార్యక్ర మంలో కాలనీవాసులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ మెంబర్ ఆనంద్ సాయికి సన్మానం



నవతెలంగాణ-గండిపేట్

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సభ్యుడిగా నియమితులైన సినీ ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయిని కౌన్సిలర్ కే.రామకృష్ణారెడ్డి ఘనంగా సన్మానిం చారు. మణికొండ మున్సిపాలిటీలో నివాసముంటున్న ఆనంద్ సాయిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సం దర్భంగా ఆర్కే మాట్లాడుతూ ఆనంద్ సాయి చేసిన సేవలను గుర్తిస్తూ తిరు మల తిరుపతి దేవస్థానం సభ్యుడుగా నియమించినందుకు సంతోషంగా ఉం దన్నారు. యాదాద్రి (యాదగిరిగుట్ట) పునర్ నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించినట్టు తెలిపారు. ఆయన సేవలను గుర్తించి టీటీడీ సభ్యుడిగా నియ మించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయు లు, గంగాధర్, ఏర్పుల కుమారు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ శేరిలింగంపల్లి అధ్యక్షులుగా మాసూర్ నాగరాజు



నవతెలంగాణ-శేరిలింగంపల్లి

బీఎస్పీ శేరిలింగంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడిగా మసూర్ నాగరాజును నియమించారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పల్లాటి రాములు నాగరాజుకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండేల ధర్మేందర్, రాష్ట్ర కార్యదర్శి గ్యార జగన్, జిల్లా కార్యదర్శి బచ్చిగళ్ళ నితిన్, కిషోర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత





నవతెలంగాణ-తలకొండపల్లి

మండల పరిధిలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన ఎరుకలి జంగమ్మ మృతిచెందగా.. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి రూ.3వేల ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దాసరి కిష్టమ్మ, మాజీ ఎంపీటీసీ దాసరి యాదయ్య మాజీవార్డ్ మెంబర్ నరసింహ, నరసింహ, రాములు పాల్గొన్నారు.

పడకల్ గ్రామానికి చెందిన బయ్యా చేన్నమ్మ మృతిచెందడంతో బాధిత కుటుంబానికి మాజీ జడ్పీటీసీ, ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మెన్ ఉప్పల వెంకటేశ్ రూ.3వేల ఆర్థిక సాయం చేశారు. అలాగే బీజేపీ నాయకులు తల్లోజు ఆచారి సహకారంతో ఆచారి సేవా కమిటి నాయకులు రూ.3400 ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, పాండు, డాక్టర్ నరసింహ, విజయ్‌కుమార్, కృష్ణయ్య, జంగయ్య పాల్గొన్నారు.

గృహప్రవేశంలో పాల్గొన్న
బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి



నవతెలంగాణ-ధారూర్

మండలంలోని ఎబ్బనూర్ గ్రామ పార్టీ నాయకులు కురువా ప్రశాంత్ నూతన గృహ ప్రవేశ కార్యక్ర మానికి బీఆర్ఎస్ ధరూర్ మండల అధ్యక్షుడు పట్లోళ్ల శ్రీకాంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ సంతోష్‌కుమార్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు దేవేందర్, వెంకట రామ్‌రెడ్డి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అనాథ, నిరాశ్రయులకు దుస్తులు, ఔషధాలు పంపిణి



నవతెలంగాణ-ముషీరాబాద్

హైదరాబాద్ నగరంలో రోడ్ల పక్కన ఫుట్ పాత్ జీవనాధారంగా దయనీయస్థితులలో జీవనం సాగిసున్న అనాథలు, అభాగ్యులు, నిరుపేదలకు దుస్తుల పంపిణీ చేసి వివిధ రుగ్మతలతో బాధపడు తున్న వారిని గుర్తించి ఔషధాలను స్కై ఫౌండేషన్ సభ్యులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ డాక్టర్ వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ.పావని పాల్గొన్నారు.

రాంనగర్ చౌరస్తాలో ఘనంగా సదర్ వేడుకలు



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గం రాంనగర్ చౌరస్తాలో యాదవ సమాజం సదర్ సమ్మేళనం ఘనం గా నిర్వహించారు. మరావోని విజయ్ యాదవ్, సలంద్రి వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదర్ సమ్మేళనానికి రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దున్నలకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. వేదిక పై యాదవుల పాటలకు ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహా, బీజేపీ నాయకుడు పూసరాజు, యూత్ కాంగ్రెస్ నాయకుడు అరవింద్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నవీన్ యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షులు చింతల రవీందర్ యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ యువ అధ్యక్షులు యశ్వంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు ఉపాధ్యాయులు రెడీ!

- కుల గణన సర్వేలో జిల్లా నుంచి 2వేలకుపైగా టీచర్లు
- మండలాల వారీగా ఉపాధ్యాయులకు శిక్షణ
- మూడు వారాల పాటు కొనసాగనున్న సర్వే
- సర్వే రోజుల్లో ఒంటిపూట బడులు..!





నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 6 నుంచి నిర్వహించ తలపెట్టనున్న కులగణన సర్వేకు ఉపాధ్యాయులను జిల్లా అధికారులు సమయాత్తం చేస్తున్నారు. ఈ కులగణన సర్వేకు జిల్లా నుంచి 2,278 మంది ఎస్జీటీలు, పీఎస్‌హెచ్ఎంలు పాల్గొనన్నారు. మొత్తం మూడు వారాల పాటు ఈ సర్వే జరగనుంది. జిల్లా కలెక్టర్ నుంచి ఇప్పటికే వెళ్లిన ఉపాధ్యాయుల జాబితా ఆధారంగా జీహెచ్ఎంసీ నేతృత్వం లో వారికి పకడ్బందీగా శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇప్పటికే కొన్ని మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు ట్రైనింగ్ పూర్తి చేయగా.. నేడు మరో కొన్ని మండలాలకు చెందిన టీచర్లకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ నెల 5వ తేదీలోపు అన్ని శిక్షణ కార్యక్రమాలు పూర్తిచేసి.. 6వ తేదీ నుంచి 20రోజుల పాటు కులగణన సర్వేలో పాల్గొనేలా వీరికి సర్వేపై తర్ఫీదు ఇస్తారు.

జిల్లావ్యాప్తంగా 691 ప్రభుత్వ పాఠశాలు ఉండగా.. వీటిలో 493 ప్రాథమిక పాఠశాల నుంచి దాదాపు 2,278 మంది ఎస్జీటీలు, పీఎస్‌హెచ్ఎంలు కులగణన సర్వేలో పాల్గొంటారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక పాఠశాలలకు చెందిన ఎస్జీటీలు, పీఎస్‌హెచ్ ఎంలను ఈ సర్వేలో భాగస్వామ్యం చేసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో 6వ తేదీ నుంచి 20 రోజుల పాటు జరిగే సర్వేతో ప్రాథమిక బడులు సగం పూటే నడవనున్నాయి. మరో సగం పూట బడులకు తాళం పడనుంది. ఈ లెక్కన ప్రాథమిక పాఠశాలలకు ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు నిర్వహిస్తారు. మధ్యాహ్న భోజనం అనంతరం టీచర్లు సర్వే బాట పడు తారు. ఫలితంగా పేద విద్యార్థుల చదువులకు ఆటంకం కలగనుందని ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ఇప్పటికే విద్యార్థులు, వారి తల్లిదండ్రు ల్లో ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం సన్నగిల్లుతుండ గా.. ప్రభుత్వ చర్యలతో ఇది మరింత పెరిగే అవకాశం లేకపో లేదని విమర్శలు వినవస్తున్నాయి. దీనికితోడు ప్రాథమిక తరగతుల్లో చదివే విద్యార్థుల సామర్థ్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇలాంటి ఆరోపణల నేపథ్యంలో ఎస్జీటీలను ఈ సేవలకు వినియోగించడంతో పేద పిల్లల చదువులు ఆగమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. అయితే ప్రభుత్వం ఇప్పటికైనా సర్వే వేళలను మార్చడంతో పాటు సగం మంది ఎస్జీటీలను సర్వేకు కేటాయించి.. మరో సగం మందిని బోధనకు వినియోగిం చుకుంటే విద్యార్థులకు మేలు జరుగుతుందని అంటున్నారు.

సమయం ఇలా.. సర్వే ఎలా..?

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే బాధ్యతను ప్రభుత్వ ఉపాధ్యాయులపై పెట్టింది. ఇంతవరకు బాగానే ఉంది. కానీ ఈ సర్వేపై రకరకాల అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో మెజార్టీ ప్రజలు ఏదో ఉద్యోగం, వ్యాపారం చేసుకునేవారే ఎక్కువ.. వీరంతా ఉదయం ఉద్యోగాలకు వెళ్తితే సాయంత్రం ఇండ్లకు చేరుకుంటారు. ఇందులోని ఎక్కువ మంది కుటుంబ పెద్దలు ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే అందుబాటులో ఉండే అవకాశం ఉంది. మరోవైపు ప్రభుత్వం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పాఠశాలల్లో విధులు నిర్వహించి.. ఆ తర్వాత సర్వే చేయమని టీచర్లకు చెబుతోంది. ఈ క్రమంలో కులగణన సర్వే సజావుగా.. సకాలంలో సాగుతుందా అనేది హాట్ టాపిక్‌గా మారింది. నగరంలో నెలకొన్న పరిస్థితుల ఆధారంగా సర్వే చేపడితేనే బాగుంటుందని మెజార్టీ వర్గాల నుంచి అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉదాహరణకు సర్వేను ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు.. సాయంత్రం 6 గంటల నుంచి 8 వరకు సర్వే చేపడితే బాగుంటుందని.. ఇలాయితే మెజార్టీ వర్గాలను తక్కువ సమయంలో చేరుకొవచ్చు. ఇక బోధనకు ఇబ్బందులు లేకుండా సగం మంది ఉపాధ్యాయులను సర్వేకు.. మిగతా వారిని పాఠశాలలకు పరిమితం చేయడం ద్వారా పిల్లల చదువులకు ఇబ్బంది ఉండదు. సర్వేలో టీచర్లందరినీ భాగస్వామ్యం చేయడంతో పాటు శని, ఆదివారాలతో పాటు సెలవు రోజుల్లోనూ సర్వే చేపట్టిన ఏ ఒక్కరికి ఇబ్బంది ఉండదు. ఇలా చేయడం ద్వారా ప్రభుత్వం అనుకున్న విధంగా కుల గణన సర్వే విజయవంతమయ్యే అవకాశం ఉంటుంది. దీనిపై ప్రభుత్వంతో పాటు విద్యాశాఖ ఉన్నతాధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటాయో వేచిచూడాలి.

కౌండిన్య మహారాజ్ జయంతి వేడుకలు నిర్వహించాలి

- జై గౌడ్ జాతీయ అధ్యక్షులు డా.వట్టికూటి రామారావు గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

కార్తీక మాస పర్వదినాన నిర్వహించబోవు శ్రీ కౌండిన్య మహారాజ్ జయంతి ఉత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని జై గౌడ్ ఉద్యమ నాయకులకు రాష్ట్ర వ్యాప్తంగా గౌడ సోదరులకు జై గౌడ్ ఉద్యమ జాతీయ అధ్యక్షుడు వట్టికూటి రామారావు గౌడ్ సూచించారు. ఈ మేరకు వీరన్న గుట ఎల్బీనగర్ జై గౌడ్, ఉద్యమ నాయకులు గట్టు నిరంజన్ గౌడ్, శ్రావణ్ గౌడ్, సురేష్ గౌడ్, సాయి జై గౌడ్ ఉద్యమ నాయకుడ్ని ఘనంగా సన్మానించారు. వారు చేస్తున్న కృషిని అభినందిస్తూ మరెన్నో జాతి ఉపయోగకర కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జై గౌడ్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వట్టికూటి రామారావు గౌడ్ మాట్లాడుతూ గౌడ జాతి సంపూర్ణ అభివృద్ధి కోసం కృషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జై గౌడ్ రాష్ట్ర యువజన నాయకులు బొమ్మగాని శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ ఇంద్రసేనారెడ్డి సేవలు చిరస్మరణీయం

- ప్రముఖ కవి కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాజలింగం



నవతెలంగాణ-అంబర్‌పేట

మాజీ ఎమ్మెల్సీ ఇంద్రసేనారెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రానికి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రముఖ కవి రాజలింగం అన్నారు. ఆదివారం నల్లకుంటలో ఇటీవల మరణించిన మాజీ ఎమ్మెల్సీ ఇంద్రసేనారెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరాగాంధీ నుంచి కాంగ్రెస్ పార్టీకి స్టూడెంట్ నుంచి కార్యకర్త నుంచి ఏఐసీసీ వరకు వరకు పార్టీ బలపడానికి అనేక రకాలుగా సేవలందించారని ఆయన లేని లోటు పూడ్చలేనిదని పార్టీ ఐక్యత కోసం నిరంతర కృషి చేశారని ఆయన ఆశయ సాధనాల కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అరుణమ్మ, డాక్టర్ వెంకటప్రసాదరెడ్డి, హరినాథ్ రెడ్డి, పద్మారెడ్డి, విజేతా రెడ్డి, సంజనరెడ్డి విజయమ్మ, గంగాధర్, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్ డివిజన్‌లో ఘనంగా సదర్ వేడుకలు



నవతెలంగాణ-ముషీరాబాద్

దీపావళి అనంతరం యాదవ సోదరులు ఘనంగా నిర్వహించే సదర్ పండుగను గాంధీనగర్ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పూస రాజు, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ ఈ వేడుకలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చ అసెంబ్లీ కన్వీనర్ ఎం.ఉమేష్,నాయకులు లక్ష్మణ్ యాదవ్,సాయి కుమార్, జ్ఞానేశ్వర్, ఆనంద్‌రావు, అభిషేక్, ధనరాజ్ తదితరులు హాజరైయ్యారు.

నూతన కార్యవర్గం ఎన్నిక..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ది జింజీర్, గార్లిక్, పొటాటో, మర్చంట్స్, అసోసి యేషన్, నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. ఈ మేరకు సిద్ది అంబర్ బజార్ వద్ద ఉన్న తారక్ హెూటల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి అఫ్జల్ గంజ్ ఎస్ఐ జగదీష్, బీజేవైఎం సెంట్రల్ జిల్లా సెక్రెటరీ దేవర వంశీలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా ఎం.నరేందర్ గుప్తా, ప్రధాన కార్యదర్శిగా సురేష్ జార్జ్, కోశాధికారిగా డి. శశికాంత్, ఉపాధ్యక్షులుగా డి.అనంతరం, కలీం, డి.శివకుమార్, జాయిన్ సెక్రటరీగా డి. గోపాల్ యాదవ్, గౌరవ సలహా దారులుగా క్యాథమ్ రాధాకృష్ణ, ప్రవీణ్ ఓరా, సి. పరమేశ్వర్, కార్యవర్గ సభ్యులుగా సైదా వలి, బి.మల్లేష్, ఏ శేషాద్రి గౌడ్, ఇర్షాద్, రితేష్ ఓజ, సచిన్(లాలా), జేమ్స్, మురళి, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నూతనంగా ఏర్పాటైన ఈ కమిటీ రెండు సంవత్సరాల పాటు కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఐ జగదీష్ మాట్లాడుతూ నూతన అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యాపారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం ఒక వేదిక ఏర్పాటైయిందన్నారు. ఎలాంటి గొడవలకు తావివ్వకుండా ఐకమత్యంతో వ్యాపారాలు చేసుకోవాలని సంఘం అభివృద్ధి కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దేవర వంశీ మాట్లాడుతూ అసోసియేషన్ గౌరవ సలహా దారుల సూచన మేరకు వ్యాపారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి వారికి అండగా నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉస్మాన్ గంజ్‌కి గానికి సంబంధించిన వ్యాపారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఏఐసీసీ సభ్యురాలు అంబికా సోని పరామర్శ

నవతెలంగాణ-అంబర్‌పేట

మాజీ ఎమ్మెల్సీ ఇంద్రసేన్‌రెడ్డి మరణ వార్త తెలుసుకున్న ఏఐసీసీ సభ్యురాలు అంబికా సోని ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. మృతుడి భార్య అరుణ ఇంద్రసేన్ రెడ్డి, కుమారుడు డాక్టర్ ఎస్. వెంకట ప్రసాద్ రెడ్డిలను వాట్సప్ ద్వారా పరామర్శిస్తూ మెస్సేజ్ పెట్టారు. ఇంద్రసేన్ మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు.

'రెండోవ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

గత 17 సంవత్సరాలుగా ఎన్‌హెచ్ఎంలో పని చేస్తున్న రెండోవ ఏఎన్ఎంల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి.యూసుఫ్ డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్ నగర్ లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఏఎన్ఎంల సమస్యల పరిష్కారానికై ఈ నెల 17న రంగారెడ్డి జిల్లా శంషాబాద్ లోని ఎలైట్ హెూటల్ నందు జరిగే రెండవ ఏఎన్ఎంల ప్రథమ మహా సభ వాల్ పోస్టర్‌ను ఎండి.యూసుఫ్, ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, రెండవ ఏఎన్ఎం సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు తోట రామాంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శ్యామల, ఆహ్వాన సంఘ అధ్యక్షులు పానుగంటి పర్వతాలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 17 సంవత్సరాలుగా నేషనల్ హెల్త్ మిషన్ నందు పని చేస్తున్న రెండవ ఏఎన్ఎంలు అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వృత్తి వివక్షతో పాటు మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వాలు మారుతున్నప్పుడు వీరి జీవితాలు మారడం లేదు కానీ కొత్త పథకాల రూపంలో వీరిపై పని ఒత్తిడి పెంచుతున్నారన్నారు. గత ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేస్తున్నప్పుడు తామంతా సంతోషించామని, కానీ కొర్రీలు పెట్టి కేవలం కొంత మందిని మాత్రమే రెగ్యులరైజేషన్ చేసి చేతులు దులుపుకున్నారని ఆయన విమర్శించారు. రెండవ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించి చివరకు నిరవధిక సమ్మె చేసిన ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించ లేదన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వారి సమస్యలపై పోరాటాలతో పాటు నేరుగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కలిసి సమస్యలను వివరించామన్నారు. రాబోయే రోజుల్లో రెగ్యులరైజేషన్ ఇతర సమస్యల పరిష్కరించుకోవడానికి కావాల్సిన ఉద్యమ కార్యచరణను రూపొందించుకోవడానికి మహా సభలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి రంగా రెడ్డి జిల్లా అధ్యక్షులు కె.రామస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యామల శేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షులు బాలరాజు, నరసింహ, యూనియన్ రాష్ట్ర కోశాధికారి జక్కుల పద్మ, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుఅరుణ, జి.సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

రెండు లక్షల ఉద్యోగాలు హామి ఏమైంది



- ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పివైఎల్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎస్ ప్రదీప్, వి. అజయ్

నవతెలంగాణ-ముషీరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామి ఇచ్చారు. ఆ హామి అమలు ఏమైందని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పివైఎల్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎస్ ప్రదీప్, వి. అజయ్‌లు ప్రశ్నించారు. ఆదివారం విద్యానగర్ లోని మార్క్స్ భవన్ లో పీవైఎల్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్ష కార్యదర్శులు కెఎస్ ప్రదీప్, అజయ్‌లు హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి 300 రోజులు పూర్తవుతున్నా 50 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని ఘనంగా చెప్పుకుంటున్నారని, కానీ భర్తీ చేస్తామన్న రెండు లక్షలు ఉద్యోగాలు హామీ ఏమైందని ప్రశ్నించారు. దీనితోపాటు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టి ఏడాది కావొస్తున్న, దాని ఊసే లేదన్నారు. ఉద్యోగ క్యాలెండర్ మాత్రమే ప్రకటన చేసి, భర్తీ చేయడం మరిచారన్నారు. నిరుద్యోగ భృతి పై దృష్టి సారించని ప్రభుత్వం, హడావుడిగా మూసి నదిపై వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయడం సిగ్గుచేటన్నారు. ఏది ప్రధానమైనదో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఆలోచించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కనీసం మందులు కూడా దొరకడం లేదన్నారు. రైల్వే శాఖలో లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నా, భర్తీ చేయడం లేదని, దాని ఫలితం వరుసగా జరుగుతున్న రైల్వే ప్రమాదాలే తార్కాణమన్నారు. నిరుద్యోగుల పట్ల పాలకుల నిర్లక్ష్య ధోరణిపై నిరుద్యోగ యువత ఉద్యమిం చాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పివైఎల్) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈశ్వర్, రాకేష్, సహాయ కార్యదర్శిలు రవికుమార్, ప్రతాప్, కోశాధికారి వాసం బుచ్చిరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు భూషణ వేణి కృష్ణ, పెండ్యాల రమేష్, కుర్సా రామకృష్ణ, నవీన్, హనీష్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి ఇంటింటా సమాచార సేకరణ

- తెలంగాణ బీసీ కమీషన్ చైర్మెన్ జి.నిరంజన్



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల 6 నుంచి బీసీలతో పాటు సమాజంలోని అన్ని వర్గాల వారి సమాచారాన్ని ఇంటింటికి వచ్చి ఎమినేటర్స్ సేకరిస్తారని తెలంగాణ బీసీ కమీషన్ చైర్మెన్ పి.నిరంజన్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జి. నిరంజన్ మాట్లాడుతూ మొత్తం జనాభాలో ఎవరి జనాభా ఎంత ఉంటుందో సమాచార సేకరణలో తెలిసిపోతుందని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందిరాగాంధీ హయాంలో ఈ బ్యాంకులను స్థాపించారని, అనేక బ్యాంకులను జాతీయం చేశారని గుర్తు చేశారు. కొన్ని కులాల జీవన విధానం గురించి చెబుతుంటే చాలా బాధ వేస్తుందన్నారు. ఏ జిల్లాకు వెళ్లినా తమిళనాడు తరహాలో చేయాలనే ప్రస్తావన వస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో మీరు చేస్తున్న సేవలు అభినందనీయమని మరింతగా ప్రజలకు సేవలు అందించేందుకు గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు కృషిచేయాలని కోరారు. గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సమస్యలను నా దృష్టికి తీసుకువస్తే సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏఐఆర్ఆర్బిఈఏ జనరల్ సెక్రెటరీ ఎస్ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ బ్యాంకుల్లో పనిచేస్తున్న ఓబీసీ ఉద్యోగుల ప్రమోషన్లు ట్రాన్స్‌ఫర్ల విషయంలో ప్రగతిని సాధించామని ఉద్యోగుల సమస్యలను మరింతగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్మెన్ వై. శోభ, ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మమ్మాయి మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి. కరుణానిధి, వెల్ఫేర్ అసోసియేషన్ వర్కింగ్ ప్రసిడెంట్ చిన్నయ్య, ప్రసిడెంట్ బి.రవికాంత్, టీఎస్ ఓబీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వి. దానకర్ణాచారి, జనరల్ మేనేజర్ టి. సుధాకర్, రిటైర్డ్ జీఎం పి. శ్రీనివాస్ గౌడ్, ఎస్బీఐ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె. రాజు తదితరులు పాల్గొన్నారు.

మెస్ చార్జీలు పెంచడంపై హర్షం

- బీసీ కాలేజీ గురుకుల హాస్టల్స్‌కు సొంత భవనాల నిర్మించాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-ముషీరాబాద్

మెస్ ఛార్జీలు పెంచినందుకు హర్షణీయమని అదే విధంగా బీసీ కాలేజీ గురుకుల హాస్టల్లకు సొంత భవనాలు నిర్మించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య కోరారు. ఆదివారం బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని బీసీ భవన్ లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆర్.కృష్ణయ్య, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ హాజరై మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టల్ విద్యార్థుల, గురుకుల విద్యార్థుల మెస్‌ఛార్జీలు పెంచినందుకు నగరంలోని కాలేజీ హాస్టల్ విద్యార్థులు ర్యాలీలు జరిపి సంబరాలు జరిపారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. నగరంలోని వివిధ బీసీ, ఎస్సీ కాలేజీ హాస్టల్ నుంచి విద్యార్థులు వందలాది విద్యార్థులు ర్యాలీగా బీసీ భవన్‌కు తరలివచ్చారు. గత నాలుగు సంవత్సరాలుగా ఇప్పటివరకు 390 సార్లు ధర్నాలు - ర్యాలీలు జరిపారు. ఇప్పుడు ప్రస్తుత ప్రభుత్వం దిగి మా ఉద్యమాలకు స్పందించి పెంచినందుకు రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్స్, గురుకుల పాఠశాల విద్యార్థుల మెస్ చార్జీలను పెంచినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలియ చేస్తున్నామన్నారు. ఈ పెంపుదల గతం కంటే మంచిగా ఉందన్నారు. గురుకులాలు, హాస్టల్స్‌లో చదువుకొని 7 లక్షల 65వల మంది విద్యార్థులకు ఈ పెంపుదల ప్రయోజనం చేకూర్చుతుందన్నారు. రాష్ట్రంలో 295 బీసీ కాలేజీ హాస్టల్స్‌కు, 321 బీసీ గురుకుల పాఠశాలలకు ఒకదానికి కూడా సొంత భవనాలు లేవు. కేటాయించిన ప్రభుత్వ స్థలాలను కూడా ప్రయివేటు సంస్థలకు, వ్యక్తులకు అధికారులు లంచాలు తిని దారదత్తం చేస్తున్నారు. దొరల కార్లు వెళ్లడానికి మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, కోకా పేట్‌లో ఫ్లై ఓవర్లు, స్కై ఓవర్స్ ను వేలకోట్ల రూపాయలతో వెచ్చించి కడుతున్నారు. కానీ చదువుకొని భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్‌లు, డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు కావాల్సిన విద్యార్థులను బందెల దొడ్డిలో పశువులను తొలినట్లు ఒక్కొక్క రూంలో 20 నుంచి 50 మందిని ఉంచుతున్నారు. సొంత భవనాలు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ విద్యార్థి అధ్యక్షులు వేముల రామకృష్ణ, విద్యార్థి నాయకులు కె. శివ, ఆర్. కవిత, బలరామ్, మల్లేశ్ , సిహెచ్ శ్రీనివాస్, నవీన్ కుమార్, వినయ్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

'రవాణా రంగ కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్న నాయకులు'

- తెలంగాణ ఆటో డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ గ్రేటర్ అధ్యక్షులు దయానంద్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

కొంత మంది యూనియన్ల నాయకులు నెలకోసారి కొత్త తరహా జేఏసీ నాయకులుగా చలామణి అవుతూ ఆటో, రవాణా రంగ కార్మికులను తప్పుదోవ పట్టిస్తూ, పూటకో వేషం కడుతూ ధర్నాలు, మహా ధర్నాలు అంటూ నాటకం ఆడుతున్నారని తెలంగాణ ఆటో డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టీయుసీ) గ్రేటర్ అధ్యక్షులు దయా నంద్ ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కొంత మంది వారి స్వార్థపూరితమైన స్వలాభం కోసం గతంలో వారు చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి ఊసరవెల్లి లాగా రంగులు మారుస్తున్నారని విమర్శించారు. గత పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆటో కార్మికులు, రవాణా రంగ కార్మికులు చనిపోయిన మాట్లాడని ఈ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంతో అనుబంధంగా కొనసాగుతున్న ఏఐటీయూసీ నాయకులు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆవాక్కులు చవాకులు పేలడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలి నాళ్ళలో అన్ని నేషనల్ ట్రేడ్ యూనియన్‌లను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చర్చలకు పిలిచి సమస్యలపై విధి విధానాలను తయారు చేయాలని సూచించారని గుర్తు చేశారు. కానీ జేఏసీ నాయకులు వారి ఉనికిని కాపాడుకోవడానికి కార్మికులను తప్పుదోవ పట్టిస్తూ ధర్నాలు, మహా ధర్నాల పేరిట నాటకం ఆడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆటో, రవాణా రంగ కార్మికులను చులకనగా చూడడమే కాకుండా వారిపై మోయలేని ఆర్టీఏ చార్జీలను పెంచి రవాణా రంగ కార్మికుల బతుకులు ఛిద్రం చేసిన బీఆర్ఎస్ నాయకులు నేడు ధర్నాల పేరిట ఈ రంగాన్ని మోసం చేయడానికి మన ముందుకు వస్తున్నారని, కార్మిక సోదరులు తస్మాత్ జాగ్రత్త ఇలాంటి నాయకులను ఈ వ్యవస్థ నుంచి తరిమికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

త్వరలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులను పూర్తి చేస్తా



- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

నవతెలంగాణ-ముషీరాబాద్

త్వరలోనే ముషీరాబాద్ నియోజకవర్గంలోని గుంతలమైన రోడ్లను బాగు చేయించి అభివృద్ధి పనులను పూర్తి చేయిస్తానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని భోలక్‌పూర్ డివిజన్ పీ అండ్ టీ కాలనీలో రూ. 42 లక్షల నిధులతో కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులకు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యలన్నిం టిని త్వరలోనే పూర్తి చేయిస్తామన్నారు. పీ అండ్ టీ కాలనీలో కూడా నూతన కమ్యూనిటీహాల్ పనులను నాలుగు నెలల్లో పూర్తి చేయించి, కాలనీవా సులకు అందుబాటులోకి తెస్తామన్నారు. సాగర్ లాల్ హాస్పటల్ చౌరస్తా వద్ద రోడ్డంతా గుంతలుగా మారిందని, వాటర్‌వర్క్స్, జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడుతానని, పది రోజుల్లో అక్కడ పనులను పూర్తి చేయిస్తామన్నారు. దేవీ చౌక్ నుంచి సూరజ్ ఫాస్ట్‌ఫుడ్ వర కు నూతన రోడ్డు కోసం ఎంపీ నుంచి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముఠా జైసింహ, డివిజన్ ప్రెసిడెంట్ వై శ్రీనివాస్, గోవింద్, శంకర్ గౌడ్, రహీమ్, ప్రవీణ్, కాలనీ వాసులు ఆర్‌కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ మానవి
సోమవారం 4 నవంబరు 2024
హైదరాబాద్
www.navatelangana.com

పసుపు స్వచ్ఛమైనదేనా?

ప్రస్తుతం కల్తీ అనే పదం ప్రపంచాన్ని గడగడలాడిస్తోంది. చిన్న పిల్లలు తినే ఆహారం నుంచి అన్ని వస్తువుల్లో కల్తీ అవుతున్నాయి. ఇవి మాత్రమే కాదు, వంటింట్లో వినియోగించే మసాలా, కారం, నూనె, ఉప్పు, పప్పు అన్నీ కల్తీ చేస్తూ... ప్రజల ఆరోగ్యాలతో ఆడుకుంటున్నారు. కల్తీ అవుతున్న వాటిల్లో పసుపు కూడా ఒకటి. కల్తీ పసుపును వినియోగించడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. అయితే చిన్న చిన్న టిప్స్ పాటించటం ద్వారా అది కల్తీదో కాదో తెలుసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

నీటిలో పసుపు వేసి గుర్తించొచ్చు..

రెండు గ్లాసుల నీటిలో ఒక టేబుల్ స్పూన్ పసుపు వేయాలి. అలా పసుపు వేసినప్పుడు నీరు లేత పసుపు రంగులోకి మారిపోయి.. మిగిలిన పసుపు గ్లాస్ అడుగు భాగాన చేరుకుంటుంది. ఇలా లేత పసుపు రంగులోకి మారిపోయి అడుగుభాగాన చేరితే అది అసలైన పసుపు అని నిర్ధారించాలని నిపుణులు చెబుతున్నారు.

అదే నకిలీ పసుపు అయితే.. గ్లాసులోని నీటిని పూర్తిగా, చిక్కగా మార్చేస్తుందని, పసుపు కూడా అడుగు భాగాన చేరదని చెబుతున్నారు. ఒకవేళ మీ పసుపు కూడా ఇలా చిక్కగా మారిపోతే అది నకిలీదని గుర్తించాలని, ఆ పసుపును వినియోగించకపోవడమే ఉత్తమమని సూచిస్తున్నారు.

పసుపు కొమ్ములు కూడా..

మార్కెట్‌లో లభించే పసుపు కల్తీదని గ్రహించిన కొందరు పసుపు కొమ్ములు కొంటున్నారు. అయితే ఈ పసుపు కొమ్ములను సైతం కల్తీ చేస్తున్నారు. పాడైపోయిన పసుపు కొమ్ము, తాజాగా కనిపించేందుకు వాటిని కలర్లు కలిపి మార్కెట్లో అమ్మేస్తున్నారు. అందుకే పసుపు కొమ్ములు కొనే వారు సైతం నకిలీ కొమ్ములు కొని మోసపోవద్దని, వాటిని గుర్తించి జాగ్రత్త పాడాలని నిపుణులు చెబుతున్నారు.

ఇందుకోసం రెండు గ్లాసుల నీరు తీసుకోవాలి. పసుపు కొమ్ములను ఆ నీటిలో ముంచినప్పుడు నీరు రంగు మారకపోతే అది అసలైన పసుపు కొమ్ము అని గుర్తించాలని చెబుతున్నారు. ఒకవేళ గ్లాసులోని నీరు రంగు మారితే.. నకిలీదని అర్థం చేసుకోవాలని చెబుతున్నారు. ■

ధైర్యం మన తోడుంటే...



ఉమెన్ హెల్త్

Why me? Why Only me? The One question which is the root cause of suffering? అందరికీ నమస్కారం. గత వారం మనం మనలోని బలాన్ని ఎలా గుర్తించాలో, భయాన్ని ఎలా జయించాలో చర్చించాం కదా! ఈ వారం మనందరిలో బాధకు, లోగా ఫీలవ్వడానికి కారణం గురించి చర్చిద్దాం. సాధారణంగా సమాజంలో మహిళలే ఎక్కువగా ఏమీ సాధించలేక పోతున్నామని బాధపడుతుంటారు. కుటుంబంలో అందరికీ అన్నీ సమకూర్చుతూనే మనసువిప్పి మాట్లాడేవారు లేక తమలో తామే కుంగిపోతుంటారు. నాకే ఇన్ని కష్టాలు ఎందుకు వస్తున్నాయని మదనపడుతుంటారు. ఈ బాధను ఎలా జయించాలో తెలుసుకుందాం...

జీవితంలో మనందరం ఎన్నో కష్టాలను, ఛాలెంజెస్‌ని ఎదుర్కొంటాం. ఎదుర్కొంటూనే ఉంటాము. ఇది నిరంతర ప్రాయణం, సాధన. మనందరం గ్రహించాల్సిన విషయం ఒకటుంది. సృష్టిలో వెలుగు నీడలు, సూర్య చంద్రులు, వేసవి, శీతాకాలం, నీడ, ఎండ, నలుపు, తెలుపు... ఇలాంటివన్నీ నిరంతరం మనకు ఒకటి గుర్తు చేస్తూ ఉంటాయి. అదేమిటంటే వీటన్నింటిలాగే జీవితంలో సుఖం, దు:ఖం కూడా ఒకదాని తరువాత ఒకటి వస్తూనే ఉంటాయని. జీవితంలో ఏదీ శాశ్వతం కాదని. ఈ వాస్తవాన్ని మనం పూర్తిగా గ్రహించి ప్రతి రోజూ స్మరణ చేసుకోవాలి. అప్పుడే ఒక పాజిటివ్ దృక్పథంతో జీవితాన్ని చూడడం మొదలవుతుంది. ఇది ఎంతో అవసరం.

మనో ధైర్యం

మనం జీవితంలో ఒకదాని తర్వాత ఒకటి, మరొకటి అలా నిరంతరం కష్టాలు అనుభవిస్తున్నపుడు, అసలు ఏం చేయాలో దారి కనిపించనపుడు ఈ ఫేస్‌ని "Hitting the rock bottom" అంటాము. అయితే ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొనపుడు మనకు అత్యంత అవసరమైన ఆయుధం ఒకటి ఉంది. అదే 'మనో ధైర్యం'. ఈ సందర్భంలో మీ అందరికీ ఒక చిన్న కథ చెప్తాను. ఒకసారి ఒక రాజుకు లక్ష్మీదేవి ప్రత్యక్షమయి 'నీకు అష్టలక్ష్ములలో ఒకరిని మాత్రమే ప్రసన్నం చేసుకునే వరం ఇస్తున్నాను.



నీకు అష్టలక్ష్ములలో ఎవరు ప్రసన్నం కావాలో కోరుకో' అని వర మిచ్చింది. దానికి ఆ రాజు 'నాకు ధైర్య లక్ష్మి ఎప్పుడూ తోడుగా ఉండేటట్లు వరమివ్వు' అని కోరుకున్నాడు. దేవత అదేమిటి ధనలక్ష్మీ, ధాన్యలక్ష్మీ ఇలా అందరినీ వదిలి పెట్టి ధైర్యలక్ష్మిని ఎంచుకున్నావు అనగా దానికి ఆ రాజు 'తల్లీ మనం జీవితంలో ధైర్యాన్ని కోల్పోతే సర్వం కోల్పోతాము. అడుగు ముందుకు వేయలేము. అదే ధైర్యంగా ఉంటే ఎలాంటి కష్టాన్నైనా ఎదుర్కొంటాము. స్థిత ప్రజ్ఞతతో సమస్యలకు పరిష్కారం వెతుకుతాము. సమస్య నుండి బయటపడి విజయాన్ని సాధిస్తాము. పురోగతి చెందుతాము. అందుకే ధైర్య లక్ష్మి వెంట ఉంటే అందరూ లక్ష్మీదేవతను ప్రసన్నం చేసుకోగలుగుతాము' అని సమాధానం ఇచ్చాడు. మీకు సరళంగా అర్థం కావాలని ఈ కథను ఉదాహరణగా ప్రస్తావించాను. సైంటిఫిక్ రీసెర్చ్ ఎండ్ ఎవిడెన్స్ ప్రకారం కూడా ఇతరులతో పోలిస్తే మనో ధైర్యంతో ఉన్నవారు సమస్యలను కొంత సులువుగా ఎదుర్కొంటారు. పరిష్కారం కోసం అన్వేషించి బయటపడతారు.

సమస్యలకు బెదిరిపోకుండా...

ఈ చిన్న కథ సారాంశం ఏమిటంటే జీవితంలో ఎటువంటి పరిస్థితిలో అయినా ధైర్యంగా ఉండటం ఎంతో అవసరం. ధైర్యంగా ఉంటే స్థిత ప్రజ్ఞత వస్తుంది. ఇలా ఆలోచించడం వల్ల సమస్యను చూసి బెదిరిపోకుండా సమస్య నుండి బయట పడటానికి దారులు వెతుకుతాము. కార్య సాధకులుగా మారుతాము. విజయాన్ని పొందుతాము. ఒక్కో కష్టం అధిగమిస్తూ పరిణితి పొందుతూ ఒక్కో మెట్టు ఎక్కుతూ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ అందరికీ స్ఫూర్తిదాతగా మారుతాము. Post Traumatic stress ని చక్కగా handle చేసి Post traumatic growth ని చవిచూస్తాము. evolve అవుతూ ముందుకు సాగుతాము. అంతే కదా Friends ఈ జీవితంలో ధైర్యం మనకు ముఖ్యమైన రక్షణ కవచం, ఆయుధం.



When we are in a dark tunnel and there is no light, keep moving with hope and faith → there is light always at the end of tunnel.

ఓ ప్రశ్న అడుగుతాను

నేను కౌన్సిలింగ్ సెషన్స్‌లో క్లైంట్స్‌తో మాట్లాడుతున్నపుడు దాదాపు అందరిలో ఒక కామన్ ఆలోచనా విధానం "Thought pattern" చూస్తూ ఉంటాను. అదేమిటంటే "Why me", "Why only me". 'నాకు ఎందుకు ఇలా జరుగుతుంది. నాకే ఎందుకు ఇలా జరుగుతుంది' అని బాధపడుతూ ఉంటారు. ఈ ప్రశ్నను వారు తమకు తాము ఎన్నో సార్లు వేసుకొని ఉంటారు. అలానే వారి సన్నిహితులతో ఎన్నో సార్లు బాధపడి ఉంటారు. అయితే నేను వారి సమస్యలను, బాధలను ఎంతో జాగ్రత్తగా, శ్రద్ధతో, ఎంపతీతో విన్న తర్వాత వారిని ఒక ప్రశ్న అడుగుతాను. 'నిజంగా మీరు ఒక్కరే బాధలు పడుతున్నారా? ఆలోచించండి. మీ చుట్టూ ఉన్న వారిని గమనించారా? వారికి బాధలు లేవా, సమస్యలు లేవా, సమస్యలు లేని ఒక్క మనిషిని, ఒక్క ఇంటిని, ఒక్క కుటుంబాన్ని నాకు చూపించండి' అని. అప్పుడు వారు నిజంగా ఆ దృక్పథాన్ని వదిలి అర్థం చేసుకోవడం మొదలుపెడతారు.

మార్పు చాలా ముఖ్యం

ఆలోచనా విధానంలో మార్పు అనేది చాలా ముఖ్యం. ఎందుకంటే మనం "Victim" Role నుంచి బయటపడటానికి. "action" తీసుకోవడం మొదలుపెట్టడానికి ఇది చాలా అవసరం. "Why me", "Why only me" అనే ప్రశ్న అడుగుతూ, బాధపడుతూ Victim Role లో ఉండిపోతే జీవితంలో ఏ అడుగు ముందుకు వేయలేము అని గ్రహించాలి. మన అందరి జీవితాలలో కష్టసుఖాలు సాధారణం. ఇది అర్థం చేసుకొని కష్టాలను ఛాలెంజెస్‌లా, ఒక ఎక్స్‌పీరియన్స్‌లా తీసుకోవాలి. ముందుకు సాగాలి ధైర్యంతో.

ఓపెన్ మైండ్‌తో...

ఇక నుంచి Why me, Why only me అనే ప్రశ్నకు బదులు This is a phase in life. This too shall pass అని గుర్తు చేసుకొందాం. ఇలా మనం ధైర్యంతో, ఓపెన్ మైండ్‌తో ఆలోచించినపుడు సమస్యలకు దారులు కనిపిస్తాయి. ధైర్యం, ఓపిక అనేవి ఎంతో అమూల్యమైన అవసరమైన ఆయుధాలు మరువకండి. మనం మనతో ఎలా సంభాషిస్తున్నాము అంటే సెల్ఫ్ లాంగ్వేజ్ అనేది మన ఉన్నతికి పురోగతికి ఎంతో ముఖ్యమైనది. మన సెల్ఫ్ లాంగ్వేజ్, మైండ్‌సెట్ పాజిటివ్‌గా దృఢంగా ఉన్నపుడు ఇతరులు ఏమన్నా, ఎంత కించపరిచినా మనం ధైర్యాన్ని కోల్పోము. మన లక్ష్యంపైన దృష్టి కోల్పోము, గురి తప్పము. సెల్ఫ్ లాంగ్వేజ్ గురించి మరింత వివరంగా వచ్చే వారం చర్చిదాం. సెలవా మరి. ఎప్పుడూ మీరందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఆశిస్తూ... ■

Dr.Prathusha. Nerella
MD(General Medicine) CCEBDM; CCGDM; NLP; FID
Senior General Physician
Positive Psychologist certified Nutritionist
Diabetes And Lifestyle Expert
Pranic Healer Chiief Holistic Health Consultant And Medical Director @ Praveha General, Diabetes And Lifestyle Clinic - A Holistic Centre With Integrated Approach.
Ph: 8897684912/040-49950314



వడ్లు కొనేదెప్పుడు?

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వలేదన్నారు. రూ.7,521కు కొనుగోలు చేయాల్సిన పత్తి.. కేవలం రూ.5000కు రైతులు అమ్ముకుంటు న్నారన్నారు. పత్తికి మద్దతు ధర లేదని, మక్కల కొనుగోలు కేంద్రాలు లేవని, వడ్లు రూ 1800కే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో సోయాబీన్ కొనుగోలు చేసిన ప్రభుత్వం రెండు నెలలైనా డబ్బులు ఇవ్వలేదని చెప్పారు. దాంతో చాలా మంది రైతులు దళారులకు అమ్ముకుంటున్నారన్నారు. సిద్దిపేట జిల్లాలో 3.60 లక్షల ఎకరాల్లో వానాకాలం వరి సాగు అయ్యిందని 9 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు పండుతాయని, కానీ ఇప్పటి వరకు అధికారులు వెయ్యి మెట్రిక్ టన్నుల వడ్లు కూడా కొనలేదన్నారు. రైతుల పంటలకు మద్దతు ధర ఇవ్వాలని, రూ.500 బోనస్ ఇవ్వాలని, లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నాలు చేపట్టి ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు ఎడ్ల సోమిరెడ్డి, రాగుల సారయ్య, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఆనగోని లింగం గౌడ్, సొసైటీ చైర్మన్లు కోల రమేశ్ గౌడ్, ఎల్లంకి మహిపాల్ రెడ్డి మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ చైర్ పర్సన్‌కు హరీశ్‌రావు పరామర్శ

నవతెలంగాణ-సిద్దిపేట

ఇటీవల ప్రమాదవశాత్తు కిందపడి గాయపడిన మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సుని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదివారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు.

ఇక ఉబర్ ఫ్లైట్స్

(మొదటిపేజీ తరువాయి)



వెలిబుచ్చారు. ఈ నేపథ్యంలో ఉబర్‌తో కుదుర్చుకున్న అవగాహనా ఒప్పందం (ఎంఓయూ)పై పున్ణపరిశీలన జరపాలంటూ రిటైర్డ్ సైనికాధికారి లెఫ్టినెంట్ జనరల్ కేజీఎస్ ఢిల్లాన్ వైమానిక దళ నాయకత్వానికి సూచించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టారు.'ఈ ఒప్పందాన్ని పున్ణపరిశీలించే విషయంపై తీవ్రంగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. వైమానిక దళంలో పనిచేసే ప్రతి వారినీ మీరు జియో-ట్యాగింగ్ చేస్తున్నారు. కాబట్టి వారి కదలికలను తేలికగా తెలుసుకోవచ్చు' అని ఛినార్ కోర్ మాజీ కమాండర్ అయిన ఢిల్లాన్ ఆ పోస్టులో వివరించారు. మరో రిటైర్డ్ సైనికాధికారి అయిన పవిత్రన్ రాజన్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సమాచారాన్ని స్థానికీకరించని పక్షంలో ఇండిజినస్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ), పటిష్టమైన సమాచార గోప్యతా చట్టాలు అసాధ్యమని ఆయన తెలిపారు.

'ఎత్తుగడ లేని వ్యూహం విజయాన్ని తేలికగా అందించదు. వ్యూహం లేని ఎత్తుగడ ఓటమి ముందు శబ్దం వంటిది. సైనిక దళాల అధిపతిని బహిరంగంగా చులకన చేయడం, తక్కువ చేయడం నాకు సంతోషాన్ని కలిగించదు. దేశాన్ని రక్షించేందుకు సార్వభౌమత్వ సైబర్‌స్పేస్, అవసరమైన చట్టాలు లేకుండా భారత్‌కు సంబంధించిన పురుగుల డబ్బాను తెరవడంపై మనం చర్చించాల్సిన అవసరం ఉంది' అని నర్మగర్భంగా వ్యాఖ్యానించారు. దీనర్థం తగిన రక్షణ చర్యలు తీసుకోకుండా తేనెతుట్టెను కదల్చడమే. సమాచార స్థానికీకరణ, దేశీయ ఐసీటీ లేకుండా బలమైన గోప్యతా చట్టాలు చేయడం అసాధ్యమని, భారత సైనిక రక్షణ వ్యవస్థకు ఇది మేలుకొలుపు వంటిదని రాజన్ తెలిపారు.

భారత వైమానిక దళం గత నెల 18న ఉబర్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. వైమానిక దళ సిబ్బంది, సీనియర్ అధికారులు, వారి కుటుంబాలకు నమ్మకమైన, సౌకర్యవంతమైన, సురక్షితమైన రవాణా సేవలు అందించేందుకు ఈ ఒప్పందాన్ని ఉద్దేశించారు. దీనిపై ఎయిర్ వైస్ మార్షల్ ఉపదేశ్ శర్మ, ఉబర్ సీనియర్ అధికారి సంతకాలు చేశారని వైమానిక దళం ఎక్స్‌లో తెలిపింది. అయితే సామాజిక మాధ్యమాలలో విమర్శలు వెల్లువెత్తడంతో దానిని తొలగించింది.

రెండో రాజధానిగా వరంగల్...

(మొదటిపేజీ తరువాయి)

నగరంలోని భద్రకాళి బండ్ సుందరీకరణ పనులను, భద్రకాళి చెరువు బొంది వాగు వరద నివారణ పనులను, భద్రకాళి మాడ వీధుల నిర్మాణాలను నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, పి. ప్రావీణ్యతో కలిసి మంత్రి పరిశీలించారు. పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రకాళి చెరువు బొందివాగు వరద నివారణకు ప్రభుత్వం రూ.158 కోట్లు మంజూరు చేసిందని, బొందివాగు నాలా, భద్రకాళి నాలా, భద్రకాళి క్యాచ్మెంట్ ఏరియాల్లో చేపట్టే వరద నివారణ అభివృద్ధి పనుల మ్యాప్‌ను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమర్థవంతంగా ఆయా పనులు నిర్వహించేందుకు మంత్రి తగు సూచనలు చేశారు. భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడారు.

భద్రకాళి అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి

క్రీస్తుపూర్వం 600 ఏండ్ల కిందట నిర్మించిన భద్రకాళి అమ్మవారి దేవాలయానికి ప్రత్యేకమైన చరిత్ర ఉందని, ఉమ్మడి కరీంనగర్, ఖమ్మం,



నిజాంబాద్, మెదక్ జిల్లాల నుంచి సందర్శకులు వస్తారని అన్నారు. ఈ ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో హైదరాబాద్ తర్వాత వరంగల్ పట్టణంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి రెండవ రాజధానిగా అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. వరంగల్ సమగ్రాభివృద్ధి చర్యల్లో భాగంగా ప్రజల అభిరుచికి అనుగుణంగా భద్రకాళి ఆలయం, మాడ వీధులను అభివృద్ధి చేస్తామని అన్నారు. ఆలయాన్ని ఆనుకొని ఉన్న చెరువును అభివృద్ధి చేయడానికి పరిశీలన చేశామని తెలిపారు. సుమారు 380 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు పూడిక పేరుకుపోయి, లోతు తగ్గి సమాంతరంగా మారడంతో నీటి నిలువ సామర్థ్యం తగ్గిపోయిందని చెప్పారు. వెంటనే చెరువు పూడికతీతకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే వరంగల్ ప్రాంతవాసులకు ఎయిర్‌పోర్టు సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. ఓఆర్ఆర్, ఇన్నర్ రింగ్ రోడ్డు ఏర్పాటుతోపాటు రాబోయే 30 సంవత్సరాల వరకు నగర ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతులు, అండర్ డ్రయినేజీ, ఎలక్ట్రిఫికేషన్ తదితర సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికలు తయారు చేశామని అన్నారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాళోజీ నారాయణరావు కళా క్షేత్రాన్ని, పట్టణానికి సంబంధించిన మౌలిక వసతుల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారని తెలిపారు. భద్రకాళి చెరువు కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, సర్వే చేయించి అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని అన్నారు. మంత్రి వెంట ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, కుడా పీఓ అజిత్ రెడ్డి, జీడబ్ల్యూఎంసీ ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈ భీమ్‌రావు, సంతోష్ బాబు, సీతారాం, పీసీసీ సభ్యులు ఈవీ శ్రీనివాస్‌రావు, కట్ల రఘుపాల్‌రెడ్డి, రహీ మున్నిసాబేగం, ఆనంద్, కార్పొరేటర్లు మామిండ్ల రాజు, పోతుల శ్రీమాన్ ఉన్నారు.

ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలు, గనుల కారణంగా నిరాశ్రయులైన వారికి పునరావాసం కల్పించేందుకు కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. 'జార్ఖండ్‌లో మా ప్రభుత్వం యూసీసీని అమలు చేస్తుంది. అయితే దాని పరిధి నుండి గిరిజనులను తప్పిస్తుంది. గిరిజనుల హక్కులు, సంస్కృతిపై యూసీసీ ప్రభావం చూపుతుందంటూ జేఎంఎం ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోంది. అది పూర్తిగా నిరాధారం. గిరిజనులను యూసీసీ పరిధిలో చేర్చబోము' అని అన్నారు. జార్ఖండ్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే సార్నా మత కోడ్‌పై చర్చించి, అవసరమైన చర్యలు చేపడుతుందని అమిత్ షా చెప్పారు. తమకు అధికారాన్ని అప్పగిస్తే జార్ఖండ్‌లో ఐదు లక్షల ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, వాటిలో 2.87 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఉంటాయని ఆయన హామీ ఇచ్చారు.

రాష్ట్రంలో పేపర్ లీకేజీలపై సీబీఐ, సిట్ దర్యాప్తు జరుపుతాయని, దోషులను శిక్షిస్తామని తెలిపారు. జార్ఖండ్‌లో చొరబాటుదారుల నుండి తిరిగి భూమిని స్వాధీనపరచుకునేందుకు బీజేపీ ఓ చట్టాన్ని తీసుకొస్తుందని చెప్పారు. అక్రమ చొరబాటుదారుల కారణంగా భూమి, కుమార్తె, ఆహారానికి (మటీ, బేటీ, రోటీ) ముప్పు వాటిల్లుతోందని అంటూ రాష్ట్ర ప్రజలకు బీజేపీ భద్రత కల్పిస్తుందని అన్నారు. రాష్ట్రంలోని జేఎంఎం ప్రభుత్వం చొరబాటుదారులను రక్షిస్తోందని అమిత్ షా ఆరోపించారు. రాష్ట్రంలో గిరిజన జనాభా తగ్గిపోతోందని చెప్పారు. మ్యానిఫెస్టో విడుదల అనంతరం ఆయన మూడు ఎన్నికల ప్రచార సభలలో ప్రసంగించారు.

85 లక్షల భారతీయ వాట్సాప్ ఖాతాలపై నిషేధం

(మొదటిపేజీ తరువాయి)

నిబంధనల్ని ఉల్లంఘించిన ఖాతాదారులపై వాట్సాప్ ఈ తరహా చర్యలు తీసుకుంటోంది. మోసం లేదా తప్పుడు సమాచారం చేరవేతకు బల్క్, స్పామ్ మెసేజ్‌లు పంపే యూజర్లపై చర్యలకు దిగుతోంది. స్థానిక చట్టాలకు వ్యతిరేకంగా అక్రమ కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తీసుకుంటోంది. ఇదిలా ఉండగా.. వాట్సాప్ ఆగస్టులో 84.58 లక్షల ఖాతాలపై నిషేధం విధించిన విషయం తెలిసిందే. వాటిలో కూడా 16,61,000 ఖాతాలకు యూజర్ల నుంచి ఎలాంటి ఫిర్యాదులూ రాకుండానే నిబంధనల ఉల్లంఘన కారణంతో తొలగించినట్టు పేర్కొంది.

జమిలీ ప్రజాస్వామ్యానికి విరుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులతో ఆదివారం తొలిసారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీవీకేని సంస్థాగతంగా బలోపేతం చేయడం, ప్రజలకు చేరువయ్యే అంశాలపై ప్రధానంగా చర్చించి 26 తీర్మానాలను ఆమోదించారు. ఈ సందర్భంగా డీఎంకే, బీజేపీ పాలనపై మండిపడిన విజయ్.. తమిళనాడులో శాంతిభద్రతల అంశంపై విమర్శలు గుప్పించారు. తమిళనాడులో కులగణన చేపట్టాలని కోరారు. పరందూర్ విమానాశ్రయం ప్రాజెక్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిర్దేశిత గడువు నిర్దేశించుకొని క్రమంగా మద్యం దుకాణాలను మూసివేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, కేంద్ర ప్రభుత్వం తీరుపైనా విమర్శలు చేశారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) రివ్యూలో ఉన్న వక్ఫ్ సవరణ బిల్లు- 2024ను ఫెడరలిజంపై దాడిగా పేర్కొన్నారు. ఈ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నీట్‌ను రద్దు చేయాలన్న డిమాండ్‌కు మద్దతుగా నిలిచిన విజయ్.. విద్యను ఉమ్మడి జాబితా నుంచి రాష్ట్ర జాబితాలోకి మార్చాలని కోరారు. తమిళనాడు ప్రజల సామరస్యత, ఐక్యత కోసం పనిచేసే తమ పార్టీ సిద్ధాంతం లౌకిక వాదం, సామాజిక న్యాయమేనని అన్నారు.

ఫౌంటేన్ కాదు..లీకేజీ..!

(మొదటిపేజీ తరువాయి)

లైన్ల పై నీరు పడుతుండటంతో ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లీకేజీ నీటితో చుట్టుపక్కల ఉన్న పొలాలన్నీ నీటితో నిండిపోయాయి. మూడు నెలల కిందట వరి పంట సాగు చేశామని, వంట చేతికి అందివచ్చిందని, కోతలు కోసే తరుణంలో పైపులైను ఎయిర్‌వాల్ లీకేజీతో పంటచేలలు నీటితో నిండిపోయాయని రైతులు వాపోయారు. హార్వెస్టర్ యంత్రాలతో కోతలు కోసే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం రాత్రి నుంచి నీరు వృధాగా పోతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీలను అరికట్టి సాగునీరు వృధా కాకుండా చూడాలని, పంటలను కాపాడాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

కల్లాల్లేక కష్టాలు..

(మొదటిపేజీ తరువాయి)

స్థలాల్లేకుండా పోయాయి. దాంతో ప్రత్యామ్నాయం లేని పరిస్థితుల్లోనే రైతులు సమీపంలోని రోడ్లపై ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. తొమ్మిది లక్షల ఎకరాల్లో సాగైన వరి పంట దిగుబడులు భారీ ఎత్తున వస్తున్నాయి. వీటిని ఆరబోసి తేమ లేకుండా అయ్యాక మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లాల్సి ఉండటంతో ఎక్కడ ఆరబోయాలో రైతులకు అర్థం కాని పరిస్థితి.

గ్రామీణ మార్కెట్ యార్డులు నిర్మించాలి

రైతులు పండించిన ధాన్యాన్ని ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్ వంటి ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రభుత్వం ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 1097 కొనుగోలు కేంద్రాల్ని ఏర్పాటు చేసింది. సిద్దిపేట జిల్లాలో 417, మెదక్ జిల్లాలో 494, సంగారెడ్డి జిల్లాలో 200 ధాన్యం కొనుగోలు కేంద్రాల్ని ఏర్పాటు చేశారు. ఇప్పటికే 90 శాతం కేంద్రాల్ని ప్రారంభించారు. ఈ కేంద్రాలన్నీ కూడా గ్రామీణ ప్రాంతాల్లో ఆరుబయటే నిర్వహిస్తున్నారు. కాంటా వేసేందుకు, ధాన్యం రాసులు పోసేందుకు కొద్దిపాటి స్థలంలోనే కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాలకు రైతులు ధాన్యం తెచ్చి రాశి పోసుకోవాలంటే కొందరి రైతుల ధాన్యాన్ని కాంటా వేసిన తర్వాత ఖాళీ అయిన స్థలంలోనే పోసుకోవాల్సి వస్తుంది. ధాన్యాన్ని ఆరబోసేందుకు స్థలముండదు. వర్షాలు పడితే ధాన్యం రాశులు తడుస్తున్నాయి. కాంటా వేసిన బస్తాలు సైతం తడిసి మొలకెత్తడంతో రైతులు నష్టపోతున్నారు. అందుకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలున్న గ్రామీణ ప్రాంతాల్లో మార్కెట్ యార్డుల్ని నిర్మిస్తామని ప్రకటించింది. ఇందుకోసం 800 గ్రామాల్లో స్థల సేకరణ చేపట్టింది. నిధులు మంజూరు కాగానే మార్కెట్ యార్డుల్ని నిర్మిస్తామని అప్పటి




మార్కెటింగ్ మంత్రి హరీశ్‌రావు ప్రకటించారు. అయితే గ్రామీణ గోదాములు, కల్లాల కోసం కేంద్రం ఇచ్చే ఉపాధి హామీ నిధుల్ని వాడకూడదంటూ ఆంక్షలు పెట్టింది. దాంతో గ్రామీణ మార్కెట్ యార్డుల నిర్మాణం ముందుకు సాగలేదు.

విధిలేక రోడ్లపై ధాన్యం.. పోలీసుల ఆంక్షలు

రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టేందుకు స్థలాల్లేని పరిస్థితుల్లోనే రోడ్లపై పోస్తున్నారు. మెదక్ జిల్లాలో బొడ్మట్‌పల్లి నుంచి మెదక్ రూట్‌లో సింగిల్ రోడ్డుపై టేక్మాల్, పాపన్నపేట మండలాలకు చెందిన రైతులు ఇరువైపులా ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. అలాగే రామాయంపేట, చేగుంట, మెదక్-హైదరాబాద్ రోడ్డు, సంగారెడ్డి-గజ్వేల్ రోడ్డు, సిద్దిపేట-చేర్యాల, దుబ్బాక, మెదక్ వెళ్లే రోడ్లపైనా రైతులు ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. ఈ రోడ్లకు లింక్‌గా ఉన్న గ్రామీణ రోడ్లపై కూడా రైతులు ధాన్యాన్ని పోస్తున్నారు. ఎందుకంటే తారు రోడ్డు కావడం, కొట్టుకుపోయే పరిస్థితి లేకపోవడం అనువైన ప్రాంతంగా రైతులు ధాన్యం పోస్తున్నారు. అయితే రోడ్లపై ధాన్యం పోయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్న పరిస్థితి ఉంది. తాజాగా శనివారం మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని పోతారం గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డుపై ధాన్యం పోశారు. సాయంత్రం పూట ఓ వ్యక్తి బైక్‌పై ఇద్దరు కూతుళ్లు, మహిళతో ప్రయాణిస్తున్న వేళ ఎదురుగా ట్రాక్టర్ వచ్చి ట్రాలీతో ఢీ కొట్టింది. రోడ్డుపై ధాన్యం రాసి ఉండటంతో బైక్‌ను పక్కకు తీసేందుకు వీలుకాక ట్రక్ కింద పడి నలుగురు స్పాట్‌లోనే మృతి చెందారు. అంతకుముందు సమీప గ్రామాల్లో అయా ప్రమాదాలకు గురై ఏడుగురు మరణించారు. ఇలా మూడు జిల్లాల్లో రోడ్లపై ధాన్యం ఆరబోయడంతో ప్రమాదాలు జరుగుతున్నట్టు పోలీసులు గుర్తించారు. రోడ్లపై ధాన్యాన్ని పోయకూడదంటూ మెదక్ జిల్లా ఎస్పీ ఉదయకుమార్‌రెడ్డి ఆంక్షలు విధించారు. ధాన్యం పోస్తే కేసులు పెడతామని హెచ్చరిస్తున్నారు.

చరిత్ర ఎరుగని ఓటమి


రోహిత్ (11)

సొంతగడ్డపై చరిత్ర ఎరుగని ఓటమి. 12 ఏండ్లుగా స్వదేశంలో ఎదురులేని సిరీస్ విజయాల జోరుకు బ్రేక్ పడగా.. సొంతగడ్డపై టెస్టు క్రికెట్ చరిత్ర ఎరుగని రీతిలో భారత్ వైట్‌వాష్ ఓటమిని మూటగట్టుకుంది. 0-3తో న్యూజిలాండ్‌కు టెస్టు సిరీస్‌ను కోల్పోయింది. మూడు టెస్టుల సిరీస్‌లో స్వదేశంలో భారత్ అన్నింటా ఓటమి చవిచూడటం ఇదే ప్రథమం.


కోహ్లి (1) గిల్ (1)

147 పరుగుల ఛేదనలో భారత్ చతికిల పడింది. స్పిన్ ఆడేందుకు మన బ్యాటర్లు ఆపసోపాలు పడ్డారు. తిరిగే బంతిని ఎదుర్కొనేందుకు విలవిల్లాడారు. బ్యాటింగ్ లైనప్ సమిష్టిగా విఫలమైనా రిషబ్ పంత్ (64) ఒంటరి పోరాటం చేశాడు. 25 పరుగుల తేడాతో భారత్ మూడో టెస్టులో ఓటమి చవిచూసింది.

న్యూజిలాండ్ అద్భుతం చేసింది. 36 ఏండ్లలో తొలిసారి భారత గడ్డపై టెస్టు విజయంతో బెంగళూర్‌లో సంబురాలకు తెరదీసిన న్యూజిలాండ్.. పుణెలో చారిత్రక టెస్టు సిరీస్ విజయం అందుకుంది. ముంబయిలో భారత్‌ను సొంతగడ్డపై క్లీన్‌స్వీప్ చేసి ఖతర్నాక్ షో చూపించింది

- సొంతగడ్డపై తొలిసారి 0-3తో వైట్‌వాష్
- 25 పరుగులతో వాంఖడెలో కివీస్ గెలుపు
- ఛేదనలో రిషబ్ పంత్ పోరాటం వృథా

3-0తో టెస్టు సిరీస్ న్యూజిలాండ్ వశం


టెస్టు సిరీస్ ట్రోఫీతో న్యూజిలాండ్ క్రికెటర్లు

నవతెలంగాణ-ముంబయి

వాంఖడెలో స్పిన్ మాయకు టీమ్ ఇండియా విలవిల్లాడింది. న్యూజిలాండ్ స్పిన్నర్లు అజాజ్ పటేల్ (6/63), గ్లెన్ ఫిలిప్స్ (3/42) మ్యాజిక్ ముందు భారత బ్యాటర్లు మోకరిల్లారు. 147 పరుగుల సవాల్‌తో కూడిన ఛేదనలో రిషబ్ పంత్ (64, 57 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) మినహా మరో బ్యాటర్ రాణించలేదు. అర్థ సెంచరీతో పోరాటం చేసిన రిషబ్ పంత్ భారత్‌ను 29/5 నుంచి 106/6 వరకు తీసుకెళ్లాడు. స్పెషలిస్ట్ బ్యాటర్లలో ఎవరూ పంత్‌కు అండగా నిలువలేదు. విరాట్ కోహ్లి (1), శుభ్‌మన్ గిల్ (1), సర్ఫరాజ్ ఖాన్ (1), యశస్వి జైస్వాల్ (5), రోహిత్ శర్మ (11), రవీంద్ర జడేజా (6) తేలిపోయారు. 29.1 ఓవర్లలో 121 పరుగులకే కుప్పకూలిన టీమ్ ఇండియా.. 25 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. బెంగళూర్, పుణె టెస్టుల్లోనూ ఓటమి చెందిన భారత్.. ముంబయిలో పరాజయంతో స్వదేశంలో తొలిసారి 0-3తో టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైంది. మ్యాచ్‌లో 11 వికెట్లు పడగొట్టిన అజాజ్ పటేల్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. 244 పరుగులతో నిలకడగా రాణించిన విల్ యంగ్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును దక్కించుకున్నాడు. 3-0తో టెస్టు సిరీస్ ట్రోఫీని న్యూజిలాండ్ కెప్టెన్ టామ్ లేథమ్ అందుకున్నాడు.


పంత్ (64)

టాప్ ఆర్డర్ విలవిల

147 పరుగుల ఛేదనలో భారత బ్యాటింగ్ లైనప్ చేతులెత్తేసింది. బెంగళూర్, పుణె ప్రదర్శనను వాంఖడెలో పునరావృతం చేసింది. ఈసారి యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్ సైతం ఆకట్టుకోలేదు. జైస్వాల్ (5), రోహిత్ శర్మ (11), శుభ్‌మన్ గిల్ (1), విరాట్ కోహ్లి (1), సర్ఫరాజ్ ఖాన్ (1), రవీంద్ర జడేజా (6) దారుణంగా విఫలమయ్యారు. స్పిన్ పిచ్‌పై రోహిత్ శర్మ విచిత్రంగా పేసర్ మాట్ హెన్రికి వికెట్ కోల్పోగా.. ఫిలిప్స్ ఓవర్లో యశస్వి నిష్క్రమించాడు. గిల్, కోహ్లి, సర్ఫరాజ్, జడేజాలు అజాజ్ పటేల్ మాయలో పడ్డారు. భారత బ్యాటింగ్ లైనప్‌లో పంత్ మినహా ఇతర బ్యాటర్లు కలిసి 25 పరుగులు చేయగా.. న్యూజిలాండ్ టెయిలెండర్లు 28 పరుగులు చేయటం గమనార్హం. దీనికి తోడు రెండో ఇన్నింగ్స్‌ల్లో కలిపి భారత్ 30 పరుగులు ఎక్స్‌ట్రాల రూపంలో సమర్పించింది.

పంత్ పోరాటం వృథా

ఛేదన మొదలై పట్టుమని పది ఓవర్లు కూడా కాలేదు. 7.1 ఓవర్లలోనే 29 పరుగులకే ఐదు వికెట్లు. ఇదీ టీమ్ ఇండియా దీన స్థితి. ఈ పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన రిషబ్ పంత్ (64) అదిరే ప్రదర్శన చేశాడు. ఏడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 48 బంతుల్లోనే ధనాధన్ అర్ధ సెంచరీ బాదాడు. పంత్‌కు బంతులు వేసేందుకు అజాజ్ పటేల్, గ్లెన్ ఫిలిప్స్ తడబాటుకు గురయ్యారు. విలక్షణ షాట్లకు తోడు స్వీప్, రివర్స్ స్వీప్‌లతో దండెత్తిన రిషబ్ పంత్ న్యూజిలాండ్‌పై ఒత్తిడి తీసుకొచ్చాడు. ఈ టెస్టులో అజాజ్ పటేల్ ఇతర బ్యాటర్లకు 167 బంతుల్లో 112 పరుగులకు 9 వికెట్లు పడగొట్టగా.. పంత్‌కు సంధించిన 41 బంతుల్లోనే 75 పరుగులు సమర్పించుకున్నాడు. రవీంద్ర జడేజా (6) జతగా వికెట్ల పతనాన్ని నిలువరించిన పంత్.. లంచ్ విరామ సమయానికి సుందర్‌తో కలిసి అజేయంగా నిలిచాడు. విరామం కివీస్‌కు కలిసొచ్చింది. లంచ్ తర్వాత సైతం బౌండరీల మోత మోగించిన పంత్‌ను కివీస్ డిఆర్ఎస్ సమీక్షలతో వెంటాడింది. డిఆర్ఎస్‌లో పంత్ నిష్క్రమణతో భారత్ పోరాటానికి సైతం తెరపడింది. చివరి మూడు వికెట్లను భారత్ సున్నా పరుగులకే చేజార్చుకుంది. అశ్విన్ (8), సుందర్ (12) ఒత్తిడిలో చిత్తయ్యారు.

> టెస్టు సిరీస్ ఓటమి, టెస్టు మ్యాచ్ పరాజయం అంత సులువుగా మరిచిపోలేం. మేము ఉత్తమ క్రికెట్ ఆడలేకపోయాం. న్యూజిలాండ్ సిరీస్ అంతటా బాగా ఆడింది. సిరీస్‌లో ఎన్నో పొరపాట్లు చేశాం. తొలి రెండు టెస్టుల్లో తొలి ఇన్నింగ్స్‌ల్లో మెరుగైన స్కోరు సాధించలేదు. ఈ టెస్టులో 28 పరుగుల ఆధిక్యం దక్కినా.. బ్యాటర్లు ఛేదనలో విఫలమయ్యారు. ఈ సిరీస్‌లో నా వ్యూహాలు ఫలించలేదు.
> - రోహిత్ శర్మ, భారత కెప్టెన్

జడేజాకు ఐదు వికెట్లు

అంతకుముందు, ఓవర్‌నైట్ స్కోరు 171/9తో మూడో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన న్యూజిలాండ్ ఎంతో సేపు నిలువలేదు. అజాజ్ పటేల్ (8, 23 బంతుల్లో 1 ఫోర్), విలియం ఓరౌర్క్ (2 నాటౌట్, 5 బంతుల్లో) స్కోరు బోర్డుకు మరో మూడు పరుగులే జోడించారు. రవీంద్ర జడేజా ఓవర్లో అజాజ్ పటేల్ క్యాచౌట్‌గా నిష్క్రమించగా.. 45.5 ఓవర్లలో న్యూజిలాండ్ 174 పరుగులకు ఆలౌటైంది. భారత స్పిన్నర్లు రవీంద్ర జడేజా (5/55) ఐదు వికెట్ల ప్రదర్శన చేయగా, రవిచంద్రన్ అశ్విన్ (3/63), వాషింగ్టన్ సుందర్(1/30), ఆకాశ్ దీప్ (1/10) రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లోనూ ఐదు వికెట్లు పడగొట్టిన రవీంద్ర జడేజా.. ఓ టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ ఐదేసి వికెట్లు తీయటం ఇదే తొలిసారి. విల్ యంగ్ (51, 100 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో రాణించిన సంగతి తెలిసిందే.

స్కోరు వివరాలు :

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ :235/10

భారత్ తొలి ఇన్నింగ్స్ : 263/10

న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్ : 174/10

భారత్ రెండో ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ (ఎల్బీ) ఫిలిప్స్ 5, రోహిత్ శర్మ (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 11, శుభ్‌మన్ గిల్ (బి) అజాజ్ 1, విరాట్ కోహ్లి (సి) మిచెల్ (బి) అజాజ్ 1, రిషబ్ పంత్ (సి) బ్లండెల్ (బి) అజాజ్ 64, సర్ఫరాజ్ ఖాన్ (సి) రచిన్ (బి) అజాజ్ 1, రవీంద్ర జడేజా (సి) యంగ్ (బి) అజాజ్ 6, సుందర్ (బి) అజాజ్ 12, అశ్విన్ (సి) బ్లండెల్ (బి) ఫిలిప్స్ 8, ఆకాశ్ దీప్ (బి) ఫిలిప్స్ 0, మహ్మద్ సిరాజ్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 12, **మొత్తం** : (29.1 ఓవర్లలో ఆలౌట్) 121.

వికెట్ల పతనం : 1-13, 2-16, 3-18, 4-28, 5-29, 6-71, 7-106, 8-121, 9-121, 10-121.

బౌలింగ్ : మాట్ హెన్రీ 3-0-10-1, అజాజ్ పటేల్ 14.1-1-57-6, గ్లెన్ ఫిలిప్స్ 12-0-42-3.

యువ పంచ్‌కు 17 పతకాలు

పార్థవి, గోస్వామి, హేమంత్‌లకు స్వర్ణాలు
అండర్-19 ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్



కొలరాడో (యుఎస్ఏ) : అండర్-19 ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో యువ భారత్ అదరగొట్టింది. టీమ్ ఇండియా నుంచి పోటీల్లో 19 మంది బాక్సర్లు బరిలోకి దిగగా.. ఏకంగా 17 బాక్సర్లు పతకాలు కొల్లకొట్టారు. కృష్ణ వర్మ పసిడితో మెరువగా.. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో మరో ముగ్గురు బాక్సర్లు స్వర్ణాలు సాధించారు. మహిళల 65 కేజీల విభాగంలో పార్థవి గ్రెవల్, మహిళల 80 కేజీల విభాగంలో వెన్నిక గోస్వామి, మెన్స్ 90 కేజీల విభాగంలో హేమంత్ సంగ్వాన్‌లు పసిడి పంచ్ విసిరారు. మహిళల విభాగంలో నిష (51 కేజీలు), సుప్రియ దేవి (54 కేజీలు), క్రితిక వాసన్ (80 కేజీలు), చంచల్ చౌదరి (48 కేజీలు), అజంలి సింగ్ (57 కేజీలు), విని (60 కేజీలు), ఆకాంశ (70 కేజీలు) సిల్వర్ మెడల్స్ సాధించారు. మెన్స్ విభాగంలో రాహుల్ (75 కేజీలు) రతజంతో మెరువగా.. రిషి సింగ్ (50 కేజీలు), క్రిశ్ పాల్ (55 కేజీలు), సుమిత్ (70 కేజీలు), ఆర్యన్ (85 కేజీలు), లక్ష్యయ్ (90 కేజీలు) కాంస్య పతకాలు దక్కించుకున్నారు. వరల్డ్ బాక్సింగ్ నిర్వహించిన తొలి టోర్నమెంట్‌లో పతకాల పంట పండించిన భారత్ మహిళల విభాగంలో ఓవరాల్ రన్నరప్‌గా నిలిచింది.

ఆసీస్-ఏ అలవోకగా..!

7 వికెట్లతో తొలి టెస్టులో విజయం



మకాయ్ : భారత్-ఏ, ఆస్ట్రేలియా-ఏ తొలి అనధికార టెస్టులో ఆతిథ్య జట్టు అలవోక విజయం సాధించింది. 225 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్-ఏ 75 ఓవర్లలో మరో ఏడు వికెట్లు ఉండగానే ఛేదించింది. కెప్టెన్ నాథన్ మెక్‌స్వీనీ (88 నాటౌట్, 178 బంతుల్లో 9 ఫోర్లు), వెబ్‌స్టర్ (61 నాటౌట్, 117 బంతుల్లో 4 ఫోర్లు) అజేయ అర్ధ సెంచరీలతో కదం తొక్కారు. 139/3 ఓవర్‌నైట్ స్కోరుతో ఛేదన మొదలెట్టిన ఆసీస్-ఏ.. నాల్గో రోజు ఆటలో ఒక్క వికెట్ కోల్పోలేదు. భారత-ఏ బౌలర్లలో ముకేశ్, ప్రసిద్, మానవ్‌లు తలా ఓ వికెట్ పడగొట్టారు. నితీశ్ కుమార్ రెడ్డి 9 ఓవర్లలో ఒక్క వికెట్ పడగొట్టలేదు. రెండు మ్యాచుల సిరీస్‌లో ఆసీస్-ఏ 1-0తో ఆధిక్యం సాధించింది. ఉదయం సెషన్లో ఆట ఆరంభమయ్యాక బంతి మార్చారనే కారణంతో అంపైర్‌తో వాగ్వాదానికి దిగిన వికెట్ కీపర్ ఇషాన్ కిషన్‌పై ఐసీసీ ఎటువంటి చర్యలు తీసుకోకుండా వదిలేసింది. ఇరు జట్ల కెప్టెన్ల అంగీకారంతో బంతి మార్చినా.. ఆ సంగతి తెలియని కిషన్ ఫీల్డ్ అంపైర్లతో గొడవ పడ్డాడు.

వారియర్స్ గెలుపు బాట

- 40-38తో స్టీలర్స్‌పై గెలుపు
- ప్రొ కబడ్డీ లీగ్ సీజన్ 11



హైదరాబాద్: బెంగాల్ వారియర్స్ వరుస టైలకు ముగింపు పలుకుతూ గెలుపు బాట పట్టింది. ఆదివారం గచ్చిబౌలిలోని జీఎంసి బాలయోగి ఇండోర్ స్టేడియంలో జరిగిన ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్ మ్యాచ్‌లో హర్యానా స్టీలర్స్‌పై 40-38తో బెంగాల్ వారియర్స్ మెరుపు విజయం సాధించింది. ఆరంభంలో వెనుకంజ వేసినా.. రెయిడర్ మణిందర్ సింగ్ (12 పాయింట్లు) సూపర్ టెన్ షోతో బెంగాల్ వారియర్స్ దూకుడు పెంచింది. వారియర్స్ తరఫున సుశీల్ (4 పాయింట్లు), ప్రవీణ్ కుమార్ (4 పాయింట్లు), ఫజల్ (4 పాయింట్లు) రాణించారు. హర్యానా స్టీలర్స్ రెడియర్ వినయ్ (10 పాయింట్లు) సూపర్ టెన్‌తో మెరువగా.. ఆల్‌రౌండర్ మహ్మద్ రెజా (9 పాయింట్లు), నవీన్ (6 పాయింట్లు) ఆకట్టుకున్నారు. బెంగాల్ వారియర్స్‌కు పీకెఎల్ 11లో ఇది ఐదు మ్యాచుల్లో రెండో విజయం. హర్యానా స్టీలర్స్‌కు ఇది ఐదు మ్యాచుల్లో రెండో పరాజయం.

100% వినోదాత్మకం



సాయికిషోర్ మచ్చా

'ఈ మధ్య మనం థ్రిల్లర్, పేట్రియాటిక్, స్కామ్స్ నేపథ్యంలో సినిమాలు చూస్తున్నాం. వాటిలో కామెడీ మిస్ అయ్యాం. ఆ మిస్ అయిన ఎంటర్‌టైన్‌మెంట్ మా 'ధూం ధాం' సినిమాలో చూస్తారు' అని అంటున్నారు దర్శకుడు సాయికిషోర్ మచ్చా.

చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ హీరో, హీరోయిన్లుగా నటించిన సినిమా 'ధూం ధాం'. సాయికుమార్, వెన్నెల కిషోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ ఇతర కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రాన్ని ఫ్రైడే ఫ్రేమ్ వర్క్స్ బ్యానర్ పై ఎంఎస్ రామ్ కుమార్ నిర్మించారు. ఈ నెల 8వ తేదీన ఈ సినిమా రిలీజ్ కానున్న నేపథ్యంలో డైరెక్టర్ సాయికిషోర్ మచ్చా చిత్ర విశేషాలను మీడియాతో షేర్ చేసుకున్నారు.

- తండ్రీ కొడుకుల మధ్య అనుబంధం నేపథ్యంలో సాగే కథ ఇది. దాంతో పాటు మంచి ప్రేమ కథ ఉంటుంది. తండ్రీ కొడుకుల అనుబంధం కారణంగా వల్ల నాయిక జీవితంలో ఒక అనుకోని ఘటన జరుగుతుంది. దాన్ని సరిదిద్దేందుకు హీరో ఎలాంటి ప్రయత్నం చేశాడు అనేది కథ. సినిమా సరదాగా మొదలై ఇంటర్వెల్ దాకా మంచి సాంగ్స్, లవ్ ట్రాక్‌తో ప్లెజెంట్‌గా వెళ్తుంది. ఇంటర్వెల్ నుంచి పెళ్లి ఇంట జరిగే సందడి మిమ్మల్ని హిలేరియస్‌గా నవ్విస్తుంది. వెన్నెల కిషోర్ సెకండాఫ్‌లో బాగా నవ్విస్తాడు.
- యూరప్‌లోని పోలెండ్‌లో చిత్రీకరణ జరిపాం. అక్కడ కూడా మాకు ఇండియాలో ఉన్నట్లు భోజన, ఇతర వసతులు కల్పించారు నిర్మాత రామ్ కుమార్. ఆయన గురించి, ఆయన మంచితనం గురించి, సినిమా మీద ఉన్న ప్యాషన్ గురించి నేను ఎంత చెప్పినా తక్కువే. మా ప్రొడ్యూసర్‌కి మైత్రీ నవీన్ మంచి ఫ్రెండ్. ఆ రిలేషన్‌తో వారికి సినిమా చూపించాం. వారికి బాగా నచ్చి మైత్రీ మూవీ మేకర్స్ ద్వారా రిలీజ్ చేస్తున్నారు.
- హీరో చేతన్ మంచి టాలెంటెడ్ హీరో. తండ్రి కోసం కొడుకు పడే ఆరాటాన్ని తన పాత్రలో చూస్తారు. కామెడీ, ఫైట్స్, రొమాంటిక్, ఎమోషనల్..ఇలా ప్రతి సీన్‌లో బాగా నటించాడు. అతనికి ఈ సినిమా మంచి ల్యాండ్ మార్క్ మూవీ అవుతుంది. హెబ్బా పటేల్ కూడా తన క్యారెక్టర్‌లో ఆకట్టుకునేలా నటించింది.
- పరిశ్రమలో ఉన్న 80% నోటెడ్ ఆర్టిస్టులతోపాటు రామజోగయ్య శాస్త్రి, గోపీ సుందర్, మంగ్లీ స్క్రీన్ మీద మెరుస్తారు. గోపీ సుందర్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. రీసెంట్ టైమ్స్‌లో ఇలాంటి ఛాట్ బస్టర్ ఆల్బమ్ రాలేదు. ఇందులో రామజోగయ్య శాస్త్రి సింగిల్ కార్డ్ రాశారు. మా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆయనకు సన్మానం చేస్తున్నాం.
- ఈ సినిమా మీరు కొనే టికెట్ ధరకు విలువైన ఎంటర్‌టైన్‌మెంట్ ఇస్తుంది. రీసెంట్‌గా వైజాగ్‌లో పెయిడ్ ప్రీమియర్స్ వేశాం. ఆ ప్రీమియర్స్‌లో దాదాపు ప్రతి సీన్‌కు ప్రేక్షకులు బాగా నవ్వుకున్నారు. వాళ్ల దగ్గర నుంచి వచ్చిన రెస్పాన్స్ సినిమా విజయంపై మరింత నమ్మకాన్ని పెంచింది.

అందమైన గ్రామీణ నేపథ్య కథ


విప్లవ్, అశ్విని

విప్లవ్ దర్శకత్వం వహిస్తూ, ప్రధాన పాత్ర పోషించిన సినిమా 'ఈసారైనా'. ఈ సినిమా ఈ నెల 8న విడుదలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఆదివారం చిత్ర బృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించింది.

ఈ సందర్భంగా హీరో విప్లవ్ మాట్లాడుతూ, 'అందమైన గ్రామీణ నేపథ్యంలో సాగే కథ ఇది. ప్రభుత్వ ఉద్యోగానికి సిద్ధమవుతూ ఒక నిరుద్యోగ యువకుడు అతని ప్రేమను వెతుక్కునే దిశగా ఎలా సాగుతాడు అనేది ఈ సినిమా కథ. ఈ సినిమా మీ అందరి ముందుకు రావడానికి కారణం సంకీర్త్. మొదట్నుంచీ ఆయన మమ్మల్ని బాగా ఎంకరేజ్ చేసారు. ఈ సినిమాకి నేనే ప్రొడ్యూసర్‌ని. అన్నింటినీ కష్టమైనా మేనేజ్ చేశాను. టీజర్, సాంగ్స్ అన్నీ చూడండి. నచ్చితే, సినిమా చూడండి' అన్నారు.

'శిరీష క్యారెక్టర్ నాతో చేయించిన విప్లవ్‌కి కృతజ్ఞతలు. నా ఫస్ట్ సినిమాకి ఇలాంటి క్యారెక్టర్ రావడం సంతోషంగా ఉంది. ఇది సినిమా మాత్రం కాదు. ఒక ఎక్స్‌పీరియన్స్ అని చెప్పొచ్చు' అని హీరోయిన్ అశ్విని చెప్పారు.

కో ప్రొడ్యూసర్ సంకీర్త్ మాట్లాడుతూ, 'నా దృష్టిలో చిన్న సినిమా, పెద్ద సినిమా అంటూ ఏమి ఉండదు. ఒక సినిమా మనతో పాటు ఇంటికి వచ్చిందంటే, అది అందరికీ నచ్చుతుంది. ఈ సినిమాలో కూడా అందరూ ఫీల్ గుడ్ ఎక్స్‌పీరియన్స్ పొందుతారు' అని తెలిపారు. ప్రదీప్ రాపర్తి, మహబూబ్ బాషా, కార్తికేయ దేవ్, నీతు క్వీన్, సత్తన్న, అశోక్ మూలవిరాట్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాత: విప్లవ్, సహ నిర్మాత: సంకీర్త్ కొండా, కథ, మాటలు, స్క్రీన్‌ప్లే- దర్శకత్వం: విప్లవ్, సంగీతం: తేజ్, డి ఓ పి: గిరి, ఎడిటింగ్: విప్లవ్, కళ: దండు సందీప్ కుమార్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: అభినయ్ కొండ, లైన్ ప్రొడ్యూసర్: పూర్ణిమ రెడ్డి.

రోబో రంగంలోకి దిగితే..?


జ్యోతి పూర్వాజ్

పలు సూపర్ హిట్ సీరియల్స్, సినిమాల్లో నటించి పాన్ ఇండియా వీక్షకుల ఆదరణ పొందడంతో పాటు సోషల్ మీడియాలో ఎంతో క్రేజ్ తెచ్చుకున్న హీరోయిన్ జ్యోతి పూర్వజ్. ఆమె ప్రధాన పాత్రలో 'శుక్ర', 'మాటరాని మౌనమిది', 'ఏ మాస్టర్ పీస్' వంటి డిఫరెంట్ సినిమాలతో అందరినీ ఆకట్టుకుంటున్న దర్శకుడు పూర్వాజ్. వీరిద్దరి కాంబోలో 'కిల్లర్' అనే యాక్షన్ థ్రిల్లర్ మూవీ తెరకెక్కుతోంది. ఏయు అండ్ ఐ, మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థతో కలిసి థింక్ సినిమా బ్యానర్ పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పూర్వాజ్ ప్రజయ్ కామత్, ఎ. పద్మనాభరెడ్డి కలయికలో నిర్మాణమవుతున్న రెండవ చిత్రమిది. ఈ చిత్రంలో పూర్వాజ్ కూడా ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆదివారం 'కిల్లర్' పార్ట్ 1: డ్రీమ్ గర్ల్ మూవీ నుంచి జ్యోతి పూర్వజ్ క్యారెక్టర్ ఫస్ట్ లుక్ తో పాటు మోషన్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. చేతిలో గొడ్డలి పట్టుకున్న పవర్‌ఫుల్ మహిళా రోబోను పరిచయం చేశారు. ఆ రోబో జ్యోతి పూర్వజ్ క్యారెక్టర్‌గా మారడం ఆసక్తికరంగా ఉంది. జ్యోతి పూర్వజ్ క్యారెక్టర్ లుక్‌లో ఆమె ఒక భుజానికి వెజిటేబుల్స్ బ్యాగ్, మరో చేతిలో గొడ్డలి పట్టుకుని ఉంది. అద్దంలో ఆమె రిఫ్లెక్షన్ పవర్ ఫుల్ ఉమెన్ రోబోను చూపిస్తోంది. మోషన్ పోస్టర్‌లో చూపించిన ఎలిమెంట్స్ అన్నీ ఈ మూవీపై క్యూరియాసిటీ క్రియేట్ చేస్తున్నాయి. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ - జగదీశ్ బొమ్మిశెట్టి, మ్యూజిక్ - అషీర్ ల్యూక్, సుమన్ జీవరత్నం, నిర్మాతలు - పూర్వాజ్, ప్రజయ్ కామత్, ఎ.పద్మనాభరెడ్డి, రచన- దర్శకత్వం : పూర్వాజ్.

నవచిత్రం

ఘనంగా 'లక్కీ భాస్కర్' విజయోత్సవం


దుల్కర్ సల్మాన్, మీనాక్షి చౌదరి

'నాగవంశీకి శుభాకాంక్షలు. ఒకప్పుడు నన్ను నేను, ఇప్పుడు వంశీలో వెతుక్కుంటున్నాను. 'లక్కీ భాస్కర్' సినిమా చూసిన తర్వాత నాకు దర్శకుడు వెంకీ అట్లూరిపై చాలా గౌరవం పెరిగింది. ప్రేమ కథలతో దర్శకుడిగా తన ప్రయాణాన్ని మొదలు పెట్టిన తను 'సార్' సినిమా నుంచి రూట్ మార్చాడు. ఈ సినిమాలో తను రాసిన డైలాగ్‌లకు, క్యారెక్టర్లను హ్యాండిల్ చేసిన విధానానికి హ్యాట్సాఫ్' అని నిర్మాత దిల్‌రాజు అన్నారు.

దుల్కర్ సల్మాన్, వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో రూపొంది, విడుదలైన సినిమా 'లక్కీభాస్కర్'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రానికి విశేష ఆదరణ లభిస్తోంది. రోజు రోజుకి వసూళ్లను పెంచుకుంటూ సంచలన విజయం దిశగా దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం విజయోత్సవ సభను ఘనంగా నిర్వహించింది. చిత్ర బృందంతో పాటు నిర్మాత దిల్ రాజు, దర్శకులు నాగ్ అశ్విన్, హను రాఘవపూడి తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు. కథానాయకుడు దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ, సినిమా బ్లాక్ బస్టర్ అని నాకు ఫస్ట్ మెసేజ్ చేసింది జి.వి.ప్రకాష్. వెంకీ-జి.వి ఇద్దరూ డైనమిక్ కాంబో. నిర్మాతలకు జి.వి.ప్రకాష్ లాంటి టెక్నీషియన్స్ కావాలి. ఎందుకంటే పాటలు గానీ, నేపథ్య సంగీతం గానీ ఆలస్యం చేయరు. తెలుగు ప్రేక్షకులు నన్ను ఎంతో ఆదరిస్తున్నారు. మీతో నాకు మంచి అనుబంధం ఏర్పడింది. నాగి, స్వప్న 'మహానటి' కోసం నన్ను సంప్రదించినప్పుడు నాకు తెలుగు రాదు అన్నాను. కానీ నన్ను తీసుకొచ్చి, ఈరోజు ఇలా నిలబెట్టారు. ఆ తర్వాత హను రాఘవపడి 'సీతారామం'తో నాకు ఎప్పటికీ గుర్తుండిపోయే చిత్రాన్ని అందించారు. ఇప్పుడు వెంకీ 'లక్కీ భాస్కర్' లాంటి సినిమా ఇచ్చారు' అని తెలిపారు.

"లక్కీ భాస్కర్'తో పాటు దీపావళికి విడుదలైన సినిమాలన్నీ విజయవంతంగా ప్రదర్శితమవుతున్నాయి. ఒక మంచి సినిమా చూసిన ఫీలింగ్ మనతో లైఫ్ లాంగ్ ఉంటుంది. అందుకే ఒకేసారి మూడు మంచి సినిమాలు వచ్చినా ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. రూపాయి గురించి ఆలోచించకుండా పేరు గురించి మాత్రమే ఆలోచించి ఎక్కడా రాజీ పడకుండా ఖర్చు పెట్టారు నిర్మాత నాగవంశీ. ఆయనకు పేరుతో పాటు, సినిమాకి డబ్బులు కూడా రావడం హ్యాపీగా ఉంది' అని అన్నారు.

సరికొత్త అనుభూతినిస్తుంది


మానస వీణ, స్రవంతి పత్తిపాటి

సైన్స్ ఫిక్షన్, మైథాలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న చిత్రం 'రహస్యం ఇదం జగత్'. మన పురాణాలు, ఇతిహాసాల గురించి, శ్రీచక్రం గురించి చర్చిస్తూ ఓ కొత్త అనుభూతిని కలిగించడానికి రాబోతున్న ఈ చిత్రం ఈనెల 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. రాకేష్ గలేబి, స్రవంతి పత్తిపాటి, మానస వీణ, భార్గవ్ గోపీనాథం ముఖ్యతారలుగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని సింగిల్ సెల్ యూనివర్స్ ప్రొడక్షన్ పతాకంపై కోమల్ ఆర్ భరద్వాజ్ దర్శకత్వంలో పద్మ రావినూతుల, హిరణ్య రావినూతుల నిర్మించారు. సినిమా విడుదల సందర్భంగా కథానాయికలు స్రవంతి ప్రత్తిపాటి, మాసస వీణ ఆదివారం మీడియాతో ముచ్చటించారు.

ఆ కాన్సెప్ట్ సర్‌ప్రైజ్ చేస్తుంది : మానస వీణ

'చాలా షార్ట్ ఫిల్మ్‌తోపాటు కొన్ని హాలీవుడ్ వెబ్‌సిరీస్‌లు చేశాను. ఇది నా తొలి సినిమా. నన్ను ఆడిషన్ చేసిన తరువాత అరుణి ఆచార్య అనే పాత్రకు సెలక్ట్ చేశారు. కథ వినగానే సైన్స్ ఫిక్షన్‌కు మైథాలజీని కనెక్ట్ చేసి, టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో సినిమా నేపథ్యం ఉండటం నన్ను ఆకర్షించింది. ఈ కాన్సెప్ట్ ప్రేక్షకుల్ని కూడా సర్‌ప్రైజ్ చేస్తుంది. దర్శకుడు కోమల్ ఆర్ భరద్వాజ్ సినిమా పట్ల ఎంతో ప్యాషన్ ఉన్న వ్యక్తి. ఈ సినిమా చిత్రీకరణ మొత్తం యూఎస్‌లోనే జరిగింది'.

అకిరాగా అలరిస్తా : స్రవంతి పత్తిపాటి

'అమెరికాలో జాబ్ చేస్తూ కొన్ని హాలీవుడ్ చిత్రాల్లో కూడా నటించాను. చాలా స్టేజీషోలు, నాటకాలు వేశాను. ఈ చిత్రంలో నా పాత్ర పేరు అకిరా. తప్పకుండా నా పాత్ర అందరికి నచ్చుతుందనే నమ్మకం ఉంది. రచయిత విజయేంద్ర పసాద్ నాకు తాతయ్య వరుస అవుతారు. ఆయన సలహాలు, సూచనలు నా కెరీర్ కోసం తీసుకున్నాను. ఈ చిత్ర కాన్సెప్ట్‌తో పాటు ట్రైలర్ కూడా నచ్చింది. హనుమంతుడు వేరే లోకలకు ట్రావెల్ చేసినప్పుడు అసలు జరిగిందేమిటి అనేది ఈ కథలో మెయిన్ పాయింట్. ఈచిత్రం నటిగా నాతో పాటు అందరికి మంచి పేరు తీసుకొస్తుంది. ప్రేక్షకులకు ఓ సరికొత్త థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని నమ్ముతున్నాను. దర్శకుడు భరద్వాజ్ ఎంతో తపనతో ఈ సినిమా తీశారు. ఆయన కష్టానికి తగిన ప్రతిఫలం కచ్చితంగా లభిస్తుంది. భవిష్యత్‌లో ఆయన పెద్ద పెద్ద సినిమాలను రూపొందిస్తారు'.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.